## అధ్యాయము 15

# పునరుత్థానము యొక్క అర్థం

ఆధునిక మతపరమైన సందేహవాదము, "ఎవరైనాగాని మరణమును తప్పించుకొని చెక్కుచెదరకుండా ఉన్న సచేతనత్వముతో బ్రతికి బయటపడుతారా?" అని అడుగుతున్నది. పౌలైనను లేదా కొరింథీయులైనను ఈ ప్రశ్న అడుగలేదు. వ్యక్తిగతమైన సచేతనత్వము భౌతిక మరణము నుండి బ్రతికి బయటపడుతుందని యూదులలోను మరియు గ్రీసు దేశస్థులలోను ప్రజాదరణ పొందిన మతము భావించింది. పౌలు ఆందోళన మరి ఎక్కువ నిర్దిష్టమైనదై యుండింది. క్రీస్తునందు విమోచింపబడినవారు చనిపోయిన తరువాత, వారు ప్రభువుతో కూడ దేవుని పరలోక రాజ్యములో దేహముతో జీవిస్తారని అతడు సమర్థించుచుండెను. "దేహముతో" అనేది ముఖ్యమైన ఆలోచనయై యున్నది. యేసు సమాధిలో నుండి లేచి బయటికి వచ్చిన విధంగానే, సమాధిలో ఉంచబడిన దేహము బయటకు వచ్చునని "పునరుత్థానము" అనే పదమే సూచిస్తున్నది.

యేసు ప్రభువు తిరిగి రావడం మరియు క్రైస్తవ యుగం ముగింపవడంతోపాటు శరీర పునరుత్థానము కూడ చోటుచేసు కొంటుందని పౌలు పట్టుబట్టిన తరుణంలో అతని అభిప్రాయం ప్రజాదరణ పొందిన గ్రీకు మతమునకు భిన్నమైనదై యుండెను. అదే సమయంలో, దేహము యొక్క స్వభావం ఐహికమైన దేహమునకు భిన్నమైనదై యుండునని సమ్మతించాడు (15:42, 43). తాను పునరుత్థానము గూర్చిన సకల సందేహాలకు సమాధానం ఇవ్వడానికి సమర్థుడై యున్నాడని అపొస్తలుడు స్వాధికారంతో చెప్పలేదు. కాని భూతమువంటి, అశరీరమైన "దేహము" గూర్చి మాటలాడటం ఈ విషయంలో వితండవాదమ వుతుందని పట్టుబట్టాడు.

మర్త్యులైనవారు మరణమును తప్పించుకొందురనే దృష్టికోణం పట్ల గ్రీకు మతము విముఖమైనదై యుండకపోగా, సాంప్రదాయమైన గ్రీకు దృష్టికోణాలు పౌలు సమకాలీనులైన యూదుల దృష్టికోణం నుండి తగుపాటిగా భిన్నమైనవై యున్నట్టు పరిగణింపబడినవి. *The Odyssey* అనే చలన చిత్రంలోని కథానాయకుడు, "సుదీర్ఘముగా విచారగ్రస్తమై యుండిన రాత్రిలో జీవిస్తున్నారని" చెప్పబడిన మృతులను ఎదుర్కొంటాడు.[1] ఒడిస్సియస్, మర్త్యులు అర్పించిన బల్యర్పణల యెడల తృష్ణగొనియుండిన దెయ్యాలు మరియు వాటి ఛాయలతో కూడిన శోకార్తమైన ఒక సన్నివేశాన్ని ఎదుర్కొంటాడు. పాతాళము (ᾅδης, *hadēs*) యొక్క, అనగా మృతుల లోకము యొక్క వెలుగులేని ప్రదేశమునకు బదులుగా సూర్యుడు ప్రకాశిస్తూ, వర్షాలు కురియుచుండిన లోకంలోని ఏ జీవితమైనా ఎక్కువగా కోరుకొనదగినదని ఎంచబడింది.

హెబ్రీ పదము షియోల్ שְׁאוֹל (*sh*$^e$*'ol*), పాత నిబంధనలో అనేక విభిన్నమైన అత్యల్ప తేడాలుగలదై యుండగా, ప్రవక్తయైన యెహెజ్కేలు, హేడ్స్ గూర్చిన గ్రీకు అవగాహన వంటిది కాని రీతిలో మృతుల నివాస స్థానము గూర్చి మాటలాడుతున్నాడు. అదొక చీకటిగానున్న స్థలమనియు, అందులోనికి దైవభక్తిగలవారిచే వధింపబడిన అన్యమతారాధికులైన రాజులు మరియు వారి దళములు వెళ్లారనియు అవగతం చేసుకొనబడింది (యెహె. 32:18-21). పునరుత్థానమైన జీవితం, శక్తిపూర్ణమైనదై యుంటూ, అదే సమయంలో ఈ యుగ సంబంధమైన అనిశ్చయాంశములు మరియు విచారములు లేనిదై యుంటుందని పౌలు ప్రకటించాడు.

శతాబ్దాలతరబడి, గ్రీకులు విదేశాల నుండి తేబడిన క్రొత్త దేవుళ్లను వారి దేవగణములోనికి చేర్చుకొనుటకు అలవాటు పడిపోయారు. వారు యూదుల దేవునితో కూడ ఇదే విధానంలో వ్యవహరించడం వారికి అసాధ్యమయ్యింది. యేసు క్రీస్తు యొక్క తండ్రి గ్రీకు దేవతలవంటివాడై యుండలేదు ఏలయనగా ఆయన మినహాయింపైన రీతిలో దేవుడై యున్నాడని స్వాధికారాపేక్షతో సెలవిచ్చాడు. ఈ విషయం, గ్రీకులలో అనేకుల దృష్టిలో న్యాయ విరుద్ధమైనదై యుండింది. యూదులు, వారి దేవుని గూర్చి స్వాధికారపూర్వకంగా పలుకుచుండిన విషయాల్లో చెప్పశక్యము కానంత దురహంకారులై యుండిరని వారు ఎంచారు.

వారి మూలములు గ్రీకు సంస్కృతిలో నిలిచియుండిన కొరింథులోని కొందరు క్రైస్తవులు వారి పాత దేవతలను విడిచిపెట్టుటలో వివేకంతో ప్రవర్తించారు. దేవాలయములలో బలులర్పించుట మరియు భోజనము చేయుట ప్రాముఖ్యమైనవై యుండిన పాత సామాజిక జీవితంలో నుండి సంపూర్తిగా తెగదెంపులు చేసుకోడానికి వారు సంకోచించుచుండిరి (8:9, 10; 10:14). పూర్వం గ్రీకు దేవతల భక్తులై యుండినవారు క్రీస్తును తమ ప్రభువుగా అంగీకరించినప్పుడు, ఈ నూతన కట్టుబాటుతోపాటు monotheism అనే సిద్ధాంతం వచ్చిందని వారు అర్థం చేసుకొన్నారు. కాని గ్రీకు తత్త్వజ్ఞాన సంబంధమైన ఆలోచనా ధోరణిని విడిచిపెట్టడం వారికి కష్టంగా ఉండింది. అది వారు తప్పించుకోడానికి కష్టపడుచుండిన ప్రాపంచిక దృక్పథంలోనికి బహు నాజూకుగా అస్థిగతము చేయబడింది. మరణము తరువాతి జీవితం గూర్చిన వారికుండిన అభిప్రాయం ఈ ప్రాపంచిక దృష్టికోణానికి ముఖ్యమై యుండింది. మరణము తరువాతి జీవితము గూర్చి గ్రీకులు మరియు క్రైస్తవులలో ఉండిన భావాలలో సంఘర్షణలు అనివార్యమయ్యాయి.

7:1తో మొదలుపెట్టుచు, కొరింథీ సంఘం వారి సొంత సభ్యులలో నుండి ముగ్గురితో (16:17) పౌలు నొద్దకు ఉత్తరములో పంపించిన ప్రశ్నలకు పౌలు సమాధానాలిచ్చాడు. వారడిగిన వెవ్వేరు ప్రశ్నలను, ". . . వాటి విషయము" (7:1; 8:1; 12:1) అనే మాటలతో ప్రవేశపెట్టాడు. అపొస్తలుడు, కొరింథీయులడిగిన చివరి ప్రశ్నకు వచ్చాడన్నట్టు కనబడుతున్నది. అది మృతుల పునరుత్థానము గూర్చిన ప్రశ్న. ఈ ప్రశ్నకు పౌలు ముడిపెట్టిన ప్రాముఖ్యత, అతడు అంతకు పూర్వం ప్రయోగించిన పరిచయపూర్వక సూత్రము లేకుండానే అతడు దాని గూర్చి వేగిరపడినట్లుంది.

అతడు కొరింథీయుల నుండి పొందిన ఉత్తరములో పునరుత్థానము గూర్చిన

ప్రశ్నలేవియు లేకుండెను గనుక అతడు పదబంధ ప్రయోగమును చేయలేదనేది మరొక సాధ్యత కావచ్చు. ఇట్టి సందర్భంలో, కొరింథులోని విభిన్నమైన దృష్టికోణముల గూర్చి అపొస్తలుడు క్లోయెకు సంబంధించిన వారి నుండి (1:11), ఉత్తరమును తీసికొనివచ్చిన ముగ్గురి నుండి, లేదా మరొక మూలాధారము నుండి తప్పక తెలుసుకొని యుంటాడు. ఏదేమైనప్పటికిని, అతని యెదుట ఉంచబడిన సమస్యల పరిష్కారమునకై 7వ అధ్యాయం మొదలుకొని పద్ధతి ప్రకారమైన అతని ప్రయాసములు వారడిగిన ప్రశ్నలలో పునరుత్థానము గూర్చిన ఆందోళనలు కూడ ఉండినదని సూచింపవచ్చు.

## క్రీస్తు లేచియున్నాడు (15:1-11)

**[1]మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను. [2]మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచియున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనే గాని, నేను ఏ ఉపదేశరూపముగా సువార్త మీకు ప్రకటించితినో, ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొని యున్న యెడల ఆ సువార్త వలననే మీరు రక్షణపొందినవారై యుందురు. [3]నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేదనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను, సమాధిచేయబడెను, [4]లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను. [5]ఆయన కేఫాకును, తరువాత పండ్రెండుగురికిని కనబడెను. [6]అటుపిమ్మట ఐదువందలకు ఎక్కువైన సహోదరులకు ఒక్క సమయమందే కనబడెను. వీరిలో అనేకులు ఇప్పటి వరకు నిలిచియున్నారు, కొందరు నిద్రించిరి. [7]తరువాత ఆయన యాకోబునకును, అటుతరువాత అపొస్తలులకందరికిని కనబడెను. [8]అందరికి కడపట అకాలమందు పుట్టినట్టున్న నాకును కనబడెను. [9]ఏలయనగా నేను అపొస్తలులందరిలో తక్కువవాడను. దేవుని సంఘమును హింసించినందున అపొస్తలుడనబడుటకు యోగ్యుడనుకాను. [10]అయినను నేనేమైయున్నానో అది దేవుని కృపవలననే అయియున్నాను. మరియు నాకు అనుగ్రహింపబడిన ఆయన కృప నిష్ఫలము కాలేదు గాని, వారందరి కంటె నేనెక్కువగా ప్రయాసపడితిని. ప్రయాసపడినది నేను కాను, నాకు తోడైయున్న దేవుని కృపయే. [11]నేనైననేమి వారైననేమి, ఆలాగుననే మేము ప్రకటించుచున్నాము, ఆలాగుననే మీరును విశ్వసించితిరి.**

క్రీస్తునందలి విశ్వాసం, ఆయన మృతులలో నుండి లేచాడనియు, ఆయన తిరిగి వచ్చుచున్నాడనే నమ్మకమును అనివార్యమైన అంశంగా చేస్తుందని పౌలు నొక్కి చెప్పాడు. ఆయన చేత రక్షింపబడినవారు కూడ సమాధులలో నుండి లేచి వత్తురని చెప్పుకోడానికి (15:20) క్రీస్తు పునరుత్థానం హామీయై యుండింది. ఆయన రెండవసారి ప్రత్యక్షమైనప్పుడు, క్రీస్తునందు మృతులైనవారు లేతురు, మరియు శరీర రూపంలో నున్న నిత్య జీవం పొందుదురు. యేసు యొక్క శరీర పునరుత్థానము లేకుండా రక్షణ లేదనేది బయలుపరచబడిన విషయమైయున్నది. ఈ ఒక్క సత్యమే, క్రైస్తవ్యమునకు ఒక విశాలమైన పునాది రాయిగా ఏర్పడుతున్నది. ఆయన దేవత్వము మరియు

ఆయన మన కొరకు మరణించుటచేత ధ్రువీకరింపబడుచున్నవి. ఈ సత్యము చర్చించుటకుగాని, మార్చుటకుగాని వీలుకానిది. క్రీస్తు పునరుత్థానము క్రైస్తవులు సుస్థిరంగా నిలబడగలుగుటకు ఆధార శిలయై యున్నది.[2]

**వచనము 1.** యేసు క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండి ఏలుబడిని సాగించునట్లును, యేసు ఒకానొక దినాన మరల వచ్చునట్లును దేవుడాయనను మృతులలో నుండి లేపాడనే **బోధలు** పౌలు మరియు అతని సహచరులు కొరింథు పట్టణంలో ప్రబోధించిన సువార్తకు మౌలికమై యుండినవి. అపొస్తలుడు వారిని తన మందలింపులలోనికి సున్నితంగా నడిపించాడు. మృతుల పునరుత్థానము గూర్చిన అతని చర్చ కొరకైన ప్రారంభాంశము, తననుతానే తన కుమారుడైన యేసు క్రీస్తునందు బయలుపర్చుకొనిన దేవునియందు వారు విశ్వాసముంచారని కొరింథీయులకు గుర్తు చేయుచుండిన ఒక జ్ఞాపికయై యుండింది. వారు క్రీస్తునందు విశ్వాసముంచుటలో పౌలు పక్షం వహించారు గనుక వారు రక్షింపబడ్డారు; వారు అతడు ప్రకటించిన (τὸ εὐαγγέλιον ὅ εὐηγγελισάμην ὑμῖν, *to euangelion ho euēngelisamēn humin*, "నేను మీకు ప్రకటించిన సువార్త") సువార్తను అంగీకరించారు. అపొస్తలుని సందేశం పిడివాదంతో కూడినదై యుండింది. గనుక అది గ్రీకుల మతపరమైన ఆలోచనా ధోరణితో ఏకీభవించదు. యేసు తిరిగి వచ్చినప్పుడు, సాధారణమైన పునరుత్థానము మరియు సజీవులకును మృతులకును తీర్చబడు తీర్పు ఉంటుంది (2 కొరింథీ. 5:10 చూడుము). పౌలు, కొరింథులోని తన తోటి విశ్వాసులనందరిని సామాన్య నిరీక్షణ మరియు సంకల్పములో ఐక్యపరచిన బంధనము లోనికి తిరిగి రాబట్టు కొన్నాడు.

మృతుల పునరుత్థానము గూర్చి ప్రశ్నించడము, క్రైస్తవ విశ్వాస ఒప్పుకోలు విషయంలో రాజీపడుటయై యుండినదని పౌలు వక్కాణించాడు. మృతుల పునరుత్థానము లేదనినవారు చిన్నచిన్న వివరాల గూర్చి లేదా అభిప్రాయభేదాల గూర్చి వాదించడం లేదు. దేవుని రాజ్యము యొక్క పునాది వారి క్రింద కుప్పకూలిపోవుటకు వారి సందేహం హేతువగుచుండింది. అలాగైతే, క్రైస్తవులు, ఇప్పుడున్నట్టు, నజరేయుడైన యేసు జగదుత్పత్తికి మునుపే వాగ్దానము చేయబడిన మెస్సీయయై యున్నాడనే అతి ముఖ్యమైన నమ్మకంపై నిలిచియుండిరి. యేసును నిద్రించినవారిలో ప్రథమ ఫలముగా మృతులలో నుండి లేపుట ద్వారా, యేసు, తన కుమారుడై యున్నాడని దేవుడు ప్రకటించాడు (రోమా. 1:4; 1 కొరింథీ. 15:20). సమస్త మానవాళి దేవునితో సఖ్యపడుటకు యేసు ప్రవేశద్వారమై యున్నాడు. యేసు సమాధి ఖాళీగా ఉండింది, గనుక శరీర పునరుత్థాన ప్రక్రియ అప్పటికే ఆరంభమయ్యింది. ఒక విధంగా చూస్తే, మృతుల పునరుత్థానములో పాల్గొనడానికి క్రైస్తవులు అదివరకే మొదలుపెట్టారు. పునరుత్థానమును ప్రశ్నించడం క్రీస్తునందలి విశ్వాసమును కాదనడంతో సమానమైనదై యుండింది.

**వచనము 2.** వికృతమైన ఒక గ్రీకు పదబంధముతో (τίνι λόγῳ εὐηγγελισάμην ὑμῖν εἰ κατέχετε, *tini logō euēngelisamēn humin ei katechete*, "నేను మీకు ప్రకటించిన సువార్తను . . . అంగీకరించితిరి, దానియందే నిలిచియున్నారు"; 15:1, 2), ఆతడు వారికి ఉపదేశించిన సందేశం, దాని చేత వారు రక్షింపబడినదై యుండినదని

పౌలు కొరింథీయులకు జ్ఞాపకం చేశాడు. విమోచింపబడినవారి మధ్య వారు ఎడతెరిపిలేకుండా జీవించడమనేది వారు అంగీకరించిన ఒప్పుకోలునకు స్థిరంగా హత్తుకొని యుండుట మీద ఆధారపడియుండింది. వారికి సత్యమును బోధించడం ద్వారా పౌలు తన వంతు పని చేశాడు. వారు క్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా తమ వంతు పని చేశారు. వారు ఒప్పుకొనిన ఒప్పుకోలును అంటిపెట్టుకొని యుంటే తప్ప, అతడు మరియు వారు కలిసి వేసిన పునాది కుప్పకూలిపోతుంది. కొన్ని దుష్ట శక్తులు, మరణించిన తరువాత శరీర పునరుత్థానము సాధ్యమేనా అనే సందేహాన్ని కొరింథులోని కొందరు విశ్వాసుల మనస్సుల్లో కలిగిస్తూ వారిని మభ్యపెట్టుచుండినవి. ఇటువంటి పరిస్థితుల్లో ఆదిలో వారు ఒప్పుకొనిన ఒప్పుకోలును వారు గట్టిగా పట్టుకొని యుంటే తప్ప, క్రీస్తునందలి వారి నిరీక్షణ ఫలించదు. వారి **విశ్వాసం వ్యర్థమైన** దవుతుంది. వారి రక్షణకు హేతువైన సందేశం మృతుల పునరుత్థానమును ధ్రువీకరించింది. పౌలు వారికి ప్రకటించిన సందేశము ద్వారా వారు రక్షింపబడ్డారు. వారు పౌలు సందేశాన్ని నమ్మారు. శరీర పునరుత్థానము సువార్తకు అప్రధానం కాదు; అది అత్యంత ప్రాముఖ్యమైనదై యుండింది.

తదనంతర దశాబ్దాలలో, గ్రీకు విశ్వాసులు శరీర పునరుత్థానము గూర్చిన ఆలోచన విషయంలో ఎదుర్కొనుచుండిన ఎడతెరిపిలేని పోరాటం దానంతట అదే వెవ్వేరు రీతుల్లో బయల్పడింది. క్రైస్తవులగుట వలన వారికి మరణము నుండి ఆత్మసంబంధమైన, అక్షరార్థముకాని పునరుత్థానము ప్రాప్తించినదని కొందరు భావించినట్టు విదితమవు తున్నది. బహుశా పౌలు బోధల్లో కొన్నింటిని వారు అపార్థం చేసుకొన్నందు వలన ఇలా జరిగియుంటుంది (ఉదా. రోమా. 6:4). వారిలో కొందరు, పునరుత్థానము అదివరకే గతించిపోయిందని చెప్పుచుండిన హుమెనైయు మరియు ఫిలేతు వంటి ఉపదేశకుల మాటలు నమ్మియుండవచ్చు (2 తిమోతి 2:17, 18). బాప్తిస్మము సమయంలో పాప విషయమై మరణించి లేపబడిన వారి ఆత్మలు, పరలోకంలో జీవిస్తాయి, కాని శారీరక జీవితం ఈ లోకం కొరకు ప్రత్యేకించి ఉంచబడినదని వారన్నారు. స్పష్టంగా, కొరింథులోని ఏ ఒక్కరైనను పౌలు బోధల నుండి యింకా అంత దూరంగా వెళ్లిపోలేదు, కాని పునరుత్థానమైన శరీరం ఆత్మసంబంధమైన లోకంలో ఎలా జీవించగలదోయని అర్థం చేసుకోడానికి వారిలో కొందరు ప్రయాసపడుచుండిరి. హుమెనైయు మరియు ఫిలేతు యొక్క అబద్ధ బోధలకు దారి తీసే విత్తనాలు అదివరకే విత్తబడినవి.

**వచనములు 3, 4.** కొరింథులోని తన సోదరసోదరీమణుల కొరకు, క్రైస్తవ విశ్వాసమునకు సంబంధించిన ప్రాథమిక ఒప్పుకోలును, ప్రారంభ విషయాన్ని సవివరంగా వర్ణించాడు. అతని మాటలు క్రొత్త నిబంధనలోగల విశ్వాస ప్రమాణము వంటి ఒకే ఒక్క విషయాన్ని క్రోడీకరిస్తున్నాయి: క్రీస్తును గూర్చిన సువార్త. ద్వితీ. 26:5-9, ఇశ్రాయేలు ప్రజలకు ఒప్పుకోలు గూర్చిన ప్రాథమిక అంశమై యుండిన విధంగా,[3] క్రీస్తు మన పాపముల కొరకు మరణించాడు, పాతిపెట్టబడ్డాడు, మరియు దేవుని శక్తి చేత మృతులలో నుండి లేపబడ్డాడనేది క్రైస్తవుల మౌలిక నమ్మకమై యున్నది. ἐν πρώτοις (*en prōtois*) అనే పదబంధము "అన్నిటి కంటె ముందు" (KJV; NKJV; ASV) అని అర్థం చేసుకొనవచ్చు, కాని అది "మొదటి ప్రాముఖ్యతయై యున్నట్టుగా" (NASB;

NIV; NRSV; ESV) అని విశ్వాస విషయమైన ప్రాథమికాంశాలపై ఉండిన పౌలు ఉద్ఘాటనను సూచించుచున్నది. **నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితి**నని అపొస్తలుడు కొరింథీయులకు తెలియజెప్పాడు. పౌలు, తనకియ్య బడిన ఉపదేశమును ఎవరి నుండి "పొందాడు"? గలతీ. 1:11, 12లో, తాను ప్రకటించిన సువార్త మనుష్యుల వలన పొందలేదని అతడు వక్కాణించాడు. అట్లయినను, పునరుత్థానుడైన క్రీస్తును గూర్చిన సాక్ష్యమును పౌలు అతనికంటె ముందుండిన అపొస్తలులు మరియు ఇతర విశ్వాసుల నోట విన్నాడు, దానిని అంగీకరించాడు. అతడు తాను క్రీస్తునంగీకరింపక మునుపు ప్రకటింపబడిన సందేశము నుండి ఏ విధంగా ప్రక్కకు తొలగినను, అతని పరువుప్రతిష్ఠ ప్రశ్నార్థకమ వుతుందని అతడు అత్యంత జాగరూకుడై యుండెను. అతడు వారికి అందజేసిన సందేశం పునరుత్థానుడైన క్రీస్తునకు ప్రత్యక్ష సాక్షులై యుండిన అపొస్తలుల సాక్ష్యమై యుండిందనే విషయాన్ని కొరింథీయులు తెలిసికోవాలని పౌలు ఆశించాడు. ఇతర అపొస్తలులు నమ్మిన సందేశాన్నే అతడు కూడ నమ్మాడు: క్రీస్తు మరణము మానవాళి పాపము కొరకు ప్రత్యామ్నాయమైన ప్రాయశ్చిత్తమై యుండినది (1 కొరింథీ. 15:3సి). అది పాత నిబంధనలోని మెస్సీయాను గూర్చిన ప్రవచనముల నెరవేర్పై యుండినది.

తన సందేశం **లేఖనముల ప్రకారమైనదై** యుండినదని పౌలు రచించినప్పుడు, అతడు పాత నిబంధన లేఖనముల గూర్చి భావించాడని తన తొలి పాఠకులు అర్థం చేసికొనవలెను. యేసు యొక్క మరణ పునరుత్థానములు "దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యద్ జ్ఞానమును అనుసరించినవై" యుండినవనే ఋజువును ఈ లేఖనములు సమకూర్చాయి (అపొ. 2:23). పిలాతు యేసును సిలువవేయబడుటకు పంపించినప్పుడు, యేసును అతడు ఆయన చేసిన నేరములనుబట్టి గాని, లేదా మానవుల కుయుక్తులనుబట్టి పంపలేదు. బహుశా, క్రీస్తు శ్రమనొందవలసి యున్నదని సాక్ష్యమిచ్చిన లేఖనములలోని నిర్దిష్టమైన వాక్యభాగం పౌలు మనస్సులో లేకపోయి యుండవచ్చు. కాని ఇందుకు సంబంధించినవి అనేక లేఖన భాగాలున్నాయి (ఉదా. యెషయా 53వ అధ్యాయం చూడుము).

పౌలు ఉపదేశాల్లో అతనికి ముందుండినవారు ప్రకటించిన అదే సందేశమున్నది. అతని సిద్ధాంతం ఏ విధంగానైనను విశిష్టమైనదై యున్నదని లేదా అతనికి ముందుండిన అపొస్తలుల బోధలతో భిన్నంగా యున్నదని అతడు గలతీయులకు వ్రాయబడిన పత్రికలో ఎన్నడును స్వాధికారాపేక్షతో పలుకలేదు. సువార్త, అన్యజనుల కొరకు మరియు యూదుల కొరకు కూడ ఉద్దేశింపబడిందనే ప్రత్యక్షతను అతడు క్రీస్తు నుండి పొందాడు. అతని నియామకములోని ఈ భాగం అతనిని గలతీయలోనికి అనుసరించినవారి చేత గంభీరంగా తర్కింపబడుచుండిన విషయమై యుండింది. అతనికి ముందుగా బలమైన స్తంభములై యుండినవారి నుండి అతడు నేర్చుకొనిన అదే సువార్త ఒప్పుకోలు అతని ప్రాథమిక సందేశమై యుండింది. కాని ఈ సందేశమును అతడు ఏ భేదములేకుండా యూదులకును, అన్యజనులకును ప్రకటింపవలెనని యేసు అతనికి ఒక ఆజ్ఞ ఇచ్చారు (గలతీ. 1:16 చూడుము).

పౌలు సిద్ధాంతంలోని ఏ ఒక్క భాగమైనను యేసు **మృతిపొందెను**,

**మాధిచేయబడెను**, **మూడవ దినమున లేపబడెను** అనే ముఖ్యమైన సత్యమునకు ముందుండలేదుమిగిలిన సమస్త విషయాలు దీని నుండి వెలికి వచ్చాయి. అది అకృత్రిమమైన కాలములో సంభవించిన సంఘటనలలోగల నమ్మకము గూర్చిన ఒక ఒప్పుకోలై యుండింది. అదొక మర్మమైన అనుభవం కాదు, అదొక కల్పితమైన (పౌరాణిక) ధ్రువీకరణము కాదు. "సమాధి చేయబడెను" అని పేర్కొనబడటం, ఈ పదమునకు సంబంధించిన వైద్యపరమైన ఏ నిర్వచనము ప్రకారమైనను, యేసు మరణించాడని సాక్ష్యమిచ్చింది. యేసు సమాధిచేయబడుట లూకా యొక్క ప్రకటనను యింకా ఎక్కువ అసాధారణమైన అంశంగా చేసింది: ఏర్పరచుకొనిన సాక్షులకు, "ఆయన శ్రమపడిన తరువాత, . . . అనేక ప్రమాణములను చూపి వారికి తన్నుతాను సజీవునిగా కనుపరచుకొనెను" (అపొ. 1:3).

పాత నిబంధనలో ప్రవచింపబడిన ప్రకారం సంభవించినవని చెప్పడంలో పౌలు భావమేమై యుండినదో మొత్తానికి స్పష్టంగా లేదు. **లేఖనముల ప్రకారము** అనే మాటలు, "మూడవ దినమున లేపబడెను" అని చెప్పుతున్న ఒక ధ్రువీకరణమై యుండగలదు. లేదా, అది, ఆయన సమాధి చేయబడెను, "మూడవ దినమున" పునరుత్థానుడాయెను అనే అతని ప్రకటన అంతటి గూర్చినదై యుండవచ్చు. యేసు సమాధి చేయబడెనని పేర్కొనబడటం సందర్భోచితమైనదై యున్నట్టు కనబడుతున్నది; మరణించినవారు సమాధి చేయబడుదురు. అతడు చెప్పుచుండిన విషయం నిశ్చయంగా నిశ్చయమైనదై యున్నదని ధ్రువీకరించడానికి పౌలు, "యేసు సమాధి చేయబడెనను" మాటలను చేర్చియుంటాడు. ఇదియుగాక, యేసు "మూడవ దినమున లేపబడెననుటకు" పాత నిబంధనలో నుండి చాలా తక్కువగా ప్రస్తావింపబడును. యోనా యొక్క అనుభవమునకును, ఆయనకు సంభవింపనై యుండిన దానికిని మధ్య (మత్తయి 12:40), యేసు ఒక చక్కని సాదృశ్యమును రాబట్టినప్పుడు, యోనాకు మరియు ఆయనకు సంభవించిన విషయానికి ఆయన చిహ్నాత్మకమైన రూపంలోగల సంబంధమును జోడించుచున్నట్టు కనబడుతున్నది. యోనా చెప్పిన ఏ విషయమైనను క్రీస్తు మూడవ దినాన లేచునని సూచించలేదు. పౌలు, క్రీస్తును గూర్చిన పాత నిబంధన ప్రవచనంతో ముడిపెట్టదలచిన విషయం సమాధిచేయబడుట కాదు, కాని పునరుత్థానమై యున్నది. ఇది అపొ. 2:25-28లో వ్రాయబడియున్న వివరము మరియు పౌలు పత్రికల ద్వారా స్పష్టమవు తున్నది. మూడవ దినము, ప్రవచనము యొక్క నెరవేర్పై యున్నదని, అపొస్తలుడు యింకెక్కడైనను చెప్పలేదు.

**వచనము 5.** పేతురు మారుపేరు **కేఫా** పౌలుకు ఎంతో ప్రీతికరమైనదై యున్నది. పేతురు పేరును పౌలు తన రెండు పత్రికల్లో, అనగా గలతీయులకు వ్రాసిన పత్రిక మరియు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికలో పేర్కొన్నాడు. పౌలు అతనిని "పేతురు" అని రెండు పర్యాయాలు పిలిచాడు (గలతీ. 2:7, 8) మరియు "కేఫా" అని ఎనిమిదిసార్లు పిలిచాడు (1 కొరింథీ. 1:12; 3:22; 9:5; 15:5; గలతీ. 1:18; 2:9, 11, 14). పేరును గూర్చిన ఎంపిక పౌలు, గ్రీకు కంటె ఎక్కువగా అరమెయిక్ పేరును ఇష్టపడుతున్నట్టు తెలుపుచున్నది. పౌలు పత్రికలకు వెలుపల, దుడుకు అపొస్తలుడు, "కేఫా" అని యోహాను 1:42లో మాత్రమే పిలువబడ్డాడు. ఈ అపొస్తలుడు "సీమోను"

అని లూకా చేత పిలువబడినప్పటికిని, లూకా 24:34లో వ్రాయబడినట్లు, యేసు తన పునరుత్థానము తరువాత పేతురునకు ప్రత్యక్షమగుట గూర్చి పౌలు ప్రస్తావించుట సంభావ్యమే.

స్పష్టంగా, పౌలు ఈ వచనంలో పేర్కొన్నట్టు, పన్నెండు మంది అపొస్తలులు అక్కడ లేకుండినప్పటికిని, యేసు పన్నెండు మంది శిష్యులకు ప్రత్యక్షమగుట, లూకా 24:36-43 మరియు యోహాను 20:19-23లో వ్రాయబడిన విషయమై యున్నది. ఇస్కరియోతు యూదా గాని, తోమా గాని అక్కడ లేరు. కాలము గతించిన కొలది నెమ్మదిగా, అపొస్తలులు పునరుత్థానుడైన యేసు ప్రత్యక్షతలను ఇతరులకు తెలియజెప్పారు. గనుక వారి సాక్ష్యము యేసు వారసత్వంలో భాగమయ్యింది.

యేసు కథనము సువార్తల వృత్తాంతములలో చెప్పబడిన తదనంతరము, యేసునకు అత్యంత సన్నిహితులై యుండినవారు, "పన్నెండు మంది" అని రెండుసార్లు మాత్రమే పిలువబడ్డారు (అపొ. 6:2 మరియు ఇక్కడ 1 కొరింథీ. 15:5లో). ఈ రెండు రిఫరెన్సుల్లోను, నిస్సందేహంగా అది వ్రాయబడవలసి యుండినప్పటికిని, "అపొస్తలులు" అనే మాట "పన్నెండు మంది" అనే మాట తరువాత రావడం లేదు. ప్రకటన 21:14లో "పన్నిద్దరు అపొస్తలులు" అనే పదజాలం కనబడుతుంది. ఇస్కరియోతు యూదా స్థానంలో మత్తీయ ఏర్పరచుకొనబడిన తరువాత, "పదనొకండు మంది అపొస్తలులతో కూడ లెక్కింపబడెను" (అపొ. 1:26). నిస్సందేహంగా, పెంతెకొస్తు దినాన పేతురు మాటలాడుచుండినప్పుడు "ఆ పదునొకరు" - ఇతర అపొస్తలులు - కూడ అచ్చట ఉండిరని మనము అర్థం చేసుకొనవలసి యుంటుంది (అపొ. 2:14).

మొదటి శతాబ్దమునాటి సంఘం, "అపొస్తలులు" అనే ఈ మాట యొక్క అర్థం ఏమైయున్నదని భావించింది? ఈ పదము యేసుతో కూడ వ్యక్తిగతంగా సహచరులైన ఆ పన్నెండు మంది గూర్చి ప్రత్యేకంగా ప్రయోగింపబడిన పదమై యుండిందా (మత్తయి 10:2; లూకా 6:13)? కొంత మేరకు, "అపొస్తలుడు" అనే పదాన్ని క్రొత్త నిబంధన సాంకేతికపరంగాను మరియు దాని ఉత్పత్తి విషయంలోను ప్రయోగించుచున్న పరిస్థితి నుండి గందరగోళం తలెత్తుచున్నది. దాని ఉత్పత్త్యర్థం చొప్పున, అపొస్తలుడు, ఆదర్శమైన కార్యభారము అప్పగింపబడినవాడై యున్నాడు. పౌలు, యేసు సహోదరుడైన యాకోబును సంఘంలోని ఇతర నాయకులతోపాటు గలతీ. 1:19లో "అపొస్తలులు"గా కలిపివేస్తున్నట్టు కనబడింది. ఈ పదము సముచితమైనదై యుండింది ఎందుకనగా యెరూషలేము సంఘంలో పేతురు మరియు యోహానులకుండిన అదే ఆదర్శమైన కార్యభారంలో మరియు నాయకత్వ పదవిలో యాకోబు కూడ పాలు పంచుకొంటున్నాడు (గలతీ. 2:9 చూడుము). పౌలు మరియు బర్నబా, అంతియొకయలోని సంఘం తమ ఆదర్శమైన కార్యభారము నిమిత్తము పంపించిన అపొస్తలులై యుండిరి (అపొ. 13:1-3). యేసు తానే ఒక అపొస్తలుడై యుండెను (హెబ్రీ. 3:1), అనగా దేవుడాయనకు తన ఆదర్శమైన కార్యభారమును అప్పగించినవాడై యుండెను. యూదయలోని బీదల నిమిత్తము కానుకలు పోగుచేయుమని అతడు పంపించిన సహోదరులను సూచించడానికి పౌలు ఇదే పదమును దాని ఉత్పత్త్యర్థంతో ఉపయోగించాడు. ఈ సహోదరులను NASB "దూతలును, వార్తాహరులు" అని

సూచిస్తున్నది (2 కొరింథీ. 8:23).

యేసు పునరుత్థానుడైన తరువాతి తొలి పెంతెకొస్తు దినాన పరిశుద్ధాత్మ కుమ్మరింపబడక మునుపు, అపొస్తలులు, పరిశుద్ధాత్మ చేత నడిపింపబడినవారై, వారి సంఖ్యను మరలా పన్నెండుగా చేసుకొన్నారు (అపొ. 1:21-26). ఈ పన్నెండు మంది అపొస్తలులు ఆయన పరిచర్య ఆరంభమైనప్పటి నుండి యేసునకు సహచరులు గాను, పునరుత్థానుడైన ప్రభువును కళ్లారా చూచిన ప్రత్యక్ష సాక్షులునై ఉండవలసి యుండింది. స్పష్టంగా, "పన్నెండు" అనే సంఖ్య యాకోబు యొక్క పన్నెండు మంది కుమారులు మరియు ఇశ్రాయేలు యొక్క పన్నెండు గోత్రములతో సాంకేతికపరమైన సార్ధకతగలద్దై యుండింది. ఏదేమైనప్పటికిని, సంబంధిత సంగతి వెల్లడియగుచుండగా, ఇదే సంఖ్య నిర్వహింపబడునట్లు ఏ ప్రయత్నమైనను చేయబడిందని అపొస్తలుల కార్యముల పుస్తకం సూచించుట లేదు. యోహాను సహోదరుడైన యాకోబు రాజైన హేరోదు చేతుల్లో తన ప్రాణాలు కోల్పోయినప్పుడు, అతని స్థానంలో మరొకరు ఏర్పరచుకొనబడిన విషయమేమియు గ్రంథస్థం చేయబడలేదు (అపొ. 12:2). పన్నెండు మంది అపొస్తలులతో అతనికి కూడ సమాన స్థానం ఉండిందని పౌలు స్వాధికారంతో చెప్పాడు (1 కొరింథీ. 9:1; 2 కొరింథీ. 12:12; గలతీ. 1:1). కాని అతడు మరొకరి స్థానంలో ఏర్పరచుకొనబడినట్టు చెప్పలేదు. ఇంతేగాక, అతని అపొస్తలత్వము విశేషమైనదని పౌలు అంగీకరించాడు (1 కొరింథీ. 15:8-10). బర్నబా మరియు పౌలు అంతియొకయలోని సంఘము యొక్క రాయబారులుగా కలిసి యుండిన సందర్భంలో మాత్రమే పౌలును లూకా, "అపొస్తలుడు" అని పిలిచాడు. అపొస్తలుల కార్యముల పుస్తక రచయిత, "పన్నెండు మంది అపొస్తలులు" అనే బిరుదును యేసు ప్రభువుతో కూడ సాన్నిహిత్యముగా ఉండి ఆయన పునరుత్థానమునకు ప్రత్యక్ష సాక్షులై యుండిన వారి కొరకే ప్రత్యేకించినట్లు కనబడుతున్నది.

పౌలు, సంఘంలోని నాయకత్వ పాత్రల జాబితాను రచించినప్పుడు, "దేవుడు సంఘములో మొదట కొందరిని అపొస్తలులుగాను . . ." అని రచించాడు (12:28, 29; ఎఫెసీ. 4:11 చూడుము). "పన్నెండు మంది" అనే పదము మరి ఎక్కువ వివరణ లేకుండానే అపొస్తలుల కార్యముల పుస్తకంలోను, కొరింథీయులకు వ్రాయబడిన పత్రికలోను ప్రయోగింపబడుట, అపొస్తలుల గూర్చి ప్రస్తావించుటకు అదొక సర్వసామాన్యమైన తీరైయుండిందని సూచించుచున్నది. అపొస్తలత్వమును అంటిపట్టుకొని యుండిన అధికారమునుబట్టి, తన అపొస్తలత్వము గూర్చి స్వాధికారాపేక్షతో చెప్పుచుండినది పౌలునకు ప్రాముఖ్యమై యుండింది, గాని ఉన్నత వర్గమునకు చెందినవారికి అంటకట్టబడి యుండు గౌరవమునుబట్టి కాదు. పేతురు లేదా యోహాను విషయంలో, పౌలు చెప్పినది మరియు చేసినది దేవుడు చేయుచుండిన కార్యమై యుండింది (1 కొరింథీ. 2:13; 2 కొరింథీ. 12:12). పరిశుద్ధాత్మ యొక్క ఇతర అద్భుతకరమైన ప్రత్యక్షతల వలెనే, పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడిన క్రొత్త నిబంధన యొక్క సాక్ష్యము మరియు క్రొత్త నిబంధన ప్రామాణిక లేఖనములు ప్రవేశపెట్టబడుట వలన ఇది కూడ దాని ఉనికిని కోల్పోయింది. మొదటి శతాబ్దమునాటి సంఘానికి పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడిన అపొస్తలుల మార్గదర్శకత్వం అవసరమయ్యింది, కాని

అట్టిది తదుపరి శతాబ్దములలోని సంఘానికి అవసరములేదు.

**వచనము 6.** పునరుత్థానుడైన యేసు, **ఐదు వందలకు ఎక్కువైన సహోదరులకు ఒక్క సమయమందే కనబడిన** సంఘటనను పౌలు మాత్రమే గ్రంథస్థం చేశాడు. **వీరిలో అనేకులు ఇప్పటి వరకు నిలిచియున్నారు, కొందరు నిద్రించిరి.** మరణమును పౌలు, "నిద్ర" అని నియమము తప్ప ప్రస్తావించాడు (κοιμάω, *koimaō*, 1 కొరింథీ. 7:39; 11:30; 15:18, 20; 1 థెస్స. 4:15). యేసు తన పునరుత్థానము తరువాత ఇటువంటి జనసమూహమునకు అగపడుట, సువార్తలలోగాని లేదా అపొస్తలుల కార్యముల పుస్తకంలోగాని పేర్కొనబడకుండా యెరూషలేములో జరిగియుంటుందనేది సంభావ్యము కాదనిపిస్తుంది. ఈ హేతువును బట్టి, వారు నమ్ముతున్నది అనిశ్చయమైనదని అంగీకరించుచున్నప్పటికిని, 1 కొరింథీ. 15:6లో పేర్కొనబడిన సంఘటన గలిలయలో చోటుచేసుకొన్నదని అనేక మంది బైబిలు విద్యార్థులు పట్టుబట్టుచుందురు. యేసు యొక్క పునరుత్థానము తరువాత గలిలయలోని ప్రత్యక్షతలు వ్యాఖ్యానకర్తలకు అత్యంత ఆకర్షణీయమైన అంశంగా ఉంటున్నవి. అర్థ వివరణ పద్ధతులు మొత్తం, పునరుత్థానము తరువాత సంఘం యెరూషలేము నుండి గలిలయకు భారీ సంఖ్యలో తిరోగమించిందనే భావంపై నిర్మింపబడుచుండినవి.[4]

మార్కు మాటల ప్రకారం, యేసు, పునరుత్థానము తరువాత తన శిష్యులకు గలిలయలో అగపడునని ఆయన వారికి వాగ్దానం చేశాడు (మార్కు 14:28; 16:7). ఈ వాగ్దానం మత్తయి వ్రాసిన సువార్తలో కూడ ఉన్నది. ఈ వివరము యేసు వారికి గలిలయలోని పర్వతముపై ప్రత్యక్షమయ్యాడని చెప్పుతున్నది (మత్తయి 26:32; 28:16, 17). యేసు గలిలయలో ప్రత్యక్షమగుట గూర్చి లూకా సువార్తికుడు ఏమియు పేర్కొనలేదు, కాని శిష్యులు గలిలయ సముద్రములో చేపలు పట్టుచుండగా వారిని కనుగొన్నాడనియు, పేతురు మరియు "ఇతర శిష్యులతో" మాటలాడాడనియు యోహాను సువార్తికుడు సాక్ష్యమిచ్చాడు (యోహాను 21:4-14). 1 కొరింథీ. 15:6లో పేర్కొనబడిన సంఘటన గలిలయలో చోటుచేసుకొన్నదో లేదో గాని, ఐదు వందల మంది సాక్ష్యమును పౌలు నమ్ముతున్నాడని స్పష్టమవుతున్నది. ఈ సాక్షులలో అనేకులు ఇంకను జీవించియుండిరని అతడు తన పాఠకులకు జ్ఞాపకం చేస్తున్నాడు. వారి సాక్ష్యము గూర్చిన సందేహం లేదు. సందేహించదలచినవారు ఇంకను సజీవులై యుండినవారిని కలుసుకొని వారు చూచిన దాని గూర్చిన వివరాలు అడిగి తెలుసుకొనవచ్చు.

**వచనము 7.** యేసు **యాకోబునకు** ప్రత్యక్షమగుట గూర్చి కూడ పౌలు మాత్రమే పేర్కొన్నాడు. ప్రశ్నార్థకంగా ఉన్న యాకోబు దాదాపుగా ప్రభువు సహోదరుడై యుండెను (గలతీ. 1:19). యోహాను సహోదరుడైన యాకోబు అంతకు మునుపే చనిపోయాడు (అపొ. 12:2). అయితే యేసు సహోదరుడైన యాకోబు యెరూషలేములోని సంఘంలో ఒక నాయకుడయ్యాడు (అపొ. 12:17; 15:13; 21:18). బహుశా ఈ ప్రత్యక్షత మూలముననే యాకోబు మరియు యూదా ప్రభువునంగీకరించి యుందురు (అపొ. 1:14). అపొస్తలులకు కలిగిన రెండవ ప్రత్యక్షత బహుశా యోహాను 20:26-29 లేదా అపొ. 1:1-9లో ప్రస్తావింపబడినదైయుంటుంది. ఈ వచనములో పేర్కొనబడిన

**అపొస్తలులు** 15:5లో పేర్కొనబడిన "పన్నెండు మంది" కంటె భిన్నమైనవారని చెప్పదలచువారికి, అలా చెప్పడానికి బైబిలు సంబంధమైన ఏ ఆధారమైనను లేదు.

యేసు పునరుత్థానము ప్రత్యక్షతల ఈ జాబితా సమగ్రమైనది కాదు. అలా సమగ్రమైనదై యుండాలని పౌలు నిశ్చయంగా ఉద్దేశించినట్లు లేదు. యేసు మృతులలో నుండి లేచాడను విషయం నిజమని నిరూపించుటకు అతడు వరుసగా పేర్కొనిన ప్రత్యక్షతలు పుష్కలమైన చారిత్రాత్మక సాక్ష్యమును సమకూర్చుచున్నవి. సువార్తలలోని వృత్తాంతములు, స్త్రీలు ఖాళీ సమాధిని కనుగొనిన తరువాత యేసు వారికి శరీరముతో ప్రత్యక్షమైన ఇతర వివరాలను గ్రంథస్థం చేశాయి. అత్యధికంగా, చారిత్రాత్మక సాక్ష్యమును గూర్చిన సత్యమును మళ్లీ మళ్లీ చెప్పగల మరియు ఆధునిక ప్రయోగశాలలో సక్రమమని ప్రకటింపగల సంఘటనలకు పరిమితము చేయువారు మాత్రమే యేసు అక్షరాలా సశరీరుడుగా వాస్తవికమైన కాలములో మృతులలో నుండి లేచాడనే విషయాన్ని సందేహిస్తారు.

**వచనము 8.** యేసు ఇతరులకు ప్రత్యక్షమైన వారితో కూడ తనను చేర్చుకొంటూ, యేసు పౌలునకును ఇతరులకు ప్రత్యక్షమైన విధానంలో చెప్పుకోదగినంత వ్యత్యాసముండినప్పటికిని, దమస్కు మార్గంలో యేసు అతనికే ప్రత్యక్షమయ్యాడని పౌలు పేర్కొంటున్నాడు (అపొ. 9:3-6). యేసు ఆరోహణుడైన తరువాత ఆయన పౌలుకు ప్రత్యక్షమయ్యాడు (అపొ. 1:9). ఇతరులకు ఆయన తాను ఆరోహణుడు కాకమునుపు ప్రత్యక్షమయ్యాడు. ప్రభువును చూచుట అపొస్తలత్వమునకు ఒక అర్హత అయ్యింది (1 కొరింథీ. 9:1). ప్రభువు తన పునరుత్థానము తరువాత పౌలునకు ప్రత్యక్షమైన తీరులోను ఇతరులకు ప్రత్యక్షమైన విధానములోను తేడాలుండినవని పౌలు అంగీకరిస్తూ, పునరుత్థానుడైన క్రీస్తును ఇతరులు చూచుట ఎంత నిశ్చయమో, అతడు చూచుట కూడ అంతే నిశ్చయమైనదని చెప్పుతున్నాడు. **అకాలమందు పుట్టినట్టున్న** (ὡσπερεὶ τῷ ἐκτρώματι, *hōsperei tō ektrōmati*) అతనికి అపొస్తలత్వమును యేసు అనుగ్రహించాడని ప్రకటించడం ద్వారా అతడు ఈ తేడాలను వక్కాణించాడు. అతడు అపొస్తలుల శ్రేణిలో చేరడం సాధారణ క్రమం కాదు, కాని అతడు అపొస్తలుడై యుండునట్లు, దమస్కు మార్గంలో చోటుచేసుకొనిన సంఘటన అతనిని అర్హునిగా చేసిందని అతడు ధ్రువీకరించాడు. విశ్వాసం విషయంలోను, దానిని అభ్యసించు విషయంలోను, అతనికి అపొస్తలత్వ అధికారమున్నదని సంఘాలు అతనిని గౌరవించాల్సి వుండింది. అపొస్తలత్వ అధికారం వ్యక్తిగతంగా ఇవ్వబడినా లేదా వ్రాతమూలకంగా ఇవ్వబడినదా, అతడు తన ఆదేశాలను ప్రభువు నుండి పొందాల్సివుండిందనేది ఆచరణాత్మకమైన అంతరార్థమై యుండింది.

పౌలు తన అపొస్తలిక పిలుపు గూర్చి చెప్పుతూ, "అకాలమందు పుట్టినట్టున్న" (ἔκτρωμα, *ektrōma*) అని పేర్కొంటున్న సాంకేతికపరమైన పదజాలము గూర్చి మనమేమని అర్థం చేసుకోవాలి? ఈ పదజాలము క్రొత్త నిబంధనలో ఈ ఒక్కసారి మాత్రమే కనబడుతుంది, కాని ప్రాచీన గ్రీకు వైద్య సాహిత్యంలో అది దాదాపు సర్వసామాన్యమైనదై యుండింది. అది గర్భస్రావము చేయబడిన లేక గర్భపాతమైన పుట్టుకను, అనగా, చాలా ముందుగా సంభవించిన అస్వాభావికమైన సంఘటనను

సూచించినది.[5] ప్రయోగాత్మకమైన ఏ అంచనా ప్రకారమైనను, పౌలు అపొస్తలుడుగా నుండుటకియ్యబడిన పిలుపు ఆశించిన సమయాని కంటె ముందుగా ఇయ్యబడలేదు. దీనికి విరుద్ధంగా, దమస్కు మార్గంలోని దర్శనము అపొస్తలత్వ శ్రేణులు మూసివేయబడ్డాయని అనుకొనబడుతున్న చాలా కాలం తరువాత కలిగింది.

అతడు తన దృష్టినంతా తన పిలుపులోని ఒక అల్పమైన కోణంపై కేంద్రీకరించాలని ఆశించాడి గనుక పౌలు ఈ ఉపమాలంకారమును ఉపయోగించుటకుగల అత్యంత సామాన్యమైన వివరణయై యున్నది. విస్తృతమైన సామ్యముల నిమిత్తము ఈ ఉపమాలంకారముగాని ఇతరమైనదేదైనను విశ్లేషింపబడకూడదు. *ektrōma* అనే గ్రీకు పదము, ఆశింపబడిన విషయాలు చోటుచేసుకొను విధానమునకు వెలుపల బిడ్డ పుట్టుటను సూచించినది. పౌలు క్రీస్తునంగీకరించిన కాలం మరియు అతనికి అపొస్తలత్వము అనుగ్రహించబడిన కాలం, ఆశించిన వరుస క్రమంలో లేవు. ఈ దృష్టికోణం చొప్పున, అతడు "అకాలమందు పుట్టినట్టే" లెక్క. ఈ ఉపమాలంకారమును యింత కంటె ఎక్కువ లోతుగా విశ్లేషించాల్సిన అవసరం లేదు.

మరొక ప్రశ్న తలెత్తుచున్నది అలాగైతే, **అందరికి కడపట . . . నాకును కనబడెను** అనే పౌలు రచనల అంతర్భావాలేమిటి? బహుశా "అన్యజనులకు అపొస్తలుడు" అనే మాటలు, అతడు అపొస్తలుల జాబితాలో, "అందరికి కడపట" చేర్చబడినాడనియు, అతని తరువాత ఎవరును కలుపబడకూడదనియు అర్థమీయ వచ్చు. అది అతని వినయమును సూచించుచుండినదనేది "అందరికి కడపట" అనే ఈ వ్యక్తీకరణము యొక్క అర్థమై యుండవచ్చు. "నాకును" అనే అంతిమ మాటలు κἀμοί (*kamoi*) అనే గ్రీకు పదమును అనువదించుచున్నవి. ఈ పదము, "ఆయన నా వంటి వానికి కూడ కనబడ్డాడు" అనే అపనమ్మకమును వ్యక్తము చేయవచ్చు. "అందరికిని కడపట" అనే మాటలు కేవలము జాబితాను ముగించడానికి ఉపయోగించ బడుతున్న సాధనం కావచ్చుననేది మూడవ సాధ్యత.

అక్షరార్థం కాని పునరుత్థానము గూర్చిన భావాలను నిరుత్సాహపరచునట్లు పౌలు తన అపొస్తలిక అధికారముపై ఆధారపడవలసిన అవసరత ఉండినందువలన, వినయపూర్వకమైన "అందరికి కడపట" అనే పదజాల ప్రయోగం సముచితమైనదిగా అగుపించడం లేదు. తన అధికారమును నొక్కివక్కాణించునట్లు పౌలు చేపట్టవలసి యుండిన ప్రాథమిక కార్యం గూర్చి యోచించినట్లయితే, "అందరికి కడపట" అనే పదజాలము అపొస్తలుల సంఖ్యకు అతడు చేర్చుకొనబడిన తరుణంలో, అతనితోనే అపొస్తలుల శ్రేణి ముగిసిపోయిందనే తన ఒప్పింపును సూచించడానికి ఎక్కువ అవకాశాలు కలవు. సందర్భం ఏదైతేనేమి, పౌలు అపొస్తలుడై యుండెను. గనుక ఒక అపొస్తలుడుగా, పునరుత్థానము గూర్చి పరిష్కారముగా మాటలాడగలిగాడు.

**వచనము 9.** పౌలు, యేసు ప్రత్యక్షతలను, విశ్వాసుల శరీర పునరుత్థానము గూర్చి తాను ఉద్ఘాటించుచుండిన విషయానికి ఒక ఉపోద్ఘాతముగా, ఒక దాని తరువాత మరొకదానిని వరుసగా వివరించుచుండెను. పునరుత్థానుడైన యేసు గూర్చిన తన సొంత సాక్ష్యము దమస్కు మార్గములో చోటుచేసుకొనిన దర్శనము మరియు తదనంతరము అపొస్తలుడుగా నియామకములోనికి దారి తీసినది. ఏదేమైనప్పటికిని,

15:9-11లో, పౌలు యొక్క వ్యక్తిగతమైన అనుభవాలు కాదు గాని ప్రభువు యొక్క శరీర పునరుత్థానము ప్రధానాంశమై యున్నది.

పౌలు తన పరిచర్యకు ఆధారంగా నిలుస్తున్న రెండు స్థిరనిశ్చితమైన వాస్తవాల విషయంలో రాజీపడుట లేదు. ఒకటి, తన అపొస్తలత్వము పన్నెండు మంది అపొస్తలుల అదే క్రమ ప్రకారమైనదై యుండింది. ఆతని అధికారము తోటి అపొస్తలులలో నుండియైనను లేదా ఏ మానవునిలో నుండియైనను రాబట్టుకొనబడింది కాదు (గలతీ. 1:1). ప్రభువు తానే అతనిని అపొస్తలుడుగా నియామకము చేశాడు. రెండవది, ప్రభువు అతనకి యిచ్చిన గౌరవము ఆధారంగా, అపొస్తలుని హృదయంలో తన సొంత అయోగ్యత గూర్చి గంభీరమైన అవగాహన ఉండింది. ఒక విధంగా, అతడు **అపొస్తలులందరిలో తక్కువవాడు**. కాని అతని నమ్రత ఎటువంటి అప్రధానమైన హోదాలో నుండి పుట్టుకొనిరాలేదు. అతడు **దేవుని సంఘమును హింసించినందున తననుతాను** అత్యల్పుడుగా పరిగణించుకొన్నాడు. ఒకానొక సమయంలో, అతడు క్రైస్తవుల వెంటబడి వారిని వేటాడుచు వారిని తీర్పునకును మరణమునకును అప్పగించాడనే విషయాన్ని పౌలు మర్చిపోలేదు (అపొ. 22:4; 1 తిమోతి 1:12-14). దేవుని సంఘమును హింసించడం ద్వారా, అతడు తన ఉగ్రత నంతటిని క్రీస్తునకు విరోధంగా కుమ్మరించుచుండెనని అతడు తెలుసుకొన్నాడు (అపొ. 9:4, 5). అతడు వెనుదిరిగి ఈ విషయాలను జ్ఞాపకం చేసుకొన్నప్పుడు, క్రీస్తును వ్యతిరేకించుచుండినంత కాలం తన జీవితం చీకటిమయమై యుండిందని తెలుసుకొన్నాడు.

పౌలు అత్యంత భక్తిగల యూదుడు మరియు దేవుని సంఘమును హింసించుచుండినవాడునై యుండుట, నిశ్చ యాత్మకమైన ప్రభావం లేనిదైయుండలేదు. ఈ నేపథ్యం తాను చేపట్టిన పరిచర్య పనులకు అపరిమితమైన విశ్వసనీయతను తెచ్చిపెట్టింది. అతడు క్రైస్తవులను ఎదుర్కొనుచుండిన తొలి రోజుల నుండే, సువార్త సందేశములోని అంతరార్థములను తెలుసుకొనగల పరిజ్ఞానమును పౌలు కలిగియుండెను. నజరేతువాడైన యేసును వెంబడించువారిని యూదు మతములోనికి చేర్పించడం అసాధ్యమనే విషయాన్ని అతడు ఎల్లవేళలందు గుర్తించాడు. ఒకే సందేశం మరియు ఒకే స్వాధికారాపేక్షలతో, యూదులు మరియు అన్యజనులు దేవుని యెదుట సమానులుగా నిలువబడియుండిరి. యూదులకు విలక్షణమైన స్వాధికారాపేక్ష ఏదియు లేదు. సువార్తలోని అంతర్భావములను ఎదిరించుట, తార్సువాడైన సౌలు తన సకల శక్తిసామర్థ్యములను "మార్గమును" నాశనము చేయడానికి ఉగ్రముగాను, మన పూర్వకంగాను అంకితము చేయుటకు కారణమయ్యింది. అయితే, దేవుడు తన మహా కృపనుబట్టి ఎటువంటి పక్షపాతమునైనను ప్రదర్శించకుండా యూదులకు మరియు అన్యజనులకు చేరువయ్యాడని తెలుసుకొనిన తరువాత, పౌలు తగుపాటైన తన తలాంతులను అతడు అంతకు మునుపు హింసించిన అదే హేతువున బలపర్చుటకు ఉపయోగించుకొన్నాడు. ఆ తరువాత దేవుడతని ద్వారా క్రీస్తు సందేశమును ప్రపంచమందతటను వ్యాపింపజేయు తన కార్యమును సఫలీకృతము చేశాడు. అతడు అన్యజనులకు దేవుని అపొస్తలుడయ్యాడు.

**వచనము 10.** అపొస్తలుడు ప్రతి విషయానికి దేవుని కృపను ముందుంచుతు, తన పరిచర్య గూర్చిన ఒక సారాంశమును మొదలుపెట్టి ముగించాడు. పౌలు, ప్రశంసనీయమైన పని చేశాడని తనను గూర్చి తానే ప్రగల్భాలు పలుకలేదు. దేవుని కృపనుబట్టియే, అతడు ఇతర అపొస్తలుల కంటె ఎక్కువ ప్రయాసపడగలిగాడు, ఎక్కువ ఫలసిద్ధి గావించాడు. వారందరి కంటె నేనెక్కువగా **ప్రయాసపడితిని** అనే ప్రకటన, పన్నెండు మంది అపొస్తలులు కలిసి చేసిన దాని కంటె తానే ఎక్కువగా ప్రయాసపడ్డాడని అర్థమిచ్చుచున్నట్టు స్పష్టమవుతున్నది. F. F. Bruce ఈ విషయాన్ని కొంచెం భిన్నంగా దృష్టించాడు. "పౌలు, తన యజమానుని మూర్తిమంతము మరియు పని గూర్చిన సార్వత్రిక అంతర్భావాలను యేసు ఏర్పరచుకొనిన ఆదిమ శిష్యులందరి కంటె ఎక్కువ గొప్పగా పరిగణించాడనియు, వాటికి ప్రయోగాత్మకమైన సార్థకతను ఆరోపించాడని (అన్నట్టు అగుపిస్తున్నదని)" అతడు చెప్పాడు.[6] పౌలు, పన్నెండు మంది అపొస్తలులలో ఏ ఒక్కరైనా అయియుండినట్టి సమస్త అర్థాలతో, ఒక అపొస్తలుడై యుండెనని కొరింథీయులు తెలుసుకొనడం అగత్యమై యుండింది. కొరింథులోని క్రైస్తవులు పౌలు మాటల పట్ల ప్రదర్శించిన మర్యాద వారు క్రీస్తు పట్ల ప్రదర్శించిన విశ్వసనీయతకు ఆరంభ అంశమై యుండింది.

అపొస్తలుడు తన సొంత ప్రయాసములను దేవుని కృప దృష్ట్యా అంచనావేశాడు. ప్రయాసపడినది **నేను కాను, నాకు తోడైయున్న దేవుని కృపయే** అని అతడు రచించాడు. పౌలు అపొస్తలుడై యుండవలెనని దేవుడతనిని పిలుచుట ద్వారా ఆయన తన కృపను అనుగ్రహించాడు గనుక తార్సువాడైన ఈ యూదుడు ఆ పిలుపునకు సార్థకంగా ప్రతిస్పందించాడు. దేవుడతని పట్ల ప్రదర్శించిన **కృప నిష్ఫలము కాలేదు**. గనుక దేవుడు కొరింథీయులకు అనుగ్రహించిన కృప సహితం నిష్ఫలము కాదనే నమ్మకం పౌలు కలిగియుండెను (15:58). దేవుడు పౌలును నియమించిన దాని ఫలితంగాను, అట్టి నియామకమునకు అపొస్తలుడు చూపిన విధేయతతో కూడిన ప్రతిస్పందననుబట్టియు, దేవుని దైవకృతమైన సమస్త మానవాళి రక్షణార్థమైన సంకల్పము ఈ సహోదరులలో సఫలీకృతమయ్యింది. దేవుడు ప్రతిపాదించిన కృప పట్ల పౌలు, అనేకులు చేసినట్లే, భిన్నంగా ప్రతిస్పందించి యుండవచ్చు. రక్షణ కార్యము విషయంలో దేవుడే చొరవ తీసుకొన్నాడు గనుక, విశ్వాసము మరియు విధేయతతో ప్రతిస్పందించువారికి విమోచన కలుగుతుంది.

**వచనము 11.** పౌలు, ప్రభువు అతనిని నియమించుట వలన ప్రాప్తించిన స్వాతంత్ర్యము మరియు ప్రభువు అపొస్తలత్వమును అప్పగించిన ఇతరుల యెదుట అతనికిగల స్థాయికిని మధ్య ఉండిన సున్నితమైన ఒక త్రాడు మీద నడుచుచుండెను. 15:9లోని "వారు"నకు "అపొస్తలులు" అనే పదము ముందుగా వచ్చుచు, ఇది "పండ్రెండుగురిని" గూర్చిన సమూహమునకు సమానమై యున్నది (15:5). **నేనైతేనేమి వారైతేనేమి** ఏమి చేసినను, అది పట్టింపుగా పట్టించుకొనదగిన పనై యుండలేదు ఎందుకనగా వారందరును ప్రభువు వలన పొందిన బృహత్కార్యములో పాలుపంచుకొన్నారని పౌలు చెప్పాడు. వీరు, కొరింథీయులు విశ్వాసముతో ఆలింగనము చేసుకొన్న అదే సందేశాన్ని ప్రబోధించారు. అన్నిటి కంటె ముందుగా, సందేశం

యెరూషలేములో సిలువవేయబడిన చరిత్ర పురుషుడును, నజరేతువాడునైన యేసును గూర్చిన ఒక నిర్ధారణ, ఒక ఒప్పుకోలై యుండింది. ఆయన, మనుష్యులందరు మరణించు విధంగానే మరణించాడు. కాని దేవుడాయనను సమాధిలోనే విడిచిపెట్టలేదు. మూడవ దినాన, దేవుడాయనను మృతులలో నుండి లేపాడు - సశరీరునిగా లేపాడు.

కొరింథీయులను, పౌలును, మరియు పన్నెండుమంది అపొస్తలులను ఒక్కటిగా కలిపిన సందేశం, యేసు దేహం లేపబడనట్లయితే నిరర్ధకమైపోయేదే. ఈ ప్రాథమికాంశాలను తన వెనుక ఉంచుకొని, కొరింథులో తలెత్తిన మరొక వివాదాన్ని ఎదుర్కోడానికి పౌలు సంసిద్ధుడయ్యాడు. తరువాతి విభాగంలో, విమోచింపబడినవారికి రానున్న యుగంలో దేవుడు వాగ్దానము చేసిన జీవిత లక్షణము గూర్చి అతడు సంబోధించాడు.

## ఖాళీ సమాధి (15:12-19)

యేసు గుర్తింపు గూర్చి, ఆయన దేవత్వమంతటి గూర్చిన అర్ధమంతటితోసహా, దేవుడిచ్చిన వ్యక్తిగత సాక్ష్యము, మృతులలో నుండి యేసు పునరుత్థానము చేత బలపరచబడింది (రోమా. 1:4). పౌలు ప్రకటనలు స్పష్టంగా ఉన్నప్పటికిని, శరీర పునరుత్థానము గూర్చిన బైబిలు సంబంధమైన సాక్ష్యముతో రాజీపడుటకు చేయబడు ప్రయాసములు నేటికిని అంతములేకుండా కొనసాగుతున్నాయి. పౌలు, కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికలో ఖాళీ సమాధి గూర్చి పేర్కొనలేదుకదా అని ప్రతికూల విమర్శకులు సూచింప గోరుతున్నారు. ఖాళీ సమాధి గూర్చిన సాంప్రదాయము, అటుతరువాత ప్రచారములోనికి వచ్చినదై యుండినదని చెప్పబడింది. క్రైస్తవ యుగంలోని ఎనిమిదవ దశాబ్దమునాటికల్లా, సువార్తల నివేదికలు రచింపబడుటకు నిబద్ధతతో మొదలైనప్పుడు, ఖాళీ సమాధి సాంప్రదాయములో పాతుకొనిపోయినదయ్యిందని కొందరు విమర్శకులు చెప్పుదురు. ఏదేమైనప్పటికిని, ఖాళీ సమాధి గూర్చి పౌలు ఒకడు ఆశించుచున్నంత స్పష్టమైన ప్రస్తావన లేకపోవుట తర్కించడానికి అత్యల్పమైన అంశమై యున్నది, అది అపొస్తలుని సాక్ష్యమును తీవ్రంగా అంచనావేయాల్సిన విషయం కాదని తెలివిగా చేయబడు పరీక్ష వెల్లడిస్తున్నది. యేసు పునరుత్థానము శరీర పునరుత్థానమై యుండినదని పౌలు దృఢంగా నమ్మాడు. ఈ విషయంలో మనము పౌలును అపార్థం చేసుకొనజాలము. *యేసు దేహమును దేవుడు మృతులలో నుండి లేపినప్పుడు, ఆయన దేహము ఉంచబడిన సమాధి ఖాళీ అయ్యిందనేది స్పష్టమైన పరిణామవుతుంది.*

పునరుత్థానము గూర్చిన పౌలు తర్కము కొరింథీయులకు ముఖ్యమైన మూడు విషయాలను సూచించినది. (1) యేసు మరణించాడు, సమాధి చేయబడ్డాడు, మరియు తిరిగి లేచాడనేది కొరింథీ క్రైస్తవులు ఒప్పుకొనిన సందేశం, పౌలు మరియు ఇతర అపొస్తలులు బోధించిన సందేశమై యుండింది. (2) పునరుత్థానము, గ్రంథస్థం చేయబడిన సువార్తకు ఒక అనుబంధం కాదు. అదే దాని సారమై యుండింది. (3) యేసు పునరుత్థానమును కాదనుట, దేవుడు తనను తాను ఒక రక్షకుడుగా

బయలుపరచుకొన్నాడు అనే విషయాన్ని కాదనుటతో సమానమైనదై యుండింది. యేసు పునరుత్థానము - అక్షరాలా, శరీర పునరుత్థానము - లేకుండా, క్రైస్తవులు పట్టుదొరకని విశ్వాసము విషయమై అత్యాశగల నిరాశ నిస్పృహలతో కూడిన ప్రజలైపోతారు.

**[12]క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడని ప్రకటింపబడు చుండగా మీలో కొందరు - మృతుల పునరుత్థానము లేదని ఎట్లు చెప్పుచున్నారు? [13]మృతుల పునరుత్థానము లేని యెడల క్రీస్తు కూడ లేపబడి యుండలేదు. [14]మరియు క్రీస్తు లేపబడి యుండని యెడల మేము చేయు ప్రకటన వ్యర్థమే; మీ విశ్వాసమును వ్యర్థమే. [15]దేవుడు క్రీస్తును లేపెనని, ఆయనను గూర్చి మేము సాక్ష్యము చెప్పుచున్నాము గదా? మృతులు లేపబడని యెడల దేవుడాయనను లేపలేదు గనుక మేమును దేవుని విషయమై అబద్ధపు సాక్షులముగా అగపడుచున్నాము. [16]మృతులు లేపబడని యెడల యేసు క్రీస్తు కూడ లేపబడలేదు. [17]క్రీస్తు లేపబడని యెడల మీ విశ్వాసము వ్యర్థమే; మీరింకను మీ పాపములలోనే యున్నారు. [18]అంతే కాదు, క్రీస్తునందు నిద్రించిన వారును నశించిరి. [19]ఈ జీవితకాలము మట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షణగలవారమైన యెడల మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులమై యుందుము.**

**వచనము 12.** సువార్త ప్రాథమికాంశములను పూర్వాభ్యాసం చేసినందునుబట్టి పౌలు, మనస్సుకు తాకునట్లు చెప్పబడిన ఒక అన్వయమును వెలికి తీశాడు. క్రైస్తవ విశ్వాసము యొక్క, అపొస్తలులు మరియు కొరింథీ సహోదరుల చేత హత్తుకొనబడిన ఒక నమ్మకము యొక్క తొలి ధ్రువీకరణములలో యేసు పునరుత్థానమున్నదని ఒప్పుకొన్న తరువాత, **మృతుల పునరుత్థానము లేదని** వారిలో కొందరు చెప్పడం, అదెలా సాధ్యమవుతుంది? ఒకని ఆత్మ మరియు దేహము వాటి ఉనికి నిమిత్తము ఒక దాని మీద మరొకటి ఆధారపడి యున్నవని కొందరు గ్రీకు తత్వజ్ఞులు చెప్పుచుండిరి. దేహము మరణించినప్పుడు, ఏమియు మిగిలియుండదని వారనుకొన్నారు. ఏదేమైనప్పటికిని, మరణానంతర జీవితం లేదని చెప్పే స్థితికి కొరింథీయులు వెళ్లలేదని స్పష్టమవుతున్నది. ప్రజలు మృతులకు బాప్తిస్మమిచ్చినప్పుడు ఏమిచేయుచుండినప్పటికిని (15:29), మరణానంతరము ఏదో ఒకటి బ్రతికి ఉంటుందనే వారి నమ్మకమును ఈ వాడుక సూచించినది.

గ్రీకులు మరియు రోమీయులు పరిపాలించుచుండిన ప్రపంచంలో, నేటి ఆధునిక లోకంలో ఉన్నట్టే, ఒకరు మరణించినప్పుడు ఏమి జరుగుతుందోననే విషయం గూర్చిన దృష్టికోణాలు నానా విధములుగా ఉండినవి. "అంత్యదిన సిద్ధాంతము గూర్చిన మితిమీరిన అవగాహన"తో, అనగా, సర్వసాధారణంగా అంత్య దినములతో సంబంధంగలదై యుండిన పునరుత్థానము ఇదివరకే చోటుచేసుకొన్నదనే భావంతో కొరింథీయులకు జబ్బు సోకిందనేది ఆధునిక వ్యాఖ్యానకర్తల్లో సర్వసామాన్యమైన దృష్టికోణమై యున్నది. యేసే క్రీస్తైయుండెనని నమ్ముచు, ఆయన బోధించిన జీవితమును అవలంబించుట, "మృతులలో నుండి లేపబడుటయై యుండినదని" కొందరు చెప్పుదురు. పౌలు ఈ విషయాలను రచించిన కనీసం వంద సంవత్సరముల

తరువాత జీవించిన వేదాంత జ్ఞానవాదియైన విశ్వాసి, "వారు మొదట మరణిస్తారు, ఆ తరువాత లేస్తారని చెప్పెడివారు పొరపాటు చేస్తున్నారు. వారు జీవించియున్నప్పుడే వారు పునరుత్థానమును మొదట స్వీకరించనట్లయితే, వారు మరణించినప్పుడు వారికేమియు లభించదని" రచించాడు.[7] అటుతరువాత తలెత్తిన వేదాంత జ్ఞానవాదము కలగాపులగంగా నుండిన నమ్మకములను కలిపి నందువలన విస్తృతమైన మానసిక కల్పనలు ఏర్పడినవి.[8] రానైయుండిన యుగము వచ్చేసిందనియు గనుక పునరుత్థానము గతించిన విషయమనియు కొందరు వేదాంత జ్ఞానవాదులు చెప్పారు (2 తిమోతి 2:18 చూడుము). కాని ఇవ్విధమైన దృష్టికోణాలు మొదటి శతాబ్దం మధ్య కాలంలో, పౌలు ఇంకా సజీవుడుగా ఉండినప్పుడు, కోకొల్లలుగా ఉండినవని చెప్పడానికి గల నిదర్శనము కొరవడుతున్నది.

శరీర పునరుత్థానము గూర్చి ప్రశ్నించిన కొరింథు పట్టణంలోని విశ్వాసులు దాని గూర్చి తర్కించిన విధానమును మనము కేవలము ఊహించుకొనాల్సిందే. ప్లేటో మొదలుకొని ఆ తరువాతి గ్రీకుల పాండిత్యం, దేహము మరియు ఆత్మకు మధ్య ఒక నిశితమైన వ్యత్యాసాన్ని ఆనవాలుగా తెలిపారు. ఆత్మ, శరీరంలో చిక్కుకొని పోయిందను నమ్మకముండింది. ఒకరు మరణించినప్పుడు బలహీనమైన మరియు కలుషితమైన భౌతిక శరీరంలో నుండి ఆ ఆత్మ విడుదల చేయబడుతుందనియు, అప్పుడది రెక్కలు కట్టుకొని పరలోక ప్రదేశాల్లోనికి ఎగిరిపోయి ఒక విధమైన సార్వత్రిక ఆత్మలో కలిసిపోతుందనియు భావింపబడింది. గ్రీకు విద్వాంసులు భౌతిక శరీరము మరియు సుగుణశీలియైన ఆత్మకు మధ్య పొందికను గుర్తించలేకపోయారు. దీనికి తారతమ్యంగా, దేహము మరియు ఆత్మ గూర్చిన పౌలు గ్రహింపునకు పాత నిబంధన ప్రత్యక్షత మూలాధారమై యుండింది.

> పౌలు ప్రకారం, ఆత్మకును దేహమునకును గల సంబంధం బొత్తిగా సామాన్యమైనదై యున్నది. గనుక దేహము లేకుండా ఆత్మ వస్త్రహీనత వంటి పరిస్థితిలో ఉంటుంది. పునరుత్థానమందు లేదా క్రీస్తు వచ్చినప్పుడు శరీరము మార్పునొందుతుందనేది నిజమే. అది దేవుని రాజ్య ప్రవేశమునకు ఎక్కువగా చాలినదై యుండునట్లు చేయబడుతుంది. కాని ఎట్టి పరిస్థితులలోనైనా సరే, పౌలు సిద్ధాంతం ప్రకారం, భౌతిక పదార్థంలో స్వత స్సిద్ధమైన చెడు లేదు.[9]

దేవుడు యేసును సమాధిలో నుండి దేహాత్మలతో లేపాడనే విషయాన్ని పౌలు విన్నవించాడు. సాకారవస్తుత్వములో స్వత స్సిద్ధంగా నున్న చెడును గూర్చి విస్తృతంగా ప్రబలి యుండిన గ్రీకు దృష్టికోణాలను వర్ణించాలనియు, వాటిని ప్రతివాదము చేత తప్పని నిరూపించాలనియు అనుభూతి లేకుండానే బలవంతము చేయబడుతున్నాడు. దేహము మరియు ఆత్మ యొక్క అంతర్నిహితమైన ఐక్యత గూర్చి యేసు పునరుత్థానం సాక్ష్యమిచ్చినది. దేహం, భౌతిక పదార్థమై యున్నందునుబట్టి అది చెడ్డదనియు లేదా బలహీనమైనదనియు ఎంచబడకూడదు. ఈ యుగంలోని జీవితం దేహము మరియు ఆత్మ మిళితమైయున్న అనుభవమై యున్నది. ఒక ఆత్మ, ఏదో ఒక విధమైన మూర్తిమంతమైన, లేదా భౌతికమైన పరిమితి లేకుండా ఉనికి కలిగియుండుట,

ఊహింపశక్యముకాని విషయమై యున్నది. ఇంతేగాక, యేసు సశరీరుడుగా పునరుత్థానుడగుట, ఆయనను క్రీస్తుగా అంగీకరించినవారు కూడ అదే విధమైన పునరుత్థానములో పాల్గొందురని చెప్పడానికి ఒక విదితమైన మరియు నిశ్చయమైన సాక్ష్యమై యుండింది. యేసు మృతులలో నుండి లేచాడని రూఢిగా నమ్మిన మీదట, "మృతుల పునరుత్థానము లేదని," అనగా, శరీర పునరుత్థానము లేదని ఎవరైనాగాని తర్కించడానికిగల కారణమేమిటో తెలుసుకోవాలని పౌలు ఆశించాడు. వాస్తవానికి, మరణానంతర జీవితం యొక్క ముఖ్యమైన ఈ కోణం గూర్చిన ప్రశ్నలన్నిటిని యేసు పునరుత్థానం పరిష్కరించాల్సి వుండింది.

**వచనము 13.** ఒకడు, యేసు మృతులలో నుండి సశరీరుడగా లేచాడని తెలియజెప్పెడి అపొస్తలుల సాక్ష్యమును ఒకసారి అంగీకరించిన తరువాత, పరలోకంలో విమోచింపబడినవారి శరీరముతో కూడిన జీవితము గూర్చిన సందేహానికి తావుండదు. దీనికి వ్యత్యస్తంగా, మర్త్యులు భౌతిక మరణానికి ఆవల శరీరముతో జీవించనట్లయితే, యేసు మృతులలో నుండి లేపబడియుండలేదు. యేసు సశరీరుడుగా లేపబడలేదని చెప్పినవారి తర్కము తప్పించుకోడానికి వీలులేనిదై యుండింది. ఒకని భౌతికమైనదే దియును వాని దేహము మరణించిన తరువాత బ్రతికి బయటపడదనేది వారి ముఖ్య ఆధారాంశమై యుండింది. అల్పమైన ఆధారాంశమును, అనగా, యేసు దేహము మరణించిందనే విషయాన్ని వారు అరుదుగా తిరస్కరించారు. అలాగైతే, యేసునకు సంబంధించిన భౌతికమైనదేదియును ఆయన సిలువ మరణము తరువాత బ్రతికి బయటపడదనే తుది అభిప్రాయాన్ని వారు అంగీకరించక తప్పలేదు. అలాగైతే, వారు తర్కించిందే సరైనదైనట్లయితే, సమాధిలో నుండి భౌతికమైనదేదియును వెలుపలికి వచ్చియుండదు. కాని యేసు లేచియున్నాడనే కాదనవల్లగాని నిదర్శనమును పౌలు అదివరకే నివేదించాడు.

పౌలు యొక్క ఈ ప్రత్యక్షతలో, యేసు, మానవజాతి యొక్క సకల లక్షణములను సంపూర్ణంగా పంచుకొన్నాడనేది స్పష్టంగా నున్నది. ఆయనకు శరీరముండినది. *మరణమునకు ఆవల శరీరముతో కూడ జీవించడమనేది లేనట్లయితే, యేసు దేహం కూడ లేపబడలేదు.* మృతుల పునరుత్థానమును ఒప్పుకొననివారు, యేసు సమాధిలో ఉంచబడిన తరువాత ఆయనను చూచిన, తాకిన, మరియు ఆయనుతో మాటలాడి వారు కళ్లారా చూచిన దాని గూర్చి ఇచ్చిన సాక్ష్యమును పరిగణలోనికి తీసుకొనవలసి యుండింది.

> మృతులు లేపబడుటను ఒప్పుకొనకపోవుటలో గల స్పష్టమైన సహేతుకము గూర్చి తన పాఠకులు తలపోయవలెనని పౌలు వారికి ఆదేశాలిచ్చుచున్నాడు. మృతులలో నుండి ఎవరును లేవజాలరని రూఢిపర్చుకొనుట, వారు చెప్పేది వాస్తవమై యుండగల ఒకే ఒక్క మార్గమై యున్నదనే విషయాన్ని ఇలా ఒప్పుకొననివారు నిర్లక్ష్యము చేస్తున్నట్టు కనబడుతున్నది. ఈ సందర్భంలో క్రీస్తు తానే, జీవించినవాడు మరియు మరణించినవాడు, *లేపబడలేదు.* ఏలయనగా మరణమునకు సంబంధించిన సార్వత్రిక ఆస్కారం ఆయన విషయంలో మినహాయింపు చేయలేదు. ఆయన యొక్క అసమానమైన జీవితం సమస్త మానవ జీవితం అంతమగుట నుండి ఆయనను

కాపాడలేదు.[10]

**వచనము 14.** పౌలు, నియమబద్ధమైన వాక్యముల పరంపరలను ఉపయోగిస్తూ, తన వాదనను ఒక తుది నిర్ణయము నుండి మరొక దానికి బలముగా కొనసాగిస్తున్నాడు. క్రీస్తునందు రక్షింపబడినవారి పునరుత్థానము మరియు క్రీస్తు యొక్క పునరుత్థానమే ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయి. “మృతుల పునరుత్థానము లేనియెడల” (15:13), యేసు లేపబడలేదు; కాని యేసు లేపబడనట్లయితే, పౌలు బోధించినదంతయు మరియు కొరింథీయులు విశ్వసించినదంతయు వ్యర్థమే, కేవలము ఒక అబద్ధమే అవుతుంది. పౌలు పొందిక కొరకు విన్నవించుకొన్నాడు. ఒకడు మృతుల పునరుత్థానమును కాదనగోరుతున్నట్లయితే, అతడు తన హేతువాదమును దుఃఖకరమైన లేక చేదైన ముగింపు వరకు అనుసరించ బద్ధుడై యుంటాడని పౌలు చెప్పాడు. యేసు, సమాధిలో నుండి సశరీరుడుగా లేచాడనే క్రైస్తవుల ధ్రువీకరణము మరియు విమోచింపబడినవారందరు శరీర పునరుత్థానములో పాల్గొందురనే తదనంతర విశ్వాసము, సువార్త ప్రకటనకు మౌలికాంశమై యున్నది. “మృతులలో నుండి క్రీస్తు లేపబడనట్లయితే, దేవుడు తన ప్రజలను విమోచింపవలెనని రచించిన చర్యల గూర్చిన సుదీర్ఘ ప్రణాళిక ముందుకు వెళ్లకుండునట్లు మూసివేయబడిన వీధి, సమాధిలో మూసివేయబడిన విషయం అవుతుంది.”[11]

**వచనము 15.** మృతుల పునరుత్థానము లేదనడములో ఇతర అంతర్భావాలున్నాయి. మృతుల పునరుత్థానము లేనట్లయితే, పౌలు మరియు ఇతర అపొస్తలులు **దేవుని విషయమై అబద్ధపు సాక్షులుగా అగపడుదురు.** ఇలాంటి సందర్భంలో, వారు వంచింపబడ్డారు మరియు అజ్ఞానులై యుండిరని చెప్పాల్సి వుంటుంది. లేదా వారు అబద్ధికులని తీర్పు తీర్చాల్సి వుంటుంది. వారు కేవలము అపార్థం చేసుకొనబడ్డారు కాని ఉద్దేశాలు మాత్రం మంచివే అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చడానికి మరి ఎక్కువ ప్రత్యక్షతలు మరియు మరి ఎక్కువ సాక్ష్యం ఉండినవి. ఒక కుతంత్ర వార్తను బహు జాగ్రత్తగా సమన్వయం చేయాల్సివుంటుంది. మృతుల పునరుత్థానము లేనట్లయితే, పౌలు మరియు ఇతర అపొస్తలులు “అబద్ధపు సాక్షులవుతారు.” యేసు లేచాడనేది వారిచ్చుచుండిన సాక్ష్యమై యుండింది. ఎవరిని నమ్మాలో, కొరింథీయులే నిర్ణయించుకోవాలి. రెండు స్వాధికారాపేక్షలు తెలియజెప్పబడుచుండినవి (1) శరీర పునరుత్థానము లేదు, మరియు (2) మృతులలో నుండి లేపబడిన యేసు, సశరీరుడుగా ప్రత్యక్షమయ్యాడు. ఈ ప్రకటనలు సమాధానపరచబడటం సాధ్యంకానివై ఉన్నాయని పౌలు సరిగా తీర్మానించాడు. పౌలు మరియు ఇతర వివేకముగల, ఆధారపడదగిన ప్రజలు ఊరకనే అబద్ధమాడారని కొరింథీయులు తీక్షణంగా నమ్మారా? ‘అది అబద్ధం’ అని తెలిసిన దాని కొరకు సమస్త విషయాల్లో వారెందుకు తెగిస్తారు?

ఇటీవలి శతాబ్దాల్లో, యేసు సశరీరుడుగా పునరుత్థానుడగుట “విశ్వాస ప్రకటనయై” యున్నదని తర్కించగోరిన దేవశాస్త్ర పండితులు, కాలములో చోటుచేసుకొనిన

యథార్థమైన సంఘటన లతో గల సంబంధాన్ని తెంచేసి, సందిగ్ధావస్థలో పడిపోయారు. యేసు పునరుత్థానము కాలములో చోటుచేసుకొనిన యథార్థమైన సంఘటన కానట్లయితే, ఆయన గూర్చిన సాక్ష్యము, మతిభ్రమించి నందు వలన భావోద్రేకపూరితమైన అనుభవాలకును వాస్తవమైన సంఘటనలకును మధ్య గల తారతమ్యమును వివేచింపలేకపోయిన వెఱ్ఱివారు తెలియజెప్పిన సాక్ష్యమవుతుంది. లేదా, ఇటువంటి సాక్ష్యము ఒక అబద్ధమవుతుంది. శతాబ్దాలుగా, పౌలు చేయు వాదన సత్యమును దాని బంధుబలముగా స్వాధికారాపేక్షతో స్వీకరించుచున్నది.

మృతి చెందియుండిన యేసు శరీరమును దేవుడు మూడవ దినాన సజీవముగా లేపాడు. యేసు పునరుత్థానము తరువాతి ప్రత్యక్షతల గూర్చి ప్రత్యక్ష సాక్షులు సాక్ష్యమిచ్చారు. ఆయన తిరిగి వచ్చునని ఆయన వారికి వాగ్దానమిచ్చాడు. ఇప్పుడాయన దేవుని కుడిపార్శ్వమందు కూర్చుండి ఏలబడి చేయుచున్నాడు. ఈ విషయాలన్నిటికి వేరుగా, క్రీస్తు స్వాధికారంతో చేసిన ప్రకటనలు మరియు ఆయన గూర్చి ఇతరులు స్వాధికారంతో చేసిన ప్రకటనలు, అర్థం కోసమైన నిరాశాజనకమైన మానవ అన్వేషణలోని మరొక అదనపు అధ్యాయంగా కొట్టివేయబడవచ్చు. విషయం ఇది కాదని పౌలుకు తెలుసు. అతడు ప్రకటించిన సువార్తలో గల తన నమ్మకము ఆధారంగా సమస్తమును తెగించడానికైనా అతడు సంసిద్ధుడై యుండెను.

**వచనము 16.** కొరింథులోని క్రైస్తవులు ఈ విషయాన్ని రెండు విధాలుగా అర్థంచేసుకొనలేరు. ఈ క్రైస్తవులు వారి మరణానంతరం శరీరాలతో జీవించనట్లయితే, **క్రీస్తు కూడ లేపబడలేదని** పౌలు ధ్రువీకరించాడు. పునరుత్థానము లేదని వారు స్వాధికారంతో అపేక్షించుచుండిన పంతాన్ని విడిచిపెట్టాలి, లేదా యేసు లేపబడ్డాడనే సాక్ష్యమును కొట్టివేయాలి. పౌలు కేవలము మరణానంతర జీవితం గూర్చి వాదించుచుండలేదు. అతడు పునరుత్థానమును, మరణా నంతరము శరీరముగలవారమై యుండుటను ధ్రువీకరించుచుండెను. యేసు సమాధిలో నుండి బయటికి వచ్చినట్టుగానే, "క్రీస్తునందుండి మృతినొందినవారు లేతురు" (1 థెస్స. 4:16). యేసు సిలువ వేయబడిన తరువాత సశరీరుడుగా అగపడ్డాడు. ఒక శరీరము యొక్క పరిధులులేని మబ్బులాంటి ఆకారరహిత మానవ ఆత్మ గూర్చి ఊహించుకోడానికి కూడ కష్టంగా ఉన్నది. "శరీరము లేకుండా మానవ ఉనికి లేదు, అది జీవితము నుండి వేరుచేయబడజాలనిదై యున్నది. యుగాంతమునకు (eschatological hope) సంబంధించిన క్రొత్త నిబంధన యొక్క నిరీక్షణ, ఆత్మ చావక బ్రతికియుండుట కొరకు కాదు, అది శరీర పునరుత్థానము కొరకైనదని" Brevard S. Childs పలికిన మాటలు ఉపయోగించు కొనబడవచ్చు.[12]

**వచనము 17.** కొరింథీయులే నిర్ణయించుకోవాలి. కాని పునరుత్థానుడైన ప్రభువును గూర్చిన అపొస్తలిక సాక్ష్యమును తృణీకరించడానికి వారు ఎంపికచేసుకొనవలసి యున్నట్లయితే, వారు అంతర్భావాలను తెలుసుకోవాలని పౌలు ఆశించాడు. యేసు లేపబడనట్లయితే, పౌలు ప్రకటించిన సువార్తలోని ప్రతి అంశము పొరపాటైనదవుతుంది. వారు కల్పితమైన ఫలితాన్ని ఎదుర్కొనవలసి యుండింది: **మీ విశ్వాసము వ్యర్థమే**. ఇంతేగాక, మీరు యింకను **మీ పాపములలోనే యున్నారని** కూడ చెప్పాడు. చివరి

పదబంధమును రెండు రీతుల్లో అర్థం చేసుకొనవచ్చు. (1) ప్రభువు యొక్క పునరుత్థానము లేకుండా, సిలువను గూర్చిన సాహసోద్యమం మొత్తం ప్రశ్నార్థకమైనదవుతుంది. (2) మరొక ప్రక్క, ఇట్టి ప్రకటన కొరింథీయుల అనుభవమును గూర్చిన ఒక విన్నపమై యుండగలదు. పునరుత్థానుడైన ప్రభువు యొక్క చైతన్యవంతమైన తోడ్పాటు లేకుండా పాపమును అధిగమించి జీవించడానికి వారికి శక్తి ఉండదు. వాస్తవానికి, కొరింథీ క్రైస్తవులు సజీవుడైన క్రీస్తును మరియు ఆయన వారి జీవితాల్లో కార్యములు చేయడమును చూశారు. వారు తమ పాపములో నుండి తొలగిపోవడం ద్వారా యేసు మృతులలో నుండి లేచాడని చెప్పడానికి వారు సజీవ సాక్షులై యుండిరి. పునరుత్థానము లేనప్పుడు, వ్యతిరేకార్థకమైన ఈ రెండు ఫలితాలు పరిణమిస్తాయి. కాని అపొస్తులుని మనస్సులో మొదటి అర్థమే ఉండినదని పత్రికలలో వ్రాయబడినట్లు నీతిమంతులముగా తీర్చబడుటపై కేంద్రీకరింపబడి యుండిన పౌలు దృష్టి సూచించుచున్నది (రోమా. 4:24, 25 చూడుము).

**వచనము 18.** క్రీస్తు సశరీరుడుగా లేపబడలేదనుట వలన ఏర్పడు పర్యవసానములను నొక్కివక్కాణించుట అపొస్తులుడు మానలేదు. పునరుత్థానము లేకుండా, **క్రీస్తునందు నిద్రించినవారు** (οἱ κοιμηθέντες, *hoi koimēthentes*), అనగా, మరణించినవారు, **నశించిరి.** నిజానికి, మృతుల పునరుత్థానము లేదనుట, క్రైస్తవ విశ్వాసమునకు ప్రీతికరమైన నిరీక్షణను త్రోసిపుచ్చినట్లవుతుంది. నిత్య జీవము, విమోచింపబడి నీతిమంతులముగా తీర్చబడుట వలన తేలిన ప్రాథమిక పరిణామమై యున్నది.

పౌలు నిద్రను ఉపమాలంకారముగా ప్రయోగించడము వలన మరణ భయమును గూర్చిన అభిప్రాయం యొక్క తీవ్రత తగ్గింపబడుతున్నది. ప్లేటో మరియు స్తోయికుల తత్త్వశాస్త్రవేత్తల నిరాశావాదముతో కూడిన దృష్టికోణము పౌలు నివసించుచుండిన ప్రాచీన గ్రీకుల మరియు రోమనుల రాజ్యంలో స్థిరపడింది. గిన్నెలు, కపాలము ఆకారంలో రూపొందింపబడినవి. గర్భస్రావము, వేశ్యాగమనము, మరియు పిల్లలను విచ్చల విడిగా విడిచిపెట్టడం సామాన్య అభ్యాసములై యుండినవి. అనేకుల సమాధుల మీద కేవలము తొలి అక్షరములు మాత్రమే వ్రాయబడి ఉండినవి. ఉదా|| "N F F N S N C," అనే పొడి అక్షరాలుండినవి. ఇవి *non fui, fui, non sum, non curo,* అనే ల్యాటిన్ భాషా వ్యక్తీకరణమై యుండి, "నేనుండియుండలేదు, నేనుండియుంటిని, నేను లేను, నేను నాకు చీకూచింతేమియు లేదని" అర్థమిచ్చింది.[13] "స్తోయికుల నీతిలో నిశ్చింత భావము కీలకమైన పదమై యుండింది"; ఈ తత్త్వశాస్త్రం ప్రకారం, "భవితవ్యత పంపించిన దాని నుండి తప్పించుకోడానికి అతడు లేక ఆమె చేయగలిగిందేమియు లేదని మంచి వ్యక్తి గుర్తిస్తాడు."[14] క్రీస్తు యొక్క శరీర పునరుత్థానము, ఆకలింపు చేసుకొనబడినప్పుడు, ఈ వైఖరి యొక్క పట్టును వదిలించేసింది.

**వచనము 19.** పునరుత్థానమును విశ్వసించనివారు, మరణించినవారు శాశ్వతంగా నశించారని అనుకొనేవారు, నిరీక్షణను వదిలిపెట్టేశారు. మానవాళి నిరీక్షణ కొరకు క్రీస్తు యొక్క శరీర పున రుత్థాన సందేశము గాక మరొకటి లేదనే విషయం పౌలునకు తెలుసు. సువార్త సందేశం, యేసు మృతులలో నుండి లేపబడ్డాడనే ఆధారాంశముపై

నిర్మింపబడుతున్నది. ఈ సందేశం అబద్ధమై నట్లయితే, మానవాళికి నిరీక్షణ లేదనే అర్థం. అలాగైతే, క్రైస్తవులు అందరికంటె **దౌర్భాగ్యులై యుందురు**. సమస్త మానవాళికి గల నిరీక్షణ, క్రీస్తునందలి నిరీక్షణ మాత్రమే.

ఒకడు మరణావస్థలో నిద్రించినది మొదలుకొని మృతులను లేపడానికి ప్రభువు తిరిగి వచ్చు పర్యంతముగల మధ్య కాలంలో ఏమి జరుగుతుందో అనే విషయాన్ని గూర్చిన అన్వేషణను అపొస్తలుడు కొనసాగించలేదు. పునరుత్థానమైన శరీరంలోని జీవం ఒకడు మరణించగానే మొదలవుతుందా లేక ప్రభువు తిరిగి వచ్చినప్పుడా? పౌలు ఈ విషయాన్ని విడమరచి చెప్పలేదు. నిత్య జీవతము శరీర రూపంలో ఉంటుందనేది, నిశ్చయం. భౌతికమైన శరీరంగాని లేదా భౌతికమైన వస్తువులుగాని స్వత స్సిద్ధంగా చెడ్డవి కావు. చెడు మరియు పాపము మనము చేసుకొను నైతిక ఎంపికల నుండి పరిణమిస్తాయి, శరీరమందున్న భౌతిక పదార్థముల నుండి కాదు.

## ఏ విధమైన శరీరం? (15:20-28)

**[20]ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడు. [21]మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. [22]ఆదాము నందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు. [23]ప్రతివాడును తన తన వరుసలోనే బ్రతికింపబడును; ప్రథమ ఫలము క్రీస్తు; తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయనవారు బ్రదికింపబడుదురు. [24]అటుతరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి, తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును. [25]ఎందుకనగా తన శత్రువులనందరిని తన పాదముల క్రింద ఉంచువరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను. [26]కడపట నశింపజేయబడు శత్రువు, మరణము. [27]దేవుడు సమస్తమును క్రీస్తు పాదముల క్రింద లోపరచియుంచెను. సమస్తమును లోపరచబడియున్నదని చెప్పినప్పుడు ఆయనకు సమస్తమును లోపరచినవాడు తప్ప సమస్తమును లోపరచబడియున్నదను సంగతి విశదమే. [28]మరియు సమస్తము ఆయనకు లోపరచబడినప్పుడు దేవుడు సర్వములో సర్వమగు నిమిత్తము కుమారుడు తనకు సమస్తమును లోపరచిన దేవునికి తానే లోబడును.**

అనేక సంవత్సరాల క్రితం, సైద్ధాంతికమైన సమాజం క్రైస్తవ విశ్వాసమును సమర్థించుకొనడమును ఇంచుమించుగా వదిలిపెట్టిన తరుణంలో, Alexander Balmain Bruce, క్రైస్తవ విశ్వాస సమర్థన (Christian apologetics) అనే అంశంపై ఒక పుస్తకము రచించాడు. విశ్వాసులు భవిష్యత్తు కొరకైన ఆశావాదంతో నైతిక ప్రవర్తన వైపు మళ్లుకొను నిమిత్తము ప్రవచనాత్మకమైన సాపేక్ష కాంక్షలను బ్రూస్ మననం చేశాడు. బ్రూస్ ఈ క్రింది విధంగా సెలవిస్తున్నాడు:

నీతి కొరకైన ఆకలిదప్పులు మరియు నిరీక్షణ గూర్చిన ప్రగాఢ వాంఛ ఏమాత్రమును

సర్వసామాన్యమైన సంగతులై యుండుట లేదు. గనుక ఈ రెండు విషయాలు ఉన్నత స్థాయిలో కలిగియున్నట్టు అగపడువారు, ప్రపంచ ప్రఖ్యాతిగాంచినవారి శ్రేణిలో ఎప్పుడైనాగాని వారి వరుస క్రమములో నిలువబడవలెను. అయితే ఈ రెండింటి కలయిక హెబ్రీ ప్రవక్తను విశిష్ఠమైనవానిగా చేస్తున్నాయి.[15]

నజరేతువాడైన యేసు, మరియు ఆయనను అనుసరించిన అపొస్తలులు, ప్రవక్తలను అధిగమించారు. వారు (1) దైవభక్తిగల జీవితం జీవించుట కొరకు రాజీపడని స్వాధికారాపేక్షతో (2) ప్రభువు మరలా వచ్చునను ఆశావాదముతో కూడిన అపేక్షను ముడిపెట్టారు. యుగాంతమందలి విషయాల గూర్చి క్రొత్త నిబంధన ప్రత్యక్షతలలో స్వత స్సిద్ధమైనదిగాను, తరుచుగా సువిదితమైనదిగాను ఉన్న విషయం నీతమంతమైన జీవితం జీవించవలెనని పిలుపు నిచ్చుచున్నది (1 కొరింథీ. 15:34; 2 కొరింథీ. 5:10; 2 పేతురు 3:11). ప్రభువు మరలా వచ్చుచున్నాడనగా, శరీర పునరుత్థానము, తీర్పు, మరియు నిత్యజీవముంటాయని అర్థం. ప్రభువు యొక్క ఆశావాదమును ప్రవక్తలు ముందుగా సూచించారు. ఇదే విషయాన్ని బ్రూస్ యింకా యిలా వివరిస్తున్నాడు,

నైతిక విమర్శకుడు విచారభరితుడును, నిరాశాపూరితుడునై యుండుట ఎంతో సహజంగా జరిగిపోతుంది. గనుక వారి సమకాలీనుల నుండి బాధాకరమైన విషయాలను స్వాధికారాపేక్షతో కోరిన, శిరసావహించుటకు విఫలులైనందుకు అత్యంత నిర్దయాత్మ కమైన ఖండనను వారిపై ప్రకటించిన వీరు [ఇశ్రాయేలు ప్రవక్తలు], మంచితనము మరియు సంతోషము గూర్చిన సమున్నతమైన ఆదర్శప్రాయములు సంపూర్ణంగా అనుభవింప బడవలసినవై యున్నప్పుడు, రాబోవుచున్న సువర్ణ యుగమును గూర్చిన ప్రపంచము యొక్క సాహిత్యముతో సరిపడు అత్యంత ప్రకాశమానమైన, ఉత్సాహయుతమైన చిత్రములను మనముందుంచు టనుమనము గమనిస్తూ ఆశ్చర్యపడు తుంటాము.[16]

పౌలు పునరుత్థానము గూర్చి కొరింథీయులకు వ్రాస్తూ, *నీతి మరియు నిరీక్షణ* గూర్చిన అంశములను కూడ అతడు చేర్చాడు. యేసు, భవిష్యత్ పునరుత్థానము, మరియు నిరీక్షణ, రాబోవుచున్న యుగమును గూర్చి అపొస్తలులు వ్యవహరిస్తున్న తీరులో, ఒకదానితో మరొకటి పెనవేసుకొని ఉన్నాయి. *నిరీక్షణ* గూర్చిన సందేశం, యేసు మరణించాడు మరియు తదనంతరము దేవుడాయనను మృతులలో నుండి లేపాడని ఆధారపడదగిన సాక్షులిచ్చిన చారిత్రాత్మకమైన సాక్ష్యముతో మొదలవుతుంది. క్రైస్తవ *నిరీక్షణ* యేసే క్రీస్తైయున్నాడు మరియు దేవుడాయనను మృతులలో నుండి లేపుట ద్వారా ఆయన క్రీస్తైయున్నాడని ప్రకటించాడనే ఒప్పుకోలులో నుండి ప్రవహిస్తుంది, అది దానిలో లోతుగా పాతుకపోయింది.

**వచనము 20.** 15:13-19లో, పునరుత్థానములేని నిరీక్షణ ఎంత నిరాశాజనకమైనదై యుంటుందో చూపించు విశేషమైన పటమును చిత్రించిన మీదట, యేసు పునరుత్థానము మరియు సంబంధిత లోనణగియున్న వాస్తవమును పౌలు అటుతరువాత ధ్రువీకరించాడు. వాస్తవానికి, యేసు **మృతులలో నుండి లేపబడినందు** వలన, **నిద్రించినవారిలో** ఆయన **ప్రథమ ఫలమయ్యాడు.** మరొక పర్యాయం, నిద్ర,

మరణమును సూచిస్తున్న ఉపమాలంకారమై యున్నది (15:18 చూడుము). ఇశ్రాయేలు చరిత్రలో లోతైన వేరులతో పాదుకొనియున్న ఒక భావమును అపొస్తలుడు రాబట్టాడు. ప్రజలు వారి పొలములలో పండిన పంటలోని ప్రథమ ఫలములను ఒక గంభీరమైన స్తుతిని సూచించు చర్యగా దేవునికర్పించుచుండిరి (ద్వితీ. 26:1, 2). ఒక విధంగా చూస్తే, ప్రథమ ఫలములు, మున్ముందు అధికంగా సమకూడనై యుండిన పంటకు ముందు సూచనయై (దూతయై) యుండినవి. ఇంకా, అవి పంట కోతలకు ఆరంభములు కూడ అయియుండినవి. విశ్వాసులు వారి దత్తపుత్రత్వము, అనగా దేహము యొక్క విమోచనము కొరకు ఆసక్తితో ఎదురుచూచుచుండగా, దేవుడు వారి అంతరంగములో నివసించు పరిశుద్ధాత్మను వారికి అనుగ్రహించాడని సూచించు ఉపమాలంకారముగా, "ప్రథమ ఫలములు" అనే పదజాలమును అపొస్తలుడు మరొక చోట ప్రయోగించాడు (రోమా. 8:23).

యేసు పునరుత్థానము దేవుని శక్తిని ప్రదర్శించింది. ఆయన మృతులను సజీవులనుగా లేపుటకును, అంతరంగములో వసించు ఆత్మతో తన ప్రజలకు అధికారమిచ్చుటకును శక్తిమంతుడై యున్నాడు. కాని, దీనిని మించినది యింకా వున్నది. ప్రథమ ఫలములు క్రైస్తవ కుటుంబము యొక్క మున్ముందటి పునరుత్థానము గూర్చి వాగ్దాన మిచ్చాయి. యేసు పునరుత్థానము గతంలోని చారిత్రాత్మకమైన స్మారక చిహ్నమును మించినదై యున్నది. *ఆయన, కోత ఆరంభమయ్యిందనే సూచన నిచ్చుచుండిన ప్రథమ ఫలమై యుండెను.* యేసు మృతులలో నుండి లేపబడుట వలన, అంతరంగములో నున్న ఆత్మ కంటె ఎక్కువ, దేవుని శక్తిలో మరియు ఖాళీ సమాధిలో నమ్మకముతో కూడిన విశ్వాసమును మించిన గొప్ప ఫలితాన్నిచ్చినది. యేసు, "పంట కోతకు వాస్తవమైన ఆరంభమయ్యాడు."[17] నిత్య పునరుత్థానము యేసులో మానవ చరిత్రలోనికి అదివరకే చొచ్చుకొనిపోయింది. "యేసు పునరుత్థానం, నిత్య వరుసక్రమమునకు చెందియున్న చారిత్రాత్మకమైన ఏదో ఒక సన్నివేశంపై గల ప్రత్యక్షత కంటె తక్కువైనది కాదని అర్థం."[18]

**వచనము 21.** యేసును ఆదాముతో పోలుస్తూ, పౌలు, నరావతారము యొక్క విస్తృతమును, ప్రాముఖ్యమునైన ప్రభావములుగలవైన నిత్య పరిణామములను నొక్కివక్కాణించాడు. ఆదాము మరియు హవ్వ చేసిన పాపము ద్వారా విస్తృతమైన పరిధిగల ప్రభావము లోకము లోనికి ప్రవేశపెట్టబడింది, కాని అట్టి ప్రభావం క్రీస్తు రాకడ ద్వారా పరాజయం పాలుజేయబడిందని అపొస్తలుడు చెప్పాడు. ఈ ఇతివృత్తమును అటుతరువాత రోమా. 5:12-17లో చర్చించాడు. సంబంధిత సాదృశ్యమును 1 కొరింథీ. 15:45-50లో కొనసాగించాడు. ఆదాము యొక్క తిరుగుబాటుతనము మరణమును - భౌతిక మరణము మరియు ఆత్మసంబంధమైన మరణమును - తెచ్చిపెట్టింది. ఆదాము పాపము చేయుట మాత్రమే చేయలేదు గాని, అతడు పాపమునకు ఒక నమూనాను సహితం ఏర్పాటు చేశాడు. మానవజాతిని వర్ణించనై యుండిన పాపమునకు అతడొక రూపనిదర్శనమయ్యాడు. "అందరు పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని" పౌలు, రోమా. 3:23లో రచించాడు. పాపము యొక్క సార్వత్రికత మరియు, ఆదాము హవ్వలు చేసిన పాపము సంబంధం లేనివి కావు, కాని

ఆదాము మరియు క్రీస్తునకు మధ్య పౌలు రాబట్టిన సమాంతరము అపొస్తలుని మనస్సునకు చాలా దూరంలో ఉండిన దేవశాస్త్ర సంబంధమైన ప్రశ్నలకు సమాధానాలిచ్చుచున్నదని దేవశాస్త్ర పండితులు గమనించారు. ఆదాము తదనంతరము, పాపము మరియు మరణము తలిదండ్రుల నుండి పిల్లలకు వారసత్వము ద్వారా సంక్రమించినదని పౌలు వ్రాసిన మాటల్లో ఏదియు సూచించడము లేదు. ఆదిమ (original) పాపము గూర్చిన భావన ఆదాము యొక్క అతిక్రమములోగాని, యేసు పునరుత్థానములోగాని లేదు.

ఆదాము చేసిన పాపమునుబట్టి, సమస్త మానవజాతి పాపము చేసిందనేది, కొందరు మతపరమైన గుంపుల యొక్క దేవశాస్త్రములో ప్రబలియుండిన భక్తుడైన అగస్టీను (Augustine of Hippo - క్రీ.శ. 354-430) చేసిన వ్యాఖ్యానమై యున్నది. పాపమునకు ఆదిమ బాధ్యురాలు స్త్రీ అని చెప్పబడుతున్నది. లైంగిక సంబంధం దోషిగా దృష్టింపబడుతున్నది. అగస్టీను, “పాపము లేక మునుపు అతనిలో నుండి చేయబడిన స్త్రీ మూలమున పాపములో పడిపోయిన ఆ ఒక్కనిలో [ఆదాములో] మనమందరమును ఉంటిమి . . . ,” అని రచించాడు.[19] పాపము వారసత్వము ద్వారా సంక్రమించినది, గనుక బిడ్డ పుట్టగానే ఆ దోషము ఆ బిడ్డకు సంక్రమించునను హేతువాదము కొనసాగుతున్నది. ఆదిమ పాపము తరువాత, మానవజాతి “దుర్నీతిమయమైన మరియు ఖండింపబడిన పిల్లలను కనినదని” అగస్టీను చెప్పాడు.[20] అగస్టీన్ ఆలోచనల ప్రకారం, పాపము, మానవులను దేవుని నుండి వేరుచేయు ఆత్మసంబంధమైన ఒక పరిస్థితియై యున్నది, అది శరీరేచ్ఛలను అనుసరించడానికి మానవులు చేసుకొను ఎంపికలు కాదు. మానవులు పాప దోషముతో పుట్టుచు దాని అధికారము క్రింద జీవిస్తున్నారు, గనుక వారు మంచిని చేయజాలరనేది ఈ ఆలోచనా ప్రక్రియ యొక్క తుది అభిప్రాయమై యున్నది.

పౌలు కొరింథీయులతో చేయుచున్న తర్కము తక్షణ పరిస్థితిని సంబోధించినది, తరువాతి తరము యొక్క దేవశాస్త్ర సంబంధమైన తర్కములను కాదు. దేవుని సార్వభౌమత్వం మరియు మానవుని స్వాతంత్రం అనే పెద్ద ప్రశ్నల విషయంలో అతడు కొంచెం ఆందోళన చెందుచుండెను - అగస్టీను తన యౌవనకాలమందలి అలవాట్ల గూర్చి ఆలోచించుకొనుచుండగా, ఈ ప్రశ్నలు అతనిని వేధించాయి.[21] పాపము మరియు మరణము ఆదాము వలన కలిగినవి, అలాగే క్షమాపణ మరియు నిరీక్షణ **(మృతుల పునఃరుత్థానము)** యేసు ద్వారా, రెండవ ఆదాము ద్వారా, సంపూర్ణంగా దేవుడై యుండెను గాని సంపూర్ణంగా మానవుడై యుండిన మనుష్యుని ద్వారా కలిగినవని పౌలు తర్కించాడు. అపొస్తలుని హేతువాదము పనిచేయాలంటే, “ఒక మనుష్యుని ద్వారా మృతుల పునరుత్థానము కూడ కలిగినదనే” సాక్ష్యమును ఒకడు అంగీకరించాలి. యేసు పునరుత్థానము సూచించుచుండిన అంతర్భావాన్ని తన పాఠకులు తెలుసుకోవాలని పౌలు ఆశించాడు: విమోచింపబడిన వారందరును నిత్యము జీవించుటకు లేపబడుదురు.

**వచనము 22.** ఆదాము మరియు క్రీస్తునకు మధ్య గల సమాంతరములు సరిగ్గా ఒకటే కాకపోయినప్పటికిని, దేవుడు క్రీస్తునందు చేసిన కార్యమును తన పాఠకులు అర్థం

చేసుకోడానికి వారికి సహాయకరంగా ఉండునట్లు పౌలు, ఆదామును ఉదాహరణంగా ఉపయోగించాడు. మొదటి మానవుడు పాపమునకుగల ప్రలోభపెట్టు శక్తిని ప్రదర్శించాడు. ఆదాము తిరుగుబాటు, మనుష్యులు ప్రవర్తించు తీరులో ఉండింది. అతడు మరియు అతని సంతానం పాపమును ఎంపికచేసుకొన్నారు. మొట్టమొదట ఆదాములో ప్రత్యక్షపరచబడిన పాపము ద్వారా, మనుష్యులందరు మరణించుదురు. ఆదాము యొక్క సార్వత్రికత, మానవ జాతి ఏమైయుంటుందో అని అతడు చూపించిన దానిలో ఉండినది. ఆది తలిదండ్రులు ఏర్పాటుచేసిన అడుగుజాడలను అనుసరిస్తూ, మానవజాతి తామే దేవునితో వైరము కలిగియున్నదని రుజువుచేసినది.

యేసు క్రీస్తు, ఆదాము వలెనే, మానవ కుటుంబము గూర్చి ఒక సార్వత్రిక సత్యమును ప్రదర్శించాడు: మానవులు ఎంపికలు చేసుకొనవచ్చు. చెడు వలెనే, మంచితనమునకు కూడ దాని ఆకర్షణ ఉన్నది. **క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు.** గనుక మరణము నుండి బ్రదికింపబడువారందరు ఆయనలో విమోచనమును మరియు సమాధానమును కనుగొనగలరు. ఆదాము మరియు క్రీస్తు ప్రవర్తన యొక్క పర్యవసానములు పరిపూర్ణంగా సమాంతరమైనవై యుండినట్లయితే, ఆదాముతో ఆరంభమైన సార్వత్రిక మరణము తరువాత క్రీస్తునందలి సార్వత్రిక రక్షణ కూడ ఉంటుంది. ఏదేమైనప్పటికి, కొందరు క్రీస్తును హత్తుకొనరనే విషయం పౌలునకు తెలుసు. మెస్సీయ, అనగా క్రీస్తు, సార్వత్రిక ప్రతిపాదనను చేశాడు. ఆయన సార్వత్రికమైన ఒక ఎంపికను నివేదించాడు. గనుక యూదులైతేనేమి అన్యజనులైతేనేమి అందరు క్రీస్తు వైపునకు, అనగా పక్షపాతమేమియు ప్రదర్శింపనివాని వైపు మళ్లవచ్చు. ఆయనను ఎంపిక చేసుకొనువారికి, ప్రభువు క్షమాపణ ప్రసాదించును. ఆయనయందున్న వారందరు "బ్రదికింపబడుదురు." క్రీస్తు మరణము మరియు పునరుత్థానము వలని ప్రయోజనము ప్రతి ఒక్కరికి కలుగుతుందని గాని (రోమా. 2:6-8), ఆదాము చేసిన పాపము, బిడ్డను తల్లి గర్భము ధరించిన క్షణంలోనే విధీకృతంగా ప్రతి శిశువును తాకుతుందని గాని పౌలు ధ్వనించలేదు. ఆదాము, ఈ జీవిత పరుగు పందెమును పాపము మరియు మరణము అనే బాటలో ఆరంభించాడని అతడు చెప్పుచుండెను. అట్లయినను సార్వత్రిక రూపంలో, విమోచన మరియు జీవితముగా పరిణమించు విషయం కొరకు మానవజాతి ఒక స్వాధికారాపేక్షను మరియు ఒక ఎంపికను ఎదుర్కొనునట్లు క్రీస్తు అనుమతించాడు. సార్వత్రిక, సర్వలోక రక్షకుడు, ఆయనే.

**వచనము 23.** మొదట యేసు లేపబడ్డాడని ప్రకటించడం ద్వారా పౌలు మృతుల పునరుత్థానము గూర్చిన తన అంశాన్ని ముందుకు కొనసాగించాడు. ఆయన రెండవసారి ప్రత్యక్షమైనప్పుడు, క్రీస్తునందున్న వారందరు పునరుత్థానములో పాల్గొందురు. ప్రతి ఒక్కరి పునరుత్థానము **తన తన వరుసలో** చోటుచేసుకొంటుందని అపొస్తలుడు నొక్కివక్కాణించాడు. అతడు **వచ్చినప్పుడు** (παρουσία, *parousia*, "ప్రత్యక్షమైనప్పుడు") అనే పదమును, ఈ ఒక్కసారి మాత్రమే థెస్సలనీకయులకు వ్రాయబడిన పత్రికకు వెలుపల (1 థెస్స. 2:19; 3:13; 4:15; 2 థెస్స. 2:1-8), యుగాంతమందు ప్రభువు తిరిగి వచ్చుటను మనస్సులో ఉంచుకొని, సాంకేతికార్థంతో

ప్రయోగించాడు. పౌలు తన సొంత ప్రముఖమైన ప్రత్యక్షతను లేదా తన జతపనివారు వచ్చుటను అనేక పర్యాయాలు పౌలు ప్రస్తావించాడు. ప్రభువు తిరిగి వచ్చుట గూర్చి, కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రికలో అపొస్తలుడు ఇంకా నాలుగు సార్లు సుస్పష్టంగా సూచించాడు (1:7, 8; 4:5; 11:26; 16:22 చూడుము). ఏదేమైనప్పటికిని, క్రీస్తు మరలా వచ్చుట గూర్చి కొరింథీ పత్రికల్లోగాని లేదా పౌలు రచనల్లో మరొక చోటగాని వ్రాయబడినవి దహించివేయు ఆసక్తియై యున్నట్టు పరిగణింపబడనేరదు. అపొస్తలుడు, కడ బూర మ్రోగినప్పుడు సంభవించు సంఘటనల వరుసక్రమమును వర్ణించుచుండిన దాని కంటె, మొదటి రాకడ మరియు రెండవ రాకడ మధ్య కాలములో క్రైస్తవులు జీవించు విధానము విషయమై ఎక్కువ ఆందోళన చెందుచుండెను.

క్రీస్తునందున్నవారు ఆయన మహిమలో పాల్గొందురు. మూడు ప్రధానాంశముల మధ్య - మృతుల పునరుత్థానము, క్రీస్తు రెండవ రాకడ, మరియు అంత్య తీర్పు మధ్య - గల ఒకదానిని మరొకటి ప్రభావితంచేయు సంబంధాలు పౌలు చేత తర్కింపబడుటకు బదులుగా, అవి భావించుకొనబడినవి. ప్రభువు తిరిగి రాక మునుపు, ఇప్పుడు సహితం, పునరుత్థానము యొక్క **ప్రథమ ఫలములు క్రీస్తే**. ఆయన యందు మృతుల పునరుత్థానము అదివరకే ఆరంభ మయ్యింది. ప్రస్తుత యుగము యొక్క సంపూర్ణ సిద్ధికి ముందుగా, దత్తపుత్రత్వము కొరకు కనిపెట్టుచున్న . . . ఆత్మ యొక్క ప్రథమ ఫలములు క్రైస్తవులకు అనుగ్రహింపబడింది (రోమా. 8:23). అట్లయినను, భవిష్యత్తనేది ఏదోఒకటున్నది. యేసు మృతులలో నుండి లేపబడ్డాడు, కాని ప్రభువు తిరిగి వచ్చు పర్యంతము ఆయన అనుచరులు పునరుత్థానము నెరుగరు.

క్రీస్తునెరుగనివారి కొరకైన పునరుత్థానము గూర్చి ఏమైనా చెప్పడమనేది ప్రస్తుతానికి పౌలు ఉద్దేశాల్లో లేదు. సార్వత్రిక పునరుత్థానము గూర్చి అపొస్తలుడు ఈ అధ్యాయంలో పేర్కొనలేదు. ఇతర పత్రికల్లో పేర్కొన్నాడు. 1 థెస్స. 4:15-18లో కూడ, క్రీస్తునందు సజీవులై యున్నవారు యేసు తన సొంత ప్రజలతో తిరిగి వచ్చినప్పుడు ఆయనతో కూడ కొనిపోబడుదురని పౌలు చేర్చాడు. 2 థెస్స. 1:6-10లో, దేవుని ప్రజలను అణగద్రొక్కువారిని దేవుడు శిక్షిస్తాడనే విషయాన్ని అపొస్తలుడు స్పష్టంగా తెలియజెప్పాడు (2 కొరింథీ. 5:10 చూడుము). ఇంత చెప్పినప్పటికినీ, దేవుని తృణీకరించినవారి యొక్క పునరుత్థానమైన శరీరముల గూర్చి అతడు ఏమియు చెప్పలేదు. క్రొత్త నిబంధనలో శరీర పునరుత్థానము విమోచింపబడినవారికి ఒక వాగ్దానముగా ప్రకటింపబడింది. క్రీస్తును తృణీకరించువారికి నిత్యత్వంలో అది “నిత్య నాశనమై” యుండుటగాక (2 థెస్స. 1:9), ఎటువంటి ఉనికిని కలిగియుంటారో వాస్తవంగా క్రొత్త నిబంధనలో చర్చింపబడలేదు.

**వచనము 24.** ప్రభువు రాకడ, ఆయన రెండవ రాకడ, మరియు వర్తమాన యుగము యొక్క అంతము ఏక కాలంలో సంభవింపనై యున్నవి. క్రీస్తు ఏలుబడికిని మరియు వర్తమానకాల యుగంలో లేదా రాబోవుచున్న యుగంలో దేవుని పరిపాలనకును మధ్య గల సంబంధాన్ని సిద్ధాంతీకరించడం, నిరాశాజనకమే. ఒక విధంగా చూస్తే, యేసు ఏలుబడి ఆయన ఆరోహణమైనప్పుడు ఆరంభమయ్యింది

మరియు ఆయన న్యాయాధిపతిగాను, ప్రభువుగాను మరలా వచ్చు వరకు అది కొనసాగుతుంది (అపొ. 1:9-11). యేసు యొక్క తొలి ప్రత్యక్షత మరియు ఆయన రెండవ ప్రత్యక్షత ఎంతో దగ్గరి సంబంధంగలవై యున్నవి గనుక ఒక దాని గూర్చి యోచించకుండా రెండవ దాని గూర్చి మాటలాడుకొనడం అసాధ్యం. మొదటి ప్రత్యక్షత, రెండవ ప్రత్యక్షతకు హామీగా ప్రయోజనపడింది. యేసు, దేవుని కుడిపార్శ్వము నుండి తన సంఘమును పరిపాలించుచున్నట్టుగా పౌలు ఆయనను పొందికగా చిత్రీకరించాడు (రోమా. 8:34; ఎఫెసీ. 1:20; కొలొ. 3:1). అంతము వచ్చినప్పుడు, ఆయన **తన తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించును.**

ప్రభువు తిరిగి వచ్చినప్పుడు, మరియు సంఘం యిక మీదట భూ పరిధులకు పరిమితమై యుండనప్పుడు, క్రీస్తు చేపట్టిన విమోచనా కార్యము పూర్తి అయినట్టే. ఇది వాస్తవం, గనుక దేవుడు "సర్వములో సర్వమగును" (15:28). **ఆయన** [క్రీస్తు] **సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి** తన తండ్రియైన దేవునికి రాజ్యమును తిరిగి అప్పగించును. వ్యతిరేకించు శక్తులు ఆకాశమందున్నవేవైనను (కొలొస్స. 1:16), లేదా వర్తమాన యుగంలోని క్రీస్తు పరిపాలనను సవాలుచేయు శక్తులేవైనను, ప్రభువైన యేసు ఏలుబడి క్రిందకు వచ్చును. "సమస్తమైన ఆధిపత్యమునకును, సమస్తమైన అధికార మునకును, బలమునకును" క్రీస్తు యికమీదట యోగ్యుడై యుండడని సూచించడం లేదు. కాని విశేషంగా, మానవాళి విమోచనార్థమై దేవుడు రచించిన, అన్నిటిని ఆవరించియుండుటకు ఆస్కారముగల రూపకల్పన పూర్తవుతుందని అతడు ధ్రువీకరించుచుండెను. మనము దేవుని పరిపాలనలో నమ్మకముంచి, అధికారం క్రీస్తు నుండి దేవునికి మారుట గూర్చి మరి ఎక్కువ ఉజ్జాయింపుగా ఊహించుకొనకూడదని జ్ఞానము కోరుతున్నది. క్రీస్తు మహిమలో ప్రత్యక్షమగుటకును, సమస్తము సమాప్తియగుటకును మధ్య గల కాలంలో, క్రీస్తు ఈ పుడమిపై చేపట్టు మధ్యంతర వెయ్యేళ్ల పరిపాలన గూర్చి పౌలు ఏమియు చెప్పలేదు. ఇటువంటి ఏ సిద్ధాంతమైనను, అది మానవు కల్పితమైనదవుతుంది.

**వచనము 25.** యేసు తన సంఘముపై రాజ్యపాలన చేయుచుండవలెను. ఆయన ఒక జనాంగానికి రాజై యున్నాడు (మత్తయి 2:2; 27:11; లూకా 19:38; కొలొ. 1:13) మరియు జ్యేష్ఠుల సంఘమునకు శిరస్సై యున్నాడు (హెబ్రీ. 12:23). సంఘమునకును దేవుని రాజ్యమునకును మధ్య గల సూక్ష్మమైన విశిష్టతలు తరువాతి యుగము కొరకు ఉద్దేశింపబడినవి. క్రొత్త నిబంధనలో ఇటువంటి విశిష్టతలు నిర్బంధించబడ్డాయి. దీనికి ముందున్న వచనంలో, క్రీస్తు యొక్క రాజత్వమునకు వ్యతిరేకంగా పోటీపడుటకు ప్రయత్నించు సమస్త ఆధిపత్యమును మరియు అధికారమును ఆయన కొట్టివేయునని పౌలు ధ్రువీకరించాడు (1 కొరింథీ. 15:24). ఏదేమైనప్పటికిని, **తన శత్రువులనందరిని తన పాదముల క్రింద ఉంచువరకు** అనే పదబంధములో, మొదటి సర్వనామమునకు ముందు వచ్చిన పదము సందిగ్ధమైనదై యున్నది. సమస్తమును క్రీస్తు పాదముల క్రింద ఉంచువాడు దేవుడా, లేక క్రీస్తు తానే ఇతరమైన ప్రతి అధికారమును తన పాదములక్రింద ఉంచు కొంటాడా? ఎందుకనగా అనే

సముచ్చయం, 15:25ను, క్రీస్తు గూర్చి చెప్పుతున్న 24వ వచనంలోని ఆలోచనతో ముడిపెట్టుచున్నది. కాని 15:27లో ఉల్లేఖింపబడినట్లు, కీర్తనలు 8:6లోని కర్త స్పష్టంగా దేవుడై యున్నాడు. మనకు కనబడుతున్నట్టు, 15:25లోని కర్త కూడ దేవుడే. "తన [క్రీస్తు] శత్రువులనందరిని తన పాదముల క్రింద" దేవుడే ఉంచుతాడు. "తన పాదముల క్రింద" అనే మాటలు, కీర్తనలు 8:6 మరియు 110:1లోగల అదే అభిప్రాయాన్ని ప్రతిధ్వనిస్తున్నాయి. "దేవుడు, అధికారమునకు కారకుడు [కర్త] మరియు మూలాధారమునై యున్నాడు. క్రీస్తుకు, సమస్తము లోపరచబడును."[22]

నరావతారియైన క్రీస్తు, స్త్రీపురుషులను విలువపెట్టి పాపములో నుండి కొనినవాడు, ఆయన ఆరోహణమగుటకు మరియు ఈ యుగాంత మందు ఆయన రెండవసారి ప్రత్యక్షమగుటకు గల మధ్యంతర కాలములో పరిపాలించును. తండ్రి పరిపాలనకును కుమారుని పరిపాలనకును మధ్య చేయబడవలసియున్న ఏ విశిష్టతయైనను అది దేవత్వమైయున్న వానిలో దాగియున్నది. ఇట్టి విశిష్టతను పౌలు అల్పంగా ధ్వనించాడు. తండ్రిని అంగీకరించువారు కుమారుని అంగీకరిస్తారు. దేవుని యొద్దకు క్రీస్తు ద్వారా వచ్చువారు ఆయన మరలా వచ్చినప్పుడు ఆయన విజయోత్సవంలో పాలు పంచుకొంటారు (రోమా. 14:9 చూడుము). వర్తమాన యుగంలో చెడు సాధించు క్షణకాల విజయం ఏదైనను, అది నిరర్ధకమైపోతుంది. క్రీస్తు పునరుత్థానము అంతిమ విజయానికి హామీయై యున్నది.

**వచనము 26.** మొదటి నుండి కూడ, భౌతిక విషయాల్లో, మరణమంటే ఊపిరి ఆగిపోయిందని, సచేతనత్వం మరియు కదలికలు ముగిసిపోయాయని అర్థమిచ్చింది. కాని మరణము మరియు మరణించుట గూర్చిన మొట్టమొదటి పరోక్ష సూచనలో సహితం (ఆది. 2:17), భౌతికమైనదై యున్నదానికి ఆవల ఒక పరిమాణమున్నదని దేవుడు సూచించాడు. మరణం, (నరికివేయడానికి సిద్ధంగా ఉన్నట్టు) కొడవలిని చేత పట్టుకొని నిలువబడిన అస్థిపంజరంగా లేదా కడపటి **శత్రువుగా** మూర్తీకరణము చేయబడినా, మరణము జీవమునకు వ్యతిరేకాలంకారమై యున్నది. జీవము, సంతోషానికి, ఒకడు తన స్థానాన్ని కనుగొనడానికి, ప్రేమకు, కుటుంబానికి, సంతుష్టికి, మరియు సంతృప్తికి సంకేతమై యున్నది. మరణం, జీవమునకు వ్యతిరేకమైనదై యున్నది. యేసు మరణపు ముల్లును విరిచాడు (15:55, 56). మానవులు సాధ్యమైనంత ఉత్తమమైన జీవము కలిగియుండాలని ఆయన వచ్చాడు (యోహాను 5:24; 10:10).

ప్రథమ ఫలమైయున్న యేసు పునరుత్థానము ద్వారా విశ్వాసులకు శరీర పునరుత్థానము గూర్చిన అభయమియ్యబడుట మాత్రమే కాదు, గాని సమస్త శత్రువులపై, "మరణముతో" సహా, అయన యొక్క అంతిమ విజయాన్ని కూడ యేసు పునరుత్థానము నిశ్చయపర్చుచున్నది. క్రీస్తు మరలా వచ్చు వరకు, పాపము మరియు "మరణము" మానవులున్న లోకంలో అధికారముగలవై ఉంటాయి. కాని అంతమందు, అది కూడ కొట్టివేయబడుతుంది. మరణము, పాపము ద్వారా వచ్చింది. మృతులలో నుండి లేపబడినవాని ద్వారా జీవము కలుగుతుంది. ఆయన విజయోత్సవం పూర్తి అయిన తరువాత మరణమనేది యిక ఉండదు.

కీర్తనలు 8:6 సందర్భంలో, పౌలు ఉల్లేఖించిన పదాలు సాధారణ అన్వయము కలిగియున్నవి. "నీవు [సామాన్య] మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడేపాటివాడు? . . . ?" అని కీర్తనకారుడు ప్రశ్నిస్తున్నాడు (కీర్తనలు 8:4). పౌలు ఈ మాటలను నిర్దుష్టంగా నజరేయుడైన యేసునకు అన్వయించాడు (హెబ్రీ. 2:5-8 చూడుము). దేవుడు మానవునికి, "నీ [తన] చేతి పనుల మీద వానికి అధికారమిచ్చియున్నావు; . . . [సమస్తమును] వాని పాదముల క్రింద నీవు ఉంచియున్నావు" అని కీర్తనకారుడు నొక్కివక్కాణిస్తున్నాడు. ఈ మాటల విశిష్ట అన్వయమును పౌలు కడపటి మానవునిలో, అనగా, నరావతారియైన క్రీస్తులో కనుగొన్నాడు. కుమారుడైన క్రీస్తు నరావతారమెత్తుట మరియు తత్పరిణామాత్మకమైన మరణము మరియు పునరుత్థానమును బట్టి, దేవుడిప్పుడు "సమస్తమును క్రీస్తు పాదముల క్రింద లోపరచియుంచెను" (1 కొరింథీ. 15:27ఎ). యేసు ఏలుబడి, ప్రత్యేకంగా తన నిమిత్తం ఆయన పరిశుద్ధ జనమును పవిత్ర పరచుటలో దానంతట అదే ప్రత్యక్షమవుతున్నది (1 పేతురు 1:14-19 చూడుము). ఆయన తన సంఘమును ఏలుచున్నాడు.

**వచనము 27.** అపొస్తలుడు ఈ సత్యమును విదితం చేశాడు . . . **ఆయన చెప్పినప్పుడు** . . . అనే మాటల NASB భాషాంతరీకరణము, ప్రథమ పురుష, ఏక వచన క్రియాపదమునకు కర్తను సమకూర్చుతున్నది (εἴπῃ, *eipē*). "అతడు," "ఆమె," లేదా "అది" తెలియజెప్పు విషయాన్ని సందర్భం నిర్ధారించాలి. పౌలు, కీర్తనను ఉల్లేఖించుచుండెను, గనుక, ". . . అది చెప్పినప్పుడు . . ." అనేది మెరుగైన అనువాదమవుతుంది. అనువాదంలోని తేడా చిన్నదే. లేఖనములు చెప్పుచున్నది, దేవుడు సెలవిచ్చినదై యున్నది; మరియు దేవుడు లేఖనములలో సెలవిచ్చింది పౌలు చెప్పుచుండిన విషయమై యుండింది. ఆయనకు **సమస్తమును లోపరచినవాడు తప్ప సమస్తమును లోపరచబడియున్నదను సంగతి విశదమే** అని అపొస్తలుడు వ్యాఖ్యానిస్తున్నాడు. తండ్రియైన దేవుడు కుమారునికి లోపరచబడలేదు. ఏలుబడి మరియు మహిమ విషయంలో తండ్రి మరియు కుమారుడు వేరుచేయ సాధ్యముకానివారై యున్నారు గనుక తండ్రి యొక్క ప్రాధాన్యతను నొక్కివక్కాణించడానికి పౌలు సంకోచించలేదు. తండ్రి, కుమారునికి లోబడుతున్నాడని లేఖనములు ఎన్నడును చెప్పవు. తండ్రి, కుమారునికి ఒక బృహత్కార్యభారమును నియుక్తముచేశాడు (యోహాను 5:36). కుమారుడు, తండ్రి చిత్తమును నెరవేర్చాడు (యోహాను 4:34). నరావతారమెత్తుటలో గల యేసు యొక్క అసమానమైన పని ఆయన తన రాజ్యమును ఏలునిమిత్తము ఆయనను ఆయత్తము చేసిందనే విషయాన్ని పౌలు నొక్కివక్కాణించాడు (ఎఫెసీ. 1:22, 23). కాని ఆయన పరిపాలన దేవుని సంపూర్ణాధిపత్యంతో పొంతనగలదై యుండింది.

**వచనము 28.** కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రికలోని ఈ వచనము మరియు 1:9లో మాత్రమే పౌలు యేసును దేవుని కుమారునిగా సూచిస్తున్నాడు. తండ్రి మరియు కుమారుడు సంపూర్ణాధిపత్యం కోసం పోటీపడుతున్నట్టు అపొస్తలుడు సూచించలేదు. త్రిత్వము లోపల పోటీ అనేది ఎందుకు ఒక సమస్య అవుతుంతో అని

ఊహించడానికి కూడ కష్టంగా ఉన్నది. తండ్రి మరియు కుమారుడు ఒకే మనస్సు మరియు ఒకే అస్థిత్వముగలవారై యున్నారు. వారిరువురు కలిసి, పరిశుద్ధాత్మతో కూడ (6:19; 12:3 చూడుము), వారు ఒక్క దేవుడై యున్నారు. పౌలు చూపించిన అంతరము యేసు రక్షకుడుగాను, ఆయన ప్రజలందరికి శిరస్సుగాను ఉండు పాత్ర వహించు విషయానికి సంబంధించినదై యున్నది. ఆయన వారిలో ఒకడుగా ఏలుతుంటాడు. తీర్పు, పునరుత్థానము, మరియు తన ప్రజలను నిత్యత్వము లోనికి తీసుకొని వెళ్లునిమిత్తము ఆయన తిరిగి వచ్చినప్పుడు, మధ్యవర్తిగా ఆయన వహించు విశిష్టమైన పాత్ర ముగింపవుతుంది (1 తిమోతి 2:5; 1 కొరింథీ. 8:6 చూడుము). ఆ సమయంలో, **సమస్తమును ఆయనకు లోపరచబడినప్పుడు దేవుడు సర్వములో సర్వమగునిమిత్తము కుమారుడు తనకు సమస్తమును లోపరచిన దేవునికి తానే లోబడును.** "సర్వములో సర్వము నైయున్న" దేవుడే, దేవత్వమై యున్నాడు.

కుమారుడు ఆరోహణుడగుటకు మరియు యుగాంతమందు ఆయన రెండవ రాకడకు (παρουσία, *parousia*; 15:24) మధ్య, మానవ పరిధిలోని ఆయన జీవితము మరియు మరణముతోపాటు కుమారుడు కొంత ఏలుబడి మరియు అధికారము కలిగియుంటాడనేది దాని అంతర్భావమై యున్నది. ఇప్పుడు కూడా, కుమారుని అధికారము, తండ్రి యొక్క మహిమనుగాని లేదా సంపూర్ణాధిపత్యమును గాని విస్మరించినది కాదు. కుమారుడు నరావతారమెత్తిన దాని ఆధారంగా తండ్రి కుమారునికి ఒక బృహత్కార్యభారమును నియుక్తము చేశాడు. సకల మానవుల విమోచనార్థమైన ఒకే నిత్య ప్రణాళిక విషయంలో తండ్రి మరియు కుమారుడు పరిపూర్ణంగా ఏకమై యున్నారు.

క్రీస్తు సందేశం, మరణించవలసి వచ్చినను, అది హృదయ పూర్వకమైన నిబద్ధత కంటె తక్కువ కాని దానికొరకైన ఒక ఆహ్వానమై యున్నది (లూకా 14:26, 27). గలిలయుడైన బోధకుని యందలి విశ్వాసముతో, ఆయన స్వాధికారంతో అపేక్షించిన సమగ్రమైన జీవితం జీవించుటతో సంబంధాన్ని జోడించేది, మృతుల పునరుత్థానమై యున్నదని పౌలు తర్కించాడు. రాబోవుచున్న యుగములోని జీవితం కొరకైన ఉత్తరాపేక్ష లేకుండా, యేసు అనుచరుడై యుండునట్లు అపాయము, శ్రమ, మరియు మరణము నకు తనను తాను లోపరచుకొనడానికి తెలివి తక్కువైన వాడు మాత్రమే ఎంపిక చేసుకొంటాడు. శరీర పునరుత్థానము క్రైస్తవ ఒప్పుకోలునకు ఒక అనుబంధం కాదు. అది క్రీస్తునందలి మన విశ్వాసములోని ప్రధానాంశంలో పాలుపుచ్చుకొంటుంది.

## "ఎందుకు?" అనే ఒక పెద్ద ప్రశ్న (15:29-34)

**29ఇట్లు కానియెడల మృతుల కొరకై బాప్తిస్మము పొందువారేమి చేతురు?
మృతులేమాత్రమును లేపబడని యెడల, మృతుల కొరకు వారు బాప్తిస్మము పొందనేల?
30మరియు మేము గడియగడియకు ప్రాణభయముతో నుండనేల? 31సహోదరులారా,
మన ప్రభువైన క్రీస్తు యేసునందు మిమ్మును గూర్చి నాకు కలిగియున్న అతిశయము
తోడు నేను దినదినము చనిపోవుచున్నానని చెప్పుదును. 32మనుష్యరీతిగా, నేను**

**ఎఫెసులో మృగములతో పోరాడిన యెడల నాకు లాభమేమి? మృతులు లేపబడని యెడల, రేపు చనిపోదుము గనుక తిందము త్రాగుదము. [33]మోసపోకుడి. దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపును. [34]నీతి ప్రవర్తనగలవారై మేల్కొని పాపము చేయకుడి; దేవుని గూర్చిన జ్ఞానము కొందరికి లేదు. మీకు సిగ్గు కలుగుటకై యిట్లు చెప్పుచున్నాను.**

**వచనము 29.** ఈ వచనంలో గల కష్టాలను వివరించడానికి బైబిలు విద్యార్థులు లెక్కలేనన్ని మార్గాలు ప్రతిపాదించారు. వీటిలో అనేకం వ్యాఖ్యానకర్తలు ప్రతిపాదించుచున్న వివేకముతో కూడిన వివరణముల కంటె ఎక్కువగా వారి బుద్ధికుశలతను ప్రదర్శిస్తున్నాయి. సిద్ధాంతపరమైన పద్ధతులు యావత్తు ఈ వచనము యొక్క అక్షరార్థమైన అనువాదముపై ఆధారపడు తున్నవి. కొరింథీయులు, మరణించిన వారి పక్షాన ఒక రకమైన ప్రత్యామ్నాయంగా ఉండే బాప్తిస్మమును అభ్యసించుచుండిరని ఇతరులు సూచిస్తున్నారు. విషయం ఇదే అయినట్లయితే, దీని గూర్చిన వివరము క్రొత్త నిబంధనలో వ్రాయబడిన చోటు ఇదొక్కటే అవుతుంది. ఇంతేగాక, పౌలు ఈ విషయాన్ని పేర్కొని ఆ మీదట సంబంధిత అంశాన్నే విడిచిపెట్టిన క్రమరహితమైన విధానము దృష్ట్యా, వివరము చెప్పుకోదగ్గ కష్టాన్ని సూచిస్తున్నది. మరణించిన అవిశ్వాసులైన స్నేహితులు లేదా బంధువుల నిమిత్తం క్రైస్తవులకు బాప్తిస్మమియ్య బడుచుండినట్లయితే, ఇట్టి అభ్యాసాన్ని సరిదిద్దడానికి ప్రయత్నించకుండానే ఈ అభ్యాసం గూర్చి పౌలు పేర్కొని యుంటాడనేది ఊహాతీతమైనదై యున్నది, వక్రీకరింపబడిన క్రైస్తవ సిద్ధాంతాన్ని ప్రతిఘటించడానికి అపొస్తలుడు సిగ్గుపడుటలేదు. పౌలు, బాప్తిస్మము గూర్చి చర్చించిన ప్రతి సందర్భంలో (రోమా. 6:3-7; 1 కొరింథీ. 6:11; గలతీ. 3:27; కొలొ. 2:12; తీతు. 3:5), బాప్తిస్మము పొందుచుండిన వ్యక్తి ప్రదర్శించిన విశ్వాసముతో కూడిన ప్రతిస్పందన గూర్చి అతడు మాటలాడుచుండెను.

కొరింథీయులు ప్రత్యామ్నాయమైన బాప్తిస్మమును అభ్యసించు చుండిరనే అభిప్రాయం గూర్చిన కష్టాలు ఎదురైనప్పటికిని, కొందరు వ్యాఖ్యాన కర్తలకు అది ఆ వాక్యభాగము గూర్చి అత్యంత ఆచరణ సాధ్యమైన వివరమును ప్రతిపాదించినది. "అతడు అతనిని వ్యతిరేకించుచుండినవారు అభ్యసించుచుండిన వాడుకయే గాని అది తాను అనుమతించని అభ్యాసమై యుండినదని విన్నవించుకొనుట సాధ్యమే" అని Herman Ridderbos వ్రాశాడు.[23] ఇటువంటిది వాస్తవమైనదై యుండాలంటే, వారి వాడుక, దాని వలన ప్రయోజనమేమియు లేదని అతడెరిగియుండినప్పకిని, అది హానికరముకానిదై యున్నట్టు అతడు గమనించియుంటాడు. **మృతులేమాత్రమును లేపబడని యెడల, మృతుల కొరకు వారు బాప్తిస్మము పొందనేల?** అనే పౌలు మాటలు పేర్కొనబడిన అభ్యాసమును అపొస్తలుడు ఆమోదించడం లేదని సూచింపవచ్చు. అది పునరుత్థానము గూర్చిన అతని బోధలను బలపరచినప్పటికిని, ఒకడు ఈ సిద్ధాంతము గూర్చి మరి ఎక్కువ విదితంగా నున్న తృణీకారమును ఆశించవచ్చు. ఏదేమైనప్పటికిని, ఇట్టి వాడుకకు పౌలు దూరంగా ఉంటున్నట్లు కనబడుతున్నది. పౌలు, "వారేమి

చేతురు?" అని అడుగుతున్నాడు - "మనమేమి చేతుము?" అని అడుగడం లేదు. "మృతుల పునరుత్థానము లేనియెడల, 'మృతుల కొరకు' బాప్తిస్మము పొందుట వలన ప్రయోజనమేమి?" అనేది ఈ ప్రశ్నలోని భావమై యున్నట్లు కనబడుతున్నది. ఇది మంచి వివరణయైయున్నది: "పునరుత్థానము లేదని చెప్పువారే కొందరు మృతుల పక్షాన బాప్తిస్మమిచ్చుచున్నారు. ఇందులో ఏమైనా అర్థమున్నదా?"[24]

ప్రత్యామ్నాయంగా, పౌలు, మరణించినవారి విషయమై ఆలోచించిన తరువాత, ఒకడు వారి బాప్తిస్మము యొక్క విలువను గూర్చి కలిగియుండు అవగాహనను సూచించి యుండవచ్చు. క్రీస్తునందు విశ్వాసముంచినవాడు, ఇతరులు మరణించిన రీతిసే, తాను కూడ మరణించి కడ బూర మ్రోగినప్పుడు ప్రభువును ఎదుర్కొంటాడని గ్రహించిన తరువాత, బాప్తిస్మము పొందడానికి ఇష్టపడవచ్చు. పౌలు ఆలోచనను David E. Garland ఇలా దండాన్వయము (వివరించాడు) చేశాడు: "మృతుల పునరుత్థానము లేనట్లయితే, బాప్తిస్మము, సంభవింపని ఏదో ఒక విషయానికి అబద్ధపు ప్రతినిధియై నిలుచు ఒక అర్థంలేని ఆచారమవుతుంది."[25] ὑπέρ (*huper*) అనే ఉపసర్గములో నుండి, ". . . పట్ల గల దృష్టికోణంతో" అర్థం చేప్పడం కష్టమని భావించవచ్చు, కాని పౌలు సర్వసాధారణంగా ఉపయోగింపబడుచుండిన మాటల అర్థాన్ని అరుదుగా పొడిగించు చుండెను.

పౌలు మనస్సులో, అనుకొనని విధంగా మరణించిన వానిలో గల విశ్వాసమునకు సాక్ష్యముగా విశ్వాసులు పొందిన బాప్తిస్మము ఉండవచ్చుననేది మరొక సాధ్యత. మరణించిన వానిలో గల తన విశ్వాసమును వ్యక్తము చేయగలుగునట్లు బాప్తిస్మము పొందాలని భక్తిపరుడైన విశ్వాసి తనకుతానుగా ఆశించియుండవచ్చు. అతడు కనికరముతో కూడిన దేవుని క్షమాపణ మరియు కృప నిమిత్తమైన విన్నపముగా ఇటువంటి తెగింపుతో కూడిన చర్యను చేపట్టియుండ వచ్చు. పౌలు తాను చెప్పిన దాని కంటె యింకా ఎక్కువ ఎందుకు వివరించలేదో ఇట్టి నేపథ్యం వివరించవచ్చు. బహుశా మృతులైన తమ ప్రియుల కోసం బాప్తిస్మము పొందినవారి దుఃఖమును అతడు దాక్షిణ్యముతో లక్ష్యపెట్టుచుండవచ్చు.

పౌలు మాటల యొక్క ఏ వివరణము కూడ సంపూర్తిగా సంతృప్తికరంగా లేదు. ఏదేమైనప్పటికిని, రద్దుచేయబడగల వచనములో నుండి విశ్వాసులు కొన్ని తుది అభిప్రాయాలను ఏర్పరచుకొన్నారు. (1) "మృతులు" అనే పదం గ్రీకులో బహువచనంలో ఉన్నది, గనుక ఈ వచనము కొందరు సూచిస్తున్నట్టుగా మృతుడైన యేసు పక్షాన బాప్తిస్మము పొందారనే అర్థమీయజాలదు. (2) మృతుల కోసమైన బాప్తిస్మము గూర్చి వేరొక బోధ క్రొత్త నిబంధనలో లేదు కాబట్టి, ఒకడు మరొకని పాపములు కడిగివేయబడునట్లు బాప్తిస్మము పొందడంలో ఏదైన సార్థకత్వం ఉన్నదనే తలంపును మనము నిరపాయంగా నిరాకరించవచ్చు (అపొ. 22:16 చూడుము). రక్షించు బాప్తిస్మము, పశ్చాత్తాపముతో బాప్తిస్మము పొందుతున్న విశ్వాసి ప్రదర్శించు విశ్వాసముతో కూడిన ఒక ప్రతిస్పందనయైయున్నది.

**వచనము 30.** తన దృష్టిని కొరింథీయుల నుండి తన మీదికి మళ్లించుకొనుచు, మృతుల పునరుత్థానము లేనట్లయితే, తాను మరియు ఇతర బోధకులు క్రీస్తు

నిమిత్తము తమ ప్రాణాలను ఎందుకు అపాయానికి లోనుచేసుకోవాలని అడుగుతున్నాడు. అపొస్తలుడు శరీర పునరుత్థానము లేకుండా మరణానంతర జీవితమును గూర్చిన సాధ్యతను సహితం పరిగణలోనికి తీసుకొన్నట్లుయితే, ఇటువంటి మరణానంతర జీవితం విషయంలో న్యాయసమ్మతము లేదు లేదా పునర్విచారణ లేనట్టు అతడు స్పష్టంగా చూశాడు.

గ్రీకు పండితుల దృష్టిలో, భౌతిక శరీరం మరణాన్ని తట్టుకొట్టుకొని బ్రతుకుతుందనే భావన అమాయకమైన అజ్ఞానము యొక్క ఔన్నత్యమై యుండింది. ఉదా|| ఏథెన్సులో, అతడు మృతుల పునరుత్థానము గూర్చి మాటలాడినంత వరకు అతని మాటలకు నిశ్చయాత్మకమైన ప్రతిస్పందన ప్రదర్శింపబడినట్లు కనబడు తున్నది (అపొ. 17:32). పౌలును వ్యతిరేకించుచుండిన కొందరు అతని అపొస్తలిక అధికారమును సందేహించి యుండవచ్చు, ఎందుకనగా అతని ప్రసంగం వాగ్ధాటిగలదై యుండలేదు (2 కొరింథీ. 10:10). పౌలుకు తత్త్వశాస్త్రసంబంధమైన విషయాలు ఏమియు ఎరుకలేవని స్వాధికారంతో చెప్పుచుండిరి (1 కొరింథీ. 2:6 చూడుము). జ్ఞాన ప్రాధాన్య వాదం విషయంలో తనకు కొరవగా నున్నదానంతటిని సంధికి సమ్మతింపని సత్తాగల విశ్వాసంతో పూరిస్తున్నాడనేది అపొస్తలుడు తన విమర్శకుల పట్ల ప్రతిస్పందిస్తున్నాడు. తాను విశ్వసించుచున్న దాని కొరకు తన ప్రాణాలిర్పించుటకైనను అతడు సిద్దంగా ఉండెను. విద్వాంసులైన తత్త్వవేత్తలు సిద్ధంగా లేకుండిరి.

తన విమర్శకులను ప్రతివాదం చేత పడగొట్టడానికి పౌలు సంకోచించలేదు. అతనికి జ్ఞానం కొదువగా ఉండినట్లయితే, అది భూసంబంధమైనదై యుంటుంది. దేవుడు తన బలహీనతల ద్వారా చేయుచుండిన కార్యములు దేవుని మహిమను గూర్చిన సంకేతమై యుండిందని అర్థంచేసుకొన్నాడు. తనకు తత్త్వజ్ఞానములో ప్రావీణ్యత ఉన్నట్టు పౌలు నటించలేదు. ఇదీగాక, అతడు ఎడతెరిపిలేకుండా ఎదుర్కొనుచుండిన అపాయాలు అతడు దేవుని ముందాలోచనతో కూడిన సమకూర్పుపైనే ఆధారపడుచుండెననుటకు నిదర్శనమై యుండినవి. మృతుల పునరుత్థానము లేనట్లయితే, అతడు తన జీవితమును కొనసాగిస్తూ వారికి బోధించాల్సిన అవసరమే ముంటుందని పౌలు కొరింథీయులను ప్రశ్నిస్తున్నాడు. తాను **గడియగడియకు ప్రాణభయముతో** ఎందుకుండాలి?

**వచనము 31.** నేను **దినదినమును చనిపోవుచున్నాను** అని పౌలు చెప్పినప్పుడు, అతడు అపాయాలను ఎడతెరిపిలేకుండా ఎదుర్కొంటూ జీవిస్తున్నాడని భావించాడు. అతడు చెరసాలలో వేయబడుటకు అవకాశాలుండినవి లేదా అతడు ఏ క్షణంలోనైనా హతమార్చబడవచ్చు. తాను పయనించివెళ్లిన ప్రతి చోట శత్రువులుండిరి. కాని సువార్త కోసం అట్టి శ్రమలను అతడు అత్యంత చులకనగా పరిగణించాడు (అపొ. 9:16; 2 కొరింథీ. 11:23-27 చూడుము). దేవుని మహిమ కొరకు, మరియు ఆత్మల రక్షణ కొరకు, కొరింథులోని విశ్వాసుల వంటి క్రైస్తవులలో విశ్వాసమును రగులించుట వలన సిద్ధించిన సంతోషము మరియు సంతృప్తి నిమిత్తమై అతడు తన ప్రాణాలనైనా అర్పించుటకు సంసిద్ధుడై యుండెను. సాధారణంగా ఒక ప్రమాణమును ప్రవేశపెట్టుటకు ఉపయోగింపబడుచు, "రూఢిపరచు" అని అర్థమిచ్చు గ్రీకు పదం అ, క్రొత్త నిబంధనలో

ఇచ్చట మాత్రమే కనబడుతుంది. దీనితో తాను రచించిన సత్యమును అపొస్తలుడు గంభీరంగాను, నిశ్చలముగాను నిజమని నిర్ధారించాడు. νή (*nē)* ఈ వచనం ఇలా భాషాంతరీకరింపబడి యున్నది, "ప్రతి దినము నేను చనిపోవుచున్నాను నా స్నేహితులారా, మీయందు నాకున్న అభిమానంతో నేను ఆనబెట్టి చెప్పుతున్నాను మన ప్రభువైన క్రీస్తు యేసునందు మిమ్మును గూర్చి నేను అతిశయిస్తున్నాను."

మిమ్మును గూర్చి **నాకు కలిగియున్న అతిశయముతోడు** అనే పదబంధము యొక్క అర్థం కొన్ని ప్రశ్నలను లేవదీస్తున్నది. "మిమ్మును గూర్చి" అనే పదజాలము నొక్కిచెప్పబడినదై యున్నది. "గంభీరమైన ప్రమాణంతో, మీ అతిశయము గూర్చి నేను విన్నవించుకొనుచున్నాను" అనేది ఈ మాటల్లో గల భావమై యున్నది. అది వారికి క్రీస్తునందున ఆశీర్వాదముల యొక్క "అతిశయమంత" నిశ్చయంగా నిజమై యున్నదని చెప్పుతూ, అతని జీవితంలో గల అపాయమును అపొస్తలుడు గంభీరంగా ధ్రువీకరించుచుండెను. పౌలు యొక్క ప్రస్తావన కొరింథీలోని క్రైస్తవులు వారి ఒప్పుకోలునుబట్టి అనుభవించుచుండిన సంతోషము మరియు సంతృప్తి గూర్చినదై యుండు సాధ్యతను గ్రీకు భాష అనుమతిస్తుంది. అపొస్తలుడు వారియందు కలిగియుండిన తన సొంత అతిశయమును, తన సొంత సంతృప్తిని మరియు సంతోషమును సూచించుచుండెననేది మరొక సాధ్యతయై యున్నది. చర్చింపబడుతున్న "అతిశయము" పౌలు వారిలో **మన ప్రభువైన క్రీస్తు యేసునందు** కలిగియుండిన అతిశయమై యుండినదని ఈ వచనంలోని మొదటి భాగం స్పష్టం చేస్తున్నది. అతని బోధల ఫలితంగా వారు క్రీస్తునందు జీవమును పంచుకొనుచున్నారనే ప్రమాణాన్ని ఆమంత్రించడం ద్వారా అపొస్తలుడు తాను చెప్పిన దాని గూర్చిన సత్యమును ఒప్పుసుకొన్నాడు. అది నిర్వచింపబడి వారు క్రీస్తు యేసు నందుండుట ద్వారా సాధ్యం చేయబడిన అతిశమై యుండింది.

**వచనము 32.** పునరుత్థానము మరియు దానితో ముడిపడియున్న నిత్య జీవము కొరకైన నిరీక్షణను ప్రక్కన బెట్టేసి, తన ప్రాణమునైనా ఫణంగా పెట్టడానికి సిద్ధంగా ఉన్నాడంటే దాని వెనుక ఏవో మున్ముందటి ప్రయోజనముల గూర్చిన ప్రేరకము లుంటాయని కొందరు భావిస్తుంటారనే విషయం అతనికి ఎరుకేనని పౌలు అంగీకరించాడు. అపొస్తలుడు **మనుష్యరీతిగా** (κατὰ ἄνθρωπον, *kata anthrōpon*; 15:32), అనగా, క్రైస్తవ సమాజంలో ఒక నాయకుడుగా అతడు కలిగియుండిన పరువు లేదా అభ్యుదయేచ్ఛల కొరకు అలా ప్రవర్తించాడని కొందరు చెప్పుదురు. అతడు సహించిన దానంతటికిగల కారణం, "మనుష్య రీతియైన ప్రేరకములు" కావని అపొస్తలుడు చెప్పాడు. కొరింథులో అతని ప్రాణానికే ముప్పు పొంచియుండింది (అపొ. 18:12). ఇప్పుడు, 200 మైళ్ల దూరంలో లేక గ్రీస్ మరియు టర్కీ దేశములకు మధ్య నుండిన మధ్యధరా ప్రాంతములో, అట్టి ఆపద ఎదురులేనదై యుండింది. అప్పటికే, **నేను ఎఫెసులో మృగములతో పోరాడితిని** అంటున్నాడు.

అసాధారణంగా కష్టమైన లేదా అపాయకరమైన అనుభవము గూర్చి స్తోయికుల మనస్తత్వముగల గ్రంథకర్తలు, "అడవి మృగములతో పోరాడుట" అని చెప్పుకొనుటకు అలవాటు పడిపోయారు.[26] అది అతని భావమై యుండిందని కొందరు

భావించినప్పటికిని, అతడు అక్షరాలా అడవి మృగములతో పోరాడటానికి రణరంగంలోనికి తీసికొనిపోబడ్డాడని పౌలు భావించి యుండుట సంభావ్యం కాదు. అతడు నిజంగానే అలా పోరాడియుండి నట్లయితే, కత్తిమీది సామువంటి పరీక్షలో అతడు బ్రతికి బయడపడేవాడు కాదు; కొందరు బ్రతికి బయటపడ్డారు. పౌలు, వాటి వివరాలు చెప్పనప్పటికిని, అతడు ఎఫెస్సులో కొన్ని తీవ్రమైన పరీక్షలు ఎదుర్కొన్నాడు. అతడు ఎఫెస్సులో దాదాపు మూడు సంవత్సరములుండినాడు (అపొ. 20:31 చూడుము). కాని కొరింథీయులకు తన మొదటి పత్రికను వ్రాయక మునుపు అతడు అక్కడ ఎంత కాలముండినాడో స్పష్టంగా తెలియదు. అతడు కచ్చితంగా కంసాలుల చేత చేపట్టబడిన అల్లరిని సూచించు చుండలేదు, ఎందుకనగా అప్పటికే అతడు ఆ పట్టణమును విడిచిపెట్టి వెళ్లిపోవుచుండిన సమయమై యుండింది (అపొ. 19:24, 25; 20:1; 2 తిమోతి 4:14 చూడుము).

మృతుల పునరుత్థానము లేనట్లయితే, ఒకడు తనను తాను ఇటువంటి తీవ్రమైన అగ్నిపరీక్షలకు లోనుచేసుకోడానికి కారణమేమియు ఉండదని పౌలు ఎదుర్కొన్న పరీక్షలు సాక్ష్యమిచ్చాయి. మరణానంతర జీవితంలో నిరీక్షణ లేకుండా, ఇటువంటి ఇక్కట్టుల వలన ప్రయోజనమేమియు ఉండదు. దానికి బదులుగా, సుఖాసక్తివాదులు చేపట్టు లక్ష్య సాధన ప్రణాళిక ఉత్తమమైనదై యుంటుంది[27] "రేపు చనిపోదుము, గనుక తిందము త్రాగుదము" (యెషయా 22:13). గ్రీకు-రోమను ప్రపంచంలోని అనేక ప్రదేశాల్లో ఈ ప్రకటనలోని విధివిధాన సిద్ధాంతం ప్రజల మనస్తత్వంలో బాగా నాటుకపోయింది. "నీవు మృతుల పునరుత్థానమును నమ్మనట్లయితే, నీ ఆలోచనలను దాని సహేతుకమైన తుది అభిప్రాయానికి అంటిపెట్టుకొని యుండుటకు ధైర్యంగా ఉండు. ప్రస్తుతం నీవు కనుగొనగల అర్థం పర్థంలేని సుఖభోగాలు ఏవైనా వాటన్నిటి ఆనందానుభూతిని అనుభవించు, ఎందుకనగా భవిష్యత్తులో నీకు మిగిలిందెల్లా, చావే." "ఈ క్షణమే నీది, మరు క్షణం మనది కాదు, గనుక నీకు చేతనైనంత ఆనందానుభూతిని అనుభవించు" అని అర్థమిచ్చునటువంటి ల్యాటిన్ పదజాలములు *carpe diem* ("seize the day") అదే తత్త్వంలో పాదుకొనిపోయాయి, భవిష్యత్తులో అతనికి ప్రాప్తిస్తాయని ఒకడు ఆశించునవి చావు మరియు సమాధి మాత్రమే అయియున్నట్లయితే, ప్రస్తుత క్షణమే ఎంతో ముఖ్యమైనదవుతుంది.

**వచనము 33.** యుగాంతమందు రక్షింపబడినవారి శరీర పునరుత్థానమును ఒప్పుకొననివారు, వారి నుండి తప్పించు కొనవలెనని పౌలు తన పాఠకులను కోరుచుండిన చెడు ప్రభావాలై యుండిరి. స్పష్టంగా, శరీర పునరుత్థానమును కొరింథీయులలో కొందరు అత్యంత ఆషామాషీగా కొట్టిపారేశారు. పౌలు కొరింథులో ఎదుర్కొన్న నికరమైన ఇబ్బందులను మరలా సంఘటితము చేయడము కష్టమే. ఆధునిక పాఠకులు ఊహించుకోవలసి యుంటుంది, కాని వారు అదివరకే పునరుత్థానమును అనుభవించారని కొందరు కొరింథీ విశ్వాసులు స్వాధికారంతో అపేక్షించి యుండవచ్చు. ఎంతో కొంత అపార్థం మరియు బుద్ధిపూర్వకమైన వక్రీకరణము మేళనము చేయబడుట చేత, బాప్తిస్మము పొందడము వలన నూతన జీవమునకు పునరుత్థానమగుటగా పరిణమిస్తుందని పౌలు బోధించాడని వారు స్వాధికారంతో

చెప్పియుండవచ్చు (రోమా. 6:4 చూడుము). వారు అదివరకే లేపబడి, క్రీస్తుతో కూడ కూర్చుండి యున్నారని వారు నమ్మినందు వలన, దుర్నీతి లేదా పాపము గూర్చిన భయం వారికి లేకుండింది. ఒక ముఖ్యమైన నియమమును వారికి ఒప్పిత మయ్యేట్లు మరలా చెప్పి ఈ అభిప్రాయం తప్పని పౌలు నిరూపించాడు. క్రైస్తవులు ఒప్పుకొను ఒప్పుకోలు వారు అభ్యసించు నీతి నుండి వేరుచేయబడరాదని సువిదితం చేశాడు.

**దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపును** అనే సామెత, ప్రాచీన లౌకిక సాహిత్యంలోని అనేక స్థలములలో నుండి ఈనాటి ఆధునిక శకము వరకు వచ్చింది. ఇచ్చట ఉల్లేఖింపబడిన పౌలు మాటలు సాధారణంగా ఏథెన్సువాడైన Menander (సుమారుగా క్రీ.పూ. 300) ఆరోపింపబడుతున్నవి. చర్చింపబడుతున్న "దుష్ట సాంగత్యము" (ὁμιλίαι κακαί, *homiliai kakai*) ఒకడు చేయు సాహచర్యము మరియు తత్ఫలితంగా ఒకడు హత్తుకొను నమ్మకముల గూర్చినదై యున్నది. "దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపును" అనే KJV భాషాంతరీకరణము సత్యమును గూర్చిన జాడగలదై యున్నది. కాని అపొస్తలుని అంశము పలికిన మాటల కంటె ఎక్కువ విషయాలు కలిసియున్నదై యున్నది. "మంచి" అనే మాట, "నీతి విషయాలు" అనే మాటను మార్పుచేయుచున్న విశేషణాన్ని χρηστός (*chrēstos*) భాషాంతరీకరణము చేయుచున్నది. ఈ మాట సాధారణంగా "ప్రయోజనకరమైన" అని అర్థమిస్తుంది, కాని ఈ సందర్భంలో దాని అర్థం "నైతికంగా మంచిగాను మరియు ఉపకారబుద్ధిగలవారుగాను ఉండుటకు" సంబంధించినదై యున్నది.[28] ఒకడు చెడుతో సంబంధం కలిగియుంటూ దానిని ఆమోదిస్తున్నాడంటే - అది నోటిమాటగా చెప్పినది కావచ్చు - ఆ చెడులో పాల్గొంటున్నట్టేనని పౌలు ధ్వనించాడు. ఒకని నోటిమాటలు అనివార్యంగా ఒకని జీవితములోని ఫలములుగా పరిణమిస్తాయి. ఈ అర్థం, "నీతి సంబంధమైన ఇశ్రాయేలీయుల మరియు హెల్లేనీయుల ఆదర్శమును సామాజిక, రాజకీయ వ్యవస్థ లోలోపల నుండు ప్రయోజనత్వము యొక్క ప్రదర్శనగా పాటించుటయై యున్నది."[29]

**వచనము 34.** ప్రభువు మరలా వచ్చినప్పుడు చోటుచేసుకొను శరీర పునరుత్థానము గూర్చిన వారి మూర్ఖపు తృణీకారమును కొరింథీయులు విడిచిపెట్టాలని పౌలు వారిని విన్నవించుకొన్నాడు. **నీతి ప్రవర్తనగలవారై మేల్కొని పాపము చేయకుడి** అని వారికి వ్రాస్తున్నాడు. వారు అబద్ధ సిద్ధాంతమును ఓర్చుకొన్నంత కాలము వారికి క్రీస్తుతో నున్న సంబంధం గండంలో పడిపోయినట్టే అని వర్తమాన కాలములో నున్న గ్రీకు పదము సూచించుచున్నది. పాపమనేది దొంగతనం చేయడం, అబద్ధాలు పలుకడం వంటి నేరాలకు మాత్రమే కట్టుబాటు చేయబడలేదు. ప్రాథమిక సిద్ధాంతములను అంగీకరించని నమ్మకములను అంగీకరించుటవంటి నమ్మకములు పాపిష్టియైనవై ఉండవచ్చు. కొరింథీయుల విషయంలో సిగ్గుకరమై యుండినట్లు, వారు దేవుని గూర్చిన జ్ఞానము లోపించిన విషయాన్ని ప్రదర్శించిన బోధలు తప్పని తెలిసినా వాటిని ఖండించలేదు, పైపెచ్చు వాటితో రాజీపడ్డారు. పౌలు తన పాఠకులను వారి ప్రయోజనార్థమై విన్నవించుకొనడానికి ఇష్టపడుచుండెను. అదే విధంగా, ప్రశంసాయోగ్యమైన విషయాలుండినప్పుడు అతడు వారిని ప్రశంసించాడు, అసమ్మతమును తెలియ జేయాల్సిన పరిస్థితులేర్పడి నప్పుడు తన అసమ్మతిని

ప్రదర్శించాడు. అతడు దీనంతటిని ప్రజాదరణ పొందాలని కాదు, గాని సహోదరులు దైవ భయము, భక్తిగలవారై యుండునట్లు వారిని నడిపించాలని ఆశించుటయే.

## వెవ్వేరు విధములైన శరీరములు (15:35-41)

**[35]అయితే మృతులేలాగు లేతురు? వారెట్టి శరీరముతో వత్తురని యొకడు
అడుగును. [36]ఓ అవివేకీ, నీవు విత్తునది చచ్చితేనే గాని బ్రదికింపబడదు గదా. [37]నీవు
విత్తుదాని చూడగా అది గోధుమ గింజయైనను సరే, మరి ఏ గింజయైనను సరే, వట్టి
గింజనే విత్తుచున్నావు గాని పుట్టబోవు శరీరమును విత్తుట లేదు. [38]అయితే దేవుడే తన
చిత్త ప్రకారము నీవు విత్తినదానికి శరీరము ఇచ్చును. మరియు ప్రతి విత్తనమునకును
దాని దాని శరీరము ఇచ్చుచున్నాడు. మాంసమంతయు ఒక విధమైనది కాదు.
[39]మనుష్య మాంసము వేరు, మృగ మాంసము వేరు, పక్షి మాంసము వేరు, చేప
మాంసము వేరు. [40]మరియు ఆకాశ వస్తురూపములు కలవు, భూవస్తు రూపములు
కలవు; ఆకాశ వస్తు రూపముల మహిమ వేరు, భూవస్తు రూపముల మహిమ వేరు.
[41]సూర్యుని మహిమ వేరు, చంద్రుని మహిమ వేరు, నక్షత్రముల మహిమ వేరు.
మహిమనుబట్టి యొక నక్షత్రమునకును మరియొక నక్షత్రమున కును భేదము
కలదుగదా.**

**వచనము 35.** పునరుత్థానము గూర్చి వారి ప్రత్యర్థులు వారికి సహేతుకమైన విధంగా వివరించలేకపోయినందు వలన కొందరు దానిని ఒప్పుకొనలేదు. భౌతిక శరీరం కుళ్లిపోతుందనే విషయాన్ని ఎవరైనా అర్థం చేసుకొంటారు. అలాగైతే, అట్టి శరీరం మరలా ఎలా లేపబడుతుంది? Garland చేసిన ప్రకటన కొంత మేరకు నిజమే:

> కొరింథీయుల పొరపాటు యొక్క మూలము ఏదో బుద్ధిపూర్వకమైన సైద్ధాంతిక తిరుగుబాటులో లేదు కాని వారి గ్రీకు ప్రపంచ దృష్టికోణం దృష్ట్యా నిజాయితీతో కూడిన తికమకలో ఉన్నది. భౌతికమైనది మరియు నశించిపోవునదైయున్న ఇహలోక శరీరం, ఆత్మసంబంధమైనది మరియు నశింపనిదైయున్న పరలోక సంబంధమైన పరిధి నిమిత్తము తగినదానిగా ఎలా చేయ బడగలదు?[30]

నిస్సందేహంగా, తికమక ఒక కారణాంకమై యుండింది; కాని, "పాపము చేయకుడి" అంటూ పౌలు 15:34లో ఆజ్ఞాపిస్తున్న విషయం గందరగోళమును మించిన సంగతి ఇందులో మిళితమై యున్నదని సూచిస్తున్నది.

పౌలు కొరింథీ విశ్వాసులను ఒప్పించడానికి, "కఠినమైన దూషణము" అని పిలువబడిన అలంకార సంబంధమైన ఉపాయమును ఉపయోగిస్తున్నాడు. అతడు కాల్పనికమైన ప్రత్యర్థి నోటిలో సమంజసమైన మాటలుంచి (రోమా. 9:19; 11:19; యాకోబు 2:18 చూడుము) ఆ తరువాత వాదోపవాదములతో పరస్పరం వ్యవహరించాడు. ఆయన ప్రజలైన ఒక్కొక్కరికి పరలోక సంబంధమైన - ఆత్మసంబంధమైన ప్రపంచంలో నిత్య జీవము అనుభవించగల - శరీరమును

సమకూర్చడానికి దేవుడు పరిపూర్ణంగా సమర్థుడని కొరింథీయులను ఒప్పించాలనేది ఆతని ఉద్దేశమై యుండింది. తదనంతర ప్రశ్నలు వాస్తవంగా కొరింథులోనున్న కొందరిచేత లేవదీయబడగా, పౌలు మనస్సులో ఎవరో ఒక నిర్దిష్టమైన వ్యక్తి లేడు. సందేహవాది, **మృతులైనవారు ఎలా లేపబడుదురు?** వారు ఏ విధమైన **శరీరంతో** లేస్తారు? అని అడిగియుండవచ్చు. ఈ అధ్యాయంలో మొట్టమొదటిసారిగా, పౌలు "శరీరము" అనే పదాన్ని ప్రయోగించడానికి ఎన్నుకొన్నాడు. ఈ ప్రశ్నల్లో వ్యక్తము చేయబడిన సందేహం జ్ఞానమును గూర్చిన వాస్తవము కంటె ఎక్కువ వేశభాషలు కలిగియుండింది. వారు దేవుడు తనను గూర్చి తానే బయలుపర్చుకొనిన దాని విషయం తక్కువగా యోచించుచుండిరి. సరికదా, సామాన్య మానవ అనుభవాన్ని కూడ వారు పరిగణించలేదు.

**వచనము 36.** నిష్ఠురమైన, దృష్టిని ఆకర్షించు **అవివేకీ** (ἄφρων, *aphrōn*) అనే మాటతో, తెలివితేటలతో కూడిన వారి ప్రశ్నలు పునరుత్థానము గూర్చిన ఏ చర్చనైనను నోరు మూయించునని అనుకొనుచుండినవారిని పౌలు ప్రతిఘటించాడు. REB బైబిలు, పౌలు ప్రదర్శించిన ప్రతిస్పందనను పట్టుకొన్నది: "ఇవన్నీ, తెలివిమాలిన ప్రశ్నలు!"

**వచనము 37.** ఇలా సందేహించువారంతా సృష్టి వారి ముందుంచుతున్న దృష్టాంతములతో తమ్మును తాము పరీక్షించుకొనవలెనని పౌలు సాధికారంతో కోరాడు. నీవు అనే మాట నొక్కివక్కాణింపబడుతున్నది. "నీవైనాగాని, గోధుమ మొక్కను నాటి అది గోధుమ పంట నీయవలెనని ఆశించడం లేదదని" పౌలంటున్నాడు. ఏదైన ఒక విత్తనము విత్తబడినప్పుడు, అది క్షయమవుతున్నదంటే, దాని చావు అనివార్యమైనదని అర్థం. కాని అదే ప్రక్రియ నూతన జీవమును తెచ్చిపెట్టుతుంది. చావులో నుండి జీవం పెల్లుబుకుతున్నది. ఒక విత్తనం ద్వారా ఉత్పత్తియైన లేక మొలకెత్తిన మొక్క విత్తబడిన విత్తనమువంటిదై యుండదు. అట్లయినను విత్తనమునకును మొక్కకును మధ్య కొనసాగింపు ఉంటుంది. మానవులు సహితం, వారు జీవించాలంటే, మరణించాల్సిందే. శరీరం మృతిచెందుతుంది, గాని దాని క్షయము ఆత్మసంబంధమైన ఒక శరీరము గూర్చిన ఉత్తరాపేక్షను కలిగియున్నది. శరీరము క్షయమగుటకు శారీరకంగా జీవించియుండుట అంతం కావలసిన అవసరం లేదు. శారీరకంగా నిత్య జీవము సంబంధమైన భావమును తృణీకరించినవారడిగిన ప్రశ్నలు భౌతిక ప్రపంచం పట్ల చాలినంత శ్రద్ధను చూపించడం లేదు.

భిన్నమైనదే కాని దీనితో సంబంధంగల విషయాన్ని తెలియజెప్పడానికి యేసు ఇదే నియమమును, అనగా మరణములో నుండి జీవము అంకురించడమును ప్రయోగించాడు. ప్రభువు మరణించనై యుండిన సమయంలో, గ్రీకు భాష మాటలాడుచుండిన కొందరు యూదులు యెరూషలేములో పస్కాపండుగను ఆచరించడానికి వెళ్లుచుండిరి. వారు యేసును కలుసుకొనవలెనని ఆశించారు. యోహాను వ్రాసిన సువార్తలో వర్ణింపబడినట్టు, ఆయన గూఢార్థముగల తన విధానము చొప్పున, వారు తమ దృష్టికోణాన్ని మార్చుకోవాలని యేసు జిజ్ఞాసను కనుపరచుచుండిన వీరిని విన్నవించుకొన్నాడు. "గోధుమ గింజ భూమిలో పడి చావకుండిన యెడల అది ఒంటిగానే యుండును; అది చచ్చిన యెడల విస్తారముగా

ఫలించునని" ఆయన సెలవిచ్చాడు (యోహాను 12:24).

ఒక విత్తనము నశించుట, అందమైన ఒక మొలక మొలకెత్తుటకు ఏమాత్రమును ఒక ఆటంకం కానేరదు. అదే విధంగా, భౌతిక శరీరం మృతిచెంది క్షయమగుట, మృతిచెందిన దాని కంటె మరి ఎక్కువ అద్భుతకరమైన శరీరము పున రుత్థానమగుటకు ఎలాంటి ఆటంకములనైనను కలిగించనవసరం లేదు. ప్రకృతిలో హేతువు అర్థంకాని సంఘటనలను కలుగజేయగల దేవుడు పున రుత్థానమైన శరీరము గూర్చిన తన వాగ్దానమును నెరవేర్చుటకు సమర్థుడు. భౌతిక జీవితంలో పాల్గనుచుండుట వలన, లౌకికమైన ఈ శరీరములు రాబోవుచున్న యుగమునకు అర్హమైన శరీరముల రూపముల లోనికి మార్చబడగల విధానమును ప్రజలు అరుదుగా అర్థంచేసుకోగలరని ఆశించడమయ్యింది. ఏదో ఒక సమయంలో, ఒక సామాన్య విత్తనమునకు, ఉదా. **గోధుమ గింజయైనను** చేసినట్లే, ఆయన ప్రయోగించు సాధనముల గూర్చి తెలిసికోనక్కరలేకుండానే, వారి శరీరములను సహితం దేవుడు మార్పునొందిస్తాడని విశ్వాసముగల స్త్రీపురుషులు సామాన్యంగా విశ్వసించాల్సి వుంటుంది. సృష్టికర్తయైనవాడు ఒక విత్తనమును పువ్వులు పూసే మొక్కగా మార్చుటకును, ఒక గులకరాయి అచేతనమైనదిగానే ఉండునట్లు ఆయన ప్రయోగించిన సాధనముల గూర్చి అర్థంచేసుకోకుండానే మానవ పరిశీలకుడొకడు ఏదైన ఒక విత్తనమును మరియు ఒక గులకరాయిని పరీక్షించవచ్చు. మానవ శరీరం, గులకరాతికున్న జడత్వము కాదు గాని, విత్తనములో దాగియున్న శక్తిగలదై యున్నదని పౌలు తర్కిస్తున్నాడు.

**వచనము 38.** ఒక విత్తనము మొలకెత్తి నూతన **శరీరమునకు** (మొక్కకు) జీవమునిచ్చినప్పుడు, దేవుడు తన పనిలో తానున్నాడని అర్థం. విత్తనమునకు, దాని సొంత క్షయములో నుండి పెల్లుబికివచ్చు జీవమునిచ్చువాడు దేవుడే. దేవుడు ప్రతి విత్తనమునకు దాని దాని రూపమునిచ్చుచున్నాడు. అనగా, ఆ విత్తనములో నుండి ఏ మొలక మొలకెత్తాలో ఆయన నిర్ధారిస్తాడు. పునరుత్థానమైన శరీరము యొక్క స్వభావాన్ని క్రైస్తవులు పరిగణలోనికి తీసుకొనునప్పుడు, వారు దేవుని అద్భుతకరమైన శక్తిని పరిగణలోనికి తీసుకొనవలసి యుంటుందని పౌలు చెప్పుతున్నాడు. ఈ యుగంలో జీవించుచున్నవారి ఊహకందని విషయాలను చేయడానికి ఆయన సమర్థుడు. విత్తనములు మరియు అవి ఉత్పత్తిచేయు శరీరముల మధ్య గల కొనసాగింపును పట్టించుకొనకుండా ఉండకూడదు. ఆకాశ వస్తువులు, భూవస్తువులు రూపొందింపబడిన దాని కంటె ఎక్కువేమీ ఒక్క మూస నుండి రూపొందింపబడవు. ఆకాశ వస్తు రూపము ఆకాశవస్తువులకును భూవస్తు రూపము భూవస్తువులకును ఉంటుంది, వాటి వాటి ఏకత్వ ప్రత్యేకత నిర్వహింపబడుతుంది.

ఈ విషయంలో అపొస్తలుని తర్కమునకు ముఖ్యమైన ఆధారమేమనగా, ఒక విత్తనము మరియు తత్ఫలితంగా వచ్చు మొక్క, చెప్పుకోదగినంతగా వెవ్వేరుగా ఉంటూనే, రెండు కూడ భౌతిక వస్తువులే అయియుంటున్నవి. రెండింటిలో ఏ ఒక్కటైనను పూర్తిగా ఆత్మసంబంధమైన అస్తిత్వము కాదు. Wayne Grudem ఇదే దృష్టికోణాన్ని వ్యక్తంచేశాడు:

> సంక్షిప్తంగా చెప్పుకొంటే, యేసు మరియు క్రొత్త నిబంధన గ్రంథకర్తలు, పునరుత్థానమైన శరీరము మామూలుగా మరియు అవశ్యముగా అభౌతికమైనదని మనకు బోధించాలని ఆశించియుండినట్లయితే, వారావిధంగా చెప్పియుండేవారే. కాని అది పరిపూర్ణము గావింపబడిన ఒక శరీరమై యుండినప్పటికిని, బలహీనత, అనారోగ్యము, మరియు మరణము లేనిదిగా చేయబడినప్పటికిని, దానికి బదులుగా అది మామూలుగా శరీర సంబంధము మరియు పదార్థ సంబంధమునై యున్నదనుటకు వారు అనేక స్పష్టమైన సూచనలిచ్చారు.[31]

**వచనము 39.** ఈ సమయంలో పౌలు యొక్క సాదృశ్యములు, అవి అతని తర్కము కానప్పటికని, మారిపోయాయి. వృక్ష జగత్తు నుండి జంతు జగత్తునకు వెళ్తూ, అపొస్తలుడు తానిదివరకు చెప్పిన విషయాలను సమర్థించడానికి అదనపు తర్కములను సూచిస్తున్నాడు. దేవుడు వృక్ష జీవమునకు అనేక రూపము లిచ్చినట్లు, ప్రతి ఒక్క విత్తనము దాని దాని విలక్షణమైన మొక్కను ఉత్పత్తి చేయుచున్నట్లు, **మనుష్యుల మాంసము వేరు, మృగముల మాంసము వేరు,** ఆకాశ **పక్షుల మాంసము వేరు, చేపల మాంసము వేరుగా** ఉంటున్నవి. విత్తనములు మరియు అవి ఉత్పత్తిచేయు మొక్కల సాదృశ్యమును మనముందుంచుతూ, ఒక శరీరము యొక్క రూపము పదార్థ సంబంధమైనదిగా ఉంటూనే అది భిన్నమైన రూపము మరియు పని కలిగయుండునట్లు మార్చుటకు దేవుడు శక్తిగలవాడై యున్నాడని పౌలు చూపిస్తున్నాడు. నానా విధములైన మాంసము యొక్క సాదృశ్యములను మనముందుంచుతూ, దేవుడు విభిన్న పదార్థములను చేశాడు అయితే అవి ప్రతి ఒక్క జీవిత రూపమునకు చక్కగా సరిపడునట్లు చేశాడని చిత్రీకరించడానికి ప్రకృతినే ప్రయోగించుటకు అపొస్తలుడు కొనసాగించాడు. దేవుడు ఆకాశవస్తు రూపము నొకదానిని, అది సరిగ్గా ఆకాశ సంబంధమైన జీవితమునకు సరిపడునదై యుండుటకు అనువైన పదార్థములతో రూపొందిస్తాడు.

15:39లో, కీలకమైన మాట, "మాంసము"; 15:40, 41లోని కీలకమైన మాట, "మహిమ"యై యున్నది. జంతు జగత్తులోని మాంసము భిన్నమైనదై యున్నట్లు, భూవస్తువులు మరియు ఆకాశవస్తువులు వాటి మహిమలో భిన్నమైనవై యుంటున్నవి. పదార్థ సంబంధమైన వస్తువులు మరియు శరీర మరణమును తట్టుకొని బ్రతికి బయటపడే దానికిని మధ్య ఏదైనా కొనసాగింపు ఉంటుందో లేదో అని పౌలు సంబోధించుచుండిన ప్రజలు సందేహించారు, లేదా కనీసం ప్రశ్నించారు. వారు శరీరముతో పాతిపెట్టబడిన ఆత్మలై యున్నారనియు, కాబట్టి దాని పరిమితులకు లోనగువారనియు తమ్మును గూర్చి తాము అనుకొన్నారు. గనుక, మరణమంటే, శరీరములో నుండి కలిగిన విడుదలగా దృష్టించారు. ఇటువంటి ఆలోచనలను పౌలు తృణీకరించాడు. దేవుడు పదార్థ సంబంధమైన వస్తువులను ఆది యందే సృజించాడనియు, అవి మంచివై యున్నవని ప్రకటించాడనియు అతనికి బాగా తెలియును (ఆది. 1:31).

**వచనము 40.** దేవుని మహిమ **ఆకాశ వస్తురూపములకును**, **భూవస్తు**

**రూపములకును** స్వతఃస్సిద్ధంగా అంటియున్నది. ఒక చెట్టు లేదా ఒక కొండ యొక్క మహిమ, చంద్రుడు లేదా నక్షత్రముల మహిమ వంటిది కాదు. కాని ప్రతి ఒక్కటి దేని విధానంలో అదే సృష్టికర్త యొక్క నిత్య జ్ఞానమును మరియ శక్తిని ప్రతిబింబించుచున్నది. దేవుడు మహిమను భూవస్తు రూపములకు అనుగ్రహించినట్టుగానే, తాను స్వయంగా రూపొందించిన తన మహిమను ఆకాశ మండలములో నిరంతరము జీవించు రూపములకు కూడ అనుగ్రహించగలడు.

**వచనము 41.** పౌలు, తాను వర్ణించగలిగి యుండినప్పటికిని, భూసంబంధమైన దృశ్యముల మహిమ గూర్చి చెప్పలేదు. దానికి బదులుగా, అతడు తన సావధానమును ఆకాశమండలముల మహిమ వైపు మళ్లించాడు. వైవిధ్యం విదితమవుతున్నది. **సూర్యుని మహిమ వేరు, చంద్రుని మహిమ వేరు** అని అతడంటున్నాడు. దేవుడు ఒకే విధమైన మాంసమునకుగాని లేదా ఒకే విధమైన దేదీప్యమానమునకు గాని పరిమితమైనవాడు కాదు. విజ్ఞానశాస్త్ర సంబంధమైన జ్ఞానము పురోభివృద్ధి చెందుతున్నట్టుగా, రక్తమాంసములు గల శరీరముల మహిమ మరి ఎక్కువ సుస్పష్టమయ్యింది. అట్లయినను, శరీరములు వయస్సు మళ్లినవవుతాయి గనుక క్షయించిపోతాయి. భూవస్తు రూపములు జబ్బులకును, మరణమునకును లోనగును. పరిమితులు మాంసములో స్పష్టముగా లేని వస్తురూపములను దేవుడు చేయగల సమర్థుడని పౌలు తర్కిస్తున్నాడు. ఆకాశమండలములందలి పరిధుల్లోగల మార్పునొందని మహిమను సూచిస్తూ పౌలు తాను చెప్పుతున్న విషయాన్ని సమర్థించుకొంటున్నాడు. శరీర సంబంధమైన దుర్బల రూపములకును, మార్పులేని నక్షత్రముల రూపములకును మధ్య గల పరస్పర భేదమును చూపించాడు. భూవస్తు రూపములను, ఆకాశ వస్తు రూపములుగా మార్చుటకు దేవునికి శక్తి మరియు జ్ఞానము కూడ ఉన్నవి. ఆకాశ మండలములలో శరీర సంబంధంగా ఉనికి కలిగియుండుట అసాధ్యమని శరీరము యొక్క పరిమితులు తర్కించడము లేదు.

మొదటి ఆదాము మరియు రెండవ ఆదామైన యేసు క్రీస్తునకు మధ్య గల సమానాంతరములను పౌలు అదివరకే సూచనప్రాయంగా సూచించాడు (15:22). అతడు రోమీయులకు వ్రాసిన పత్రిక, కొరింథీయులకు వ్రాసిన కొన్ని సంవత్సరముల తదనంతరము వ్రాయబడిన పత్రిక, ఈ రెండింటి మధ్య గల సాదృశ్యమును మరి ఎక్కువ నిండుగా చర్చిస్తున్నది. రోమా. 5:14-19లో, క్రీస్తు యొక్క మరణము మరియు పునరుత్థానము వలన పరిణమించిన విమోచన దృష్ట్యా, ఆదాము చేసిన పాపము వలన ఏర్పడిన పర్యవసానములను పౌలు పూర్వాభినయం చేశాడు. పునరుత్థానుడైన క్రీస్తు విమోచింప బడినవారి పునరుత్థానమునకు ఒక మాదిరియై యున్నాడని పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికలో చూపించాడు. పునరుత్థానమైన క్రీస్తు యొక్క శరీరం, ప్రతి క్రైస్తవుని పునరుత్థానమైన శరీరమునకు హామీయై యున్నది.

పునరుత్థానమైన క్రీస్తు శరీరం, సమాధిలో పాటిపెట్టబడిన అదే శరీరమై యుండినప్పుడు, అది మహిమాన్వితంగా మార్పు చేయబడింది. పునరుత్థానమైన శరీరం, రక్తమాంసములుగల శరీరముతో కొనసాగింపులు మరియు విచ్ఛేదములు కలిగి యుంటుంది. ఈ సత్యము, విశ్వాస సహితమైన కన్ను చూడ గలిగినంత దూరం

విస్తరించినదై యున్నది.

## కడపటి ఆదాము (15:42-49)

**[42]మృతుల పునరుత్థానమును అలాగే. శరీరము క్షయమైనదిగా విత్తబడి అక్షయమైనదిగా లేపబడును; [43]ఘనహీనమైనదిగా విత్తబడి మహిమగలదిగా లేపబడును; బలహీనమైనదిగా విత్తబడి, బలమైనదిగా లేపబడును; [44]ప్రకృతిసంబంధమైన శరీరముగా విత్తబడి ఆత్మసంబంధ శరీరముగా లేపబడును. ప్రకృతిసంబంధమైన శరీరమున్నది గనుక ఆత్మసంబంధమైన శరీరముకూడ ఉన్నది. [45]ఇందు విషయమైఆదామను మొదటి మనుష్యుడు జీవించు ప్రాణి ఆయెనని వ్రాయబడియున్నది. కడపటి ఆదాము జీవింపచేయు ఆత్మ ఆయెను. [46]ఆత్మసంబంధమైనది మొదట కలిగినది కాదు, ప్రకృతిసంబంధమైనదే మొదట కలిగినది; తరువాత ఆత్మసంబంధమైనది. [47]మొదటి మనుష్యుడు భూసంబంధియై మంటినుండి పుట్టినవాడు, రెండవ మనుష్యుడు పరలోకమునుండి వచ్చినవాడు. [48]మంటినుండి పుట్టినవాడెట్టివాడో మంటినుండి పుట్టినవారును అట్టివారే, పరలోకసంబంధి యెట్టివాడో పరలోక సంబంధులును అట్టి వారే. [49]మరియు మనము మంటినుండి పుట్టినవాని పోలికను ధరించిన ప్రకారము పరలోక సంబంధిపోలికయు ధరింతుము.**

**వచనము 42.** పౌలు, **మృతుల పునరుత్థానము** గూర్చి, తత్త్వజ్ఞాన సంబంధమైన ఊహాకల్పనతో మిళితమైన విశ్వాసము కలిగియుండలేదు. శరీర సంబంధమైన వాటిని ఆత్మ సంబంధమైవాటిగా మార్చడానికి దేవుడు శక్తి, జ్ఞానము, మరియు చిత్తము కలిగియున్నాడనే సత్యం, స్వాభావికమైన వస్తురూపములలో విదితమైయున్న వైవిధ్యమైన మాంసము మరియు మహిమలో స్పష్టంగా తెలిసిపోతున్నది. మనుష్యుల జ్ఞానం, భూ వస్తు రూపములను చెడు మరియు పతనముతో పొరపాటున సమానము చేయుచున్నది. గనుక ఇది మానవ జ్ఞానము యొక్క లోపమును చూపిస్తున్నది (2:5).

ఈ పుడమిపై జీవించుటకుగాను దేవుని చేత రూపింపబడిన శరీరము, **విత్తబడినదని** అపొస్తలుడు చెప్పుతున్నాడు. గనుక, అది నశించునదై **అక్షయమైనదిగా** (φθορᾶ, *phthora*). నిత్యత్వమందు జీవము కలిగియుండుటకు లేపబడినది, నశించనిదై యుండునట్లు (ἀφθαρσία, *aphtharsia*) సృజింపబడి యున్నది. KJV, అలాగే NASB యొక్క కొన్ని ముద్రణలలో ఒక గమనిక, ఈ పదాలను "క్షయత" మరియు "అక్షయత" అని అనువదించడం ద్వారా కొంత భిన్నమైన భావాన్ని అందిస్తుంది. "క్షయత" దేవునిపై తిరుగుబాటుకు దుష్టప్రభావం కలిగి ఉండవచ్చు లేదా భౌతిక శరీరము శిథిలమగుటను సూచించవచ్చు. పాపం యొక్క పాడుచేయు శక్తిని ఇక్కడ పౌలు యొక్క ఆందోళన అనిపించడం లేదు. కాబట్టి, NASB మరియు NIV లో అనువాదం బాగా ఉంది. “విత్తబడినది” ఏదో అది ఈ లోకములో ఉండవలెనని దేవుడు

తన సృష్టి నిమిత్తము చేసిన వస్తురూపములై యున్నది.

**వచనము 43.** భూసంబంధమైన శరీరమునకును, లేపబడనైయున్న శరీరమునకును గల తారతమ్యమును పోల్చుటను పౌలు కొనసాగిస్తున్నాడు. ప్రస్తుత యుగమందలి భూసంబంధమైన శరీరములు **ఘనహీనమైనవిగాను బలహీనమైనవి** గాను విత్తబడినవి. పునరుత్థానములో, శరీరములు **మహిమను** మరియు శక్తిని బయలుపరచునట్లుగా మార్చబడును. భూ సంబంధమైన శరీరములు అహంకారులను దీనులనుగాచేయు మార్గముగలవై యున్నవి. అహంకారముతో కూడిన శరీరము వయస్సునుబట్టి బలహీనమైనదానిగా తగ్గించబడుతుంది. నిర్మలమైన మనస్సు భయముతో కూడినదై తికమకపడునదై కావచ్చు.

*సమాధిలో పాతిపెట్టబడిన అదే రక్తమాంసములుగల శరీరము యొక్క ఏదో అనాగరికమైన (అసంపూర్ణ) పునరుత్థానము విషయమై అపొస్తలుడు తర్కించుచుండలేదు.* ఒకడు సముద్రములో మరణిస్తాడు, వాని దేహాన్ని చేపలు తినేస్తాయి, ఆ చేపలను మరొకడు ఆరగిస్తాడు - ఇలాంటి వానికి ఏమి సంభవిస్తుందని సంశయశాలులు అడుగుతుంటారు. వీరు కూడ, వారి ఆత్మలు శరీరములో చిక్కుకొనిపోయాయని అనుకొన్న గ్రీకు తత్త్వవేత్తలు చేసిన పొరపాటునే చేస్తున్నారు. దేవుడు మృతులను లేపుటకు సంబంధించి ప్రాచీన సందేహవాదులుగాని లేదా ఆధునిక ప్రజలుగాని అధిగమింపబడలేని ఏ సమస్యనైనను ప్రతిపాదించలేదు. దేవుడు తనను తాను భూసంబంధమైన మూలాధారములకు పరిమితం చేసుకొనడు. మృతుల పునరుత్థానమునకు విజ్ఞాన శాస్త్రజ్ఞులు అధ్యయనం చేసే అదే విధమైన పరమాణువులు మరియు అణువులు అవసరం లేదు.

**వచనము 44.** అత్యధిక సందర్భాలలో, అర్థాన్ని ఒక భాషలో నుండి మరొక భాషలోనికి, తికమకపడకుండా అనువదించవచ్చు. కాని **ప్రకృతి సంబంధమైన శరీరము** (σῶμα ψυχικόν, *sōma psuchikon*) అనే పదజాలము కష్టంగా ఉన్నది. మన దృష్టిని మానవ పరిమితుల చేత నిర్బంధింపబడిన జీవిత లక్షణాల వైపు మళ్లించడానికి పౌలు విశేషణాన్ని ψυχικός (*psuchikos*) ప్రయోగించాడు. లక్షణాలు "దేహము" మరియు "శరీరము"తో అతివ్యాప్తమవుతున్నాయి (overlap). కాని అవి ఈ రెండింటి కంటె ఎక్కువ సమగ్రమైనవై యున్నవి. Richard E. Oster, Jr., ఈ క్రింది విధంగా వాదిస్తున్నాడు,

> "ప్రకృతి సంబంధమైన" అనే పదము, దీనికి (15:42-43) ముందున్న క్షయమైన, ఘనహీనమైన, మరియు బలహీనమైన మున్నగు పదములకు సంబంధించిన భావములన్నిటిని క్రోడీకరించుచుండగా, "ఆత్మసంబంధమైన" అనే పదము అక్షయమైన, మహిమ, మరియు శక్తి వంటి అభిప్రాయములతో ఒకే కూటమిలో ఉన్నది.[32]

పునరుత్థానమైన శరీరము భూసంబంధమైన శరీరములో స్వతఃస్సిద్ధమైనదైయున్న బలహీనత చేత పరిమితము చేయబడదు. కాని రాబోవు యుగమందలి శరీరము **ఆత్మసంబంధమైనదై** యుంటుందని పౌలు చెప్పినప్పుడు, అది

అభౌతికమైనదై యుంటుందని అతడు బోధించుచుండలేదు. భూసంబంధమైన శరీరము భూసంబంధమైన అవసరములకు తగినదై యుండగా, ఆత్మసంబంధమైన శరీరము ఆత్మసంబంధమైన జీవితమునకు సరిపడునదై యుంటుంది. ఆత్మసంబంధమైన శరీరము యొక్క స్వభావము గూర్చి ఇంత కంటె మరి ఎక్కువ బయలుపరచడానికి దేవుడు ఏర్పరచుకొనలేదు. కాని భూసంబంధమైన శరీరమున్నట్టే, ఆత్మసంబంధమైన శరీరం ఉంటుందని అపొస్తలుడు నొక్కి వక్కాణించాడు.

ఏదో ఒక విధమైన శరీరం లేకుండా ఉనికి కలిగియుండుట ఊహించుకోడానికే కష్టంగా ఉన్నది. శరీరము నుండి వేరైన ఆత్మ సంబంధిత అంతరిక్ష హద్దుల్లో చాలావరకు పరిమితిలేనిదై యుంటుంది. అంతరిక్ష హద్దులు లేకుండా అస్తిత్వముగలవారమై యుండుట సాధ్యమవుతుందంటారా? అగస్టీను, ప్లేటోకు సంబంధించిన తత్త్వవేత్తలను, ఆత్మలు భౌతిక శరీరాల్లో నుండి తమ్మును తాము వదిలించుకొన్నప్పుడు అవి స్వేచ్ఛగలవై, ధన్యమైనవై యుండుననే వక్కాణింపుతో కూడిన వితండవాదముతో ఎదుర్కొన్నాడు. అగస్టీను, ". . . ధన్యతను సంపాదించుకోడానికి, మనము ప్రతి విధమైన శరీరమును విడిచిపెట్టనక్కరలేదు. కాని నశించెడు, భారమైన, బాధాకరమైన, మరణించెడు శరీరములను విడిచిపెట్టాలి. దేవుని మంచితనము ఆది మానవుని కొరకు అనుకూలంగా మార్చబడినటువంటి శరీరములను కాదు, కాని మానవుని పాపము అనివార్యంచేయు నటువంటి శరీరములను మాత్రమే విడిచిపెట్టాలని" రచించాడు.[33]

**వచనము 45.** ఆదియందు, దేవుడు మానవున్ని తన పోలికచొప్పున సృజించాలని నిర్ధారించినప్పుడు, మానవజాతి భూమి మీద జీవించడానికి సరిపడు శరీరముతో ఆయన మానవాళిని సృజించాడు. దేవుడు మానవున్ని నేలమంటితో సృజించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదాడని చెప్పిన తరువాత, "నరుడు జీవాత్మ ఆయెను" అని లేఖనము చెప్పుతున్నది (ఆది. 2:7). పౌలు చదివి వినిపించడానికి ఆదికాండము భాషని భావానువాదం చేస్తూ, దానిని అనుకూలించుకొంటూ, **మొదటి మనుష్యుడు**, ఆదాము, **జీవించు ప్రాణి ఆయెను** అని వ్రాస్తున్నాడు. ఆదాము ఒక సమేళనము, ఒక శరీరము మరియు ఆత్మ ఒకే మొత్తంగా ఏకీకృతమగునట్లు జటిలంగా జోడింపబడి యుండెను. ఆత్మ లేని శరీరము, కట్టె లేదా పూవులు లేదా ఆకులు లేని ఒక చెట్టు వలె ఉంటుంది. ఆదాము మరియు ఆతని సంతానము శరీరాత్మలతో కూడిన అస్తిత్వములుగా నిర్వచింపబడవలసి యుండెను.

15:44లో పౌలు, "ప్రకృతి సంబంధమైన శరీరము" (σῶμα ψυχικόν, *sōma psuchikon*) మరియు "ఆత్మసంబంధమైన శరీరము" (σῶμα πνευματικόν, *sōma pneumatikon*) మధ్య గల తేడాను వివేచించినప్పుడు, అతడు నపుంసకలింగ ఏకవచన విశేషణములను ప్రయోగించాడు, కాని 15:45లో, మన దృష్టిని మొదటి మరియు **కడపటి ఆదాము** మీదికి మళ్లించాలని కోరాడు. మొదటి ఆదాము మరియు కడపటి ఆదాము చేత చేసుకొనబడిన ఎంపికల ఫలితార్థములు మానవ కుటుంబము విషయంలో మొత్తానికే భిన్నమైనవై యుండినవి. "మొదటి ఆదాము [మనుష్యుడు]" "జీవించు ప్రాణి" (ψυχὴν ζῶσαν, *psuchēn zōsan*) ఆయెను ఎందుకనగా అలా కావాలని దేవుడు ఇచ్ఛయించాడు. పాపము ప్రవేశింపక మునుపు, ఆదాము ఆత్మయై

యుండుట వలన అతనిలో బలహీనతగాని ఘనహీనతగాని ఉన్నట్టు సూచింపబడలేదు (15:43). ఆదామునకు, భూసంబంధమైనవానికి, సాముదాయిక అస్తిత్వముగలవానికి పాపము వలని ఫలితం మరణమై యుండింది (15:21, 22). "కడపటి ఆదాము," **జీవింపజేయు ఆత్మ** (πνεῦμα ζῳοποιοῦν, *pneuma zōopoioun*) మానవాళిని విమోచించినది. NASB భాషాంతరీకరణము **జీవింపజేయు ఆత్మ** అని అర్ధమిచ్చు ఆంగ్లేయ పదములను పెద్ద అక్షరములతో, "life-giving Spirit." వ్రాయడం ద్వారా గొప్ప అర్థాన్నే చేకూర్చారు. మొదటి ఆదాము, అతడు జీవాత్మయై యుండాలని దేవుడు సృజించిన ఆత్మకు మరణాన్ని తెచ్చిపెట్టాడు. కడపటి ఆదాము, జీవింపజేయు ఆత్మ, నిత్యత్వములో జీవించు నిమిత్తము ఆత్మసంబంధమైన శరీరమును కొన్నాడు.

**వచనము 46.** అపొస్తలుడు, **ఆత్మ సంబంధమైన** శరీరము అనేది, దానికి ముందు **ప్రకృతి సంబంధమైన** శరీరముండినదని ధ్వనించు చున్నదనే తన తర్కమునకు మద్దత్తును సంపాదించు కొనుటకు మాత్రమే వెదకుచుండెను. Garland ఈ విషయాన్ని ఈ క్రింది విధంగా దృష్టించాడు:

> పౌలు ఈ వాక్యభాగంలో చేయుచున్న తర్కమునకు, కొరింథీయుల స్వాభిమానంతో కూడిన ఆధ్యాత్మికతతో ఎటువంటి సంబంధమైనను లేదు. కాని భూసంబంధమైన శరీరము స్వర్గసంబంధమైన శరీరముగా లేపబడుట గూర్చిన వారి దిగ్భ్రాంతితో సంబంధంగలదై యున్నది.[34]

ఒకడు వాని మరణమునకును మరియు యుగాంత మందు ప్రభువు ప్రత్యక్షమగువరకునుగల మధ్య కాలంలో వాడు వాని సచేతనత్వమును నిలిపి ఉంచుకొంటాడా లేదా అనే విషయం గూర్చి పౌలు సామాన్యంగా సంబోధించలేదు. కనీసం, పౌలు 1 కొరింథీ. 15లో సంబోధించలేదు. బహుశా, మరెచ్చటైనను సంబోధించి యుండక పోవచ్చు. Oster మరణోత్తరమైన జీవములో గల కొరింథీయుల నమ్మకమును పునరుత్థానము తరువాతి జీవములో గల పౌలు నమ్మకము నుండి వేరుపర్చాడు.

> ఆత్మసంబంధమైన శరీరము . . . విశ్వాసి యొక్క మరణానంతర దశను మరియు స్థితిని కాదు, కాని క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు మరియు యుగాంతమందుండు దశను మరియు స్థితిని మాత్రమే సూచిస్తుంది.[35]

**వచనము 47.** మొదటి ఆదామునకును కడపటి ఆదామునకును మధ్యగల కొనసాగింపును పౌలు చూపించాడు. పాపము చేత కళంకమైన శరీరం, తద్కారణంగా బలహీనత మరియు ఘనహీనతకు లోనగు శరీరం, వైభవము మరియు శక్తిగల శరీరముగా క్రీస్తు చేత మార్పునొందింపబడవలసి యున్నది. పరలోకమందలి జీవితం ఇహలోకమందలి జీవితం వలె ఉంటుంది, ఏలయనగా ఈ రెండింటిలోను శారీరక అస్తిత్వం కలిసియున్నది.

సమస్త శారీరక అస్తిత్వం ఒకే విధమైనదై యుంటుందని పునరుత్థానమును ఒప్పుకొననివారు చెప్పుచుండిరి. వారు చేసిన పొరపాటు ఇదే. భూమి మీది భౌతిక

శరీరం, అనగా ఆదాములో మానవీకరింపబడిన శరీరం, దాని పదార్థము మరియు స్వభావం విషయంలో ఆత్మసంబంధమైన శరీరమునకు, అనగా పునరుత్థాను డైన యేసులో మూర్తీకరణము చేయబడిన శరీరమునకు భిన్నమైనదై యున్నదని పౌలు వారికి హామీ ఇచ్చాడు. "ఆదాము" అనే పేరే, "నేల మంటికి సంబంధించిన" అని అర్థమిస్తుంది. పౌలు, **మొదటి మనుష్యుడు**, అనగా ఆదాము యొక్క నేల మంటితో చేయబడిన (ἐκ γῆς χοϊκός, *ek gēs choikos*) శరీరమును, **రెండవ మనుష్యుడు**, అనగా యేసు యొక్క పునరుత్థానమైన, పరలోకంలో చేయబడిన (ἐξ οὐρανοῦ, *ex ouranou*) శరీరముతో పోలుస్తూ, తాను తెలియజెప్పుచుండిన విషయాన్ని స్పష్టం చేశాడు. యేసు నరావతారియై ఉండిన కాలంలో ధరించియుండిన శరీరమునకును, పౌలు చెప్పుతున్న విషయానికినీ ఎటువంటి సంబంధం లేదు. Ridderbos ఈ విషయాన్ని చక్కగా వర్ణించాడు:

> *Ex ouranou* అనే మాటలు, యేసు లోకము పుట్టక మునుపే ఉన్న కారణాన్నిబట్టి, యేసు యొక్క మానవత్వ గుణగణముల పరలోక మూలము గూర్చి చెప్పడం లేదు, కాని ఆయన పునరుత్థానుడైన కారణాన్నిబట్టి ఆయన యొక్క మానవత్వ గుణగణముల ఆత్మసంబంధమైన, పరలోక సంబంధమైన స్వభావం గూర్చి చెప్పుతున్నవి.[36]

రెండవ మానవుడు, అనగా, పునరుత్థానుడైన యేసు, **పరలోకము నుండి** వచ్చినవాడు లేదా "పరలోక సంబంధమైన" వాడనేది ఇందులోని వివేకమై యున్నది (NIV). ఆయన మృతులలో నుండి పునరుత్థానుడగుటవలన ఆయన "పరలోక సంబంధమైనవాడై" యున్నాడు. వారి వారి పునరుత్థానములో, ఆయన "పరలోక సంబంధమైనవాడై" యున్న ఉనికిలో, అనగా, క్రీస్తునందు అదివరకే ఆరంభమైన పునరుత్థానములో విశ్వాసులు పాలుపంచుకొందురు. ప్రస్తుతానికి, యేసు తన మానవత్వపు ముద్రను దేవుని సన్నిధానమందు ధరించియున్నాడు (ఫిలిప్పీ. 3:20, 21 చూడుము). యేసు యొక్క భూలోకసంబంధమైన, పూర్వపునరుత్థాన సంబంధమైన శరరీము గూర్చి పౌలు ఏమియు చెప్పలేదు. యేసు, శరీరధారియైయుండిన సమయంలో పరలోక సంబంధమైన మానవుడై యుండెనని ఆయన చెప్పలేదు. కొన్ని గుప్తజ్ఞాన సిద్ధాంతములు దీనిని ధ్రువీకరించాయి. యేసు ఈ లోకంలో ఉన్నప్పుడు ఆయన భౌతిక శరీరం ఆదాము సంతతివారందరి చేత పంచుకొనబడిన మానవత్వంలో పాలుపుచ్చుకొన్నది.

**వచనము 48.** మానవుల అస్తిత్వం గూర్చి పౌలు రెండు విధములను మాత్రమే కంటికి ఎదురుగా ఉన్నట్టు భావించుకొన్నాడు. మొదటిది, నేల మట్టితో (ὁ χοϊκός, *ho choikos*) చేయబడిన శరీరంతో ఈ లోకంలో కొనసాగు జీవితం. రెండవది, **పరలోక సంబంధమైన** పదార్థంతో (ὁ ἐπουράνιος, *ho epouranios*) చేయబడిన శరీరంతో పరలోకంలో కొనసాగు జీవితం. సహజంగానే, పౌలు ఒక విషయాన్ని విడిచిపెట్టాడు. ఏమంటే, భౌతిక మరణం మరియు యుగాంత మందలి ప్రభువు రాకడకు మధ్య గల కాలములోని అస్తిత్వమును - "మధ్యంతర స్థితి" అని పిలువబడు పరిస్థితిలోని

అస్తిత్వమును - విడిచిపెట్టాడు. పౌలు మరియు క్రొత్త నిబంధనలోని ఇతరుల వాంగ్మూలములను పరిగణలోనికి తీసుకొనవచ్చు (2 కొరింథీ. 5:1-10; ఫిలిప్పీ. 1:23; 3:20, 21; 1 థెస్స. 4:13-17). కాని సమస్తాన్ని పరీక్షించి చూచినప్పుడు, ఈ మధ్యంతర స్థితికి సంబంధించినవి యింకా లెక్కలేనన్ని ప్రశ్నలున్నట్టు తేలు తున్నది. "వస్త్రము ధరించుకొననివారముగా కనబడుట" (2 కొరింథీ. 5:2, 3), ప్రభువు తిరిగి వచ్చు పర్యంతం, క్రీస్తునందు మృతులైనవారికి సంబంధించిన విషయమేనా? ఇది ఈ వాక్యభాగము యొక్క ఒక తాత్పర్యమై యున్నది. ప్రశ్నలు అసంఖ్యాకంగా ఉన్నాయి, గనుక సమాధానాలు ఏవైనా అన్నీ ఊహాకల్పితములే. John McRay "విశ్వాస సహితమైన జీవితానికి మరియు శరీరము యొక్క కడపటి పునరుత్థానము మరియు అది యేసు క్రీస్తుతో కూడ ఐక్యమగుట గూర్చి ఆశాపూర్వకంగా జీవించుటలోగల సంతోషానికి సమాధానములు అగత్యం కావని" వ్రాసినప్పుడు, అతడు సరిగా చెప్పాడు.[37]

**వచనము 49.** మనము ధరించియున్న మంటి **నుండి పుట్టినవాని పోలిక** వర్తమాన యుగమందలి రక్తమాంసములుగల శరీరంలో ఉన్నది. **పరలోక సంబంధి పోలిక** ప్రభువు యొక్క పునరుత్థానమైన శరీర క్రమము చొప్పున రూపుదిద్దబడిన శరీరమై యుంటుంది (ఫిలిప్పీ. 3:20, 21). వర్తమాన యుగంలో దైవభక్తితో జీవించుట గూర్చిన హెచ్చరిక పౌలు వ్రాయుచున్న పత్రిక యొక్క నేపథ్యంలో లేకుండా ఎన్నడును లేదు. భవిష్యత్ నిశ్చయార్థక మునకు ("మనము ధరించుదుము") బదులుగా φορέσωμεν (*phoresōmen*), గణనీయమైన సంఖ్యలోగల ప్రాచీన మూల గ్రంథ పాఠాలు "మనము ధరించుదము" అనే మందలింపులో, ఉపదేశకరమైన సంభావనార్థకమును ఉయోగిస్తున్నాయి. తొలి పఠనము సందర్భానికి సరిగా సరిపోతున్నది. కాని మూల గ్రంథ పాఠమునకు సంబంధించిన నిదర్శనము రెండవ దానిని కోరుతున్నది. మనము రెండవ పఠనమును అంగీకరించినట్లయితే, వారు నిత్యత్వం కొరకైన సిద్ధపాటుగా, పరలోక సంబంధమైన క్రీస్తు తన ప్రజలకిచ్చిన పిలుపునకు తగిన జీవిత విధానమును తన పాఠకులు అవలంబించాలని పౌలు పిలుపునిచ్చుచుండెను.

## పునరుత్థాన మర్మము (15:50-57)

**50సహోదరులారా, నేను చెప్పునది ఏమనగా, రక్తమాంసములు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొన నేరవు; క్షయత అక్షయతను స్వతంత్రించుకొనదు. 51-52ఇదిగో మీకు ఒక మర్మము తెలుపుచున్నాను; మనమందరము నిద్రించము, గాని నిమిషములో, ఒక రెప్ప పాటున, కడబూర మ్రోగగానే మనమందరము మార్పు పొందుదుము. బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు, మనము మార్పు పొందుదుము. 53క్షయమైన ఈ శరీరము అక్షయతను ధరించుకొనవలసి యున్నది; మర్త్యమైన ఈ శరీరము అమర్త్యతను ధరించుకొనవలసి యున్నది. 54ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొనినప్పుడు, ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించుకొనినప్పుడు,-**

**విజయమందు మరణము మ్రింగి వేయబడెను అని వ్రాయబడిన వాక్యము**

**నెరవేరును. [55]ఓ మరణమా, నీ విజయమెక్కడ? ఓ మరణమా, నీ ముల్లెక్కడ? [56]మరణపు ముల్లు పాపము; పాపమునకున్న బలము ధర్మశాస్త్రమే. [57]అయినను మన ప్రభువైన యేసు క్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక.**

మృతులైనవారి "మధ్యంత స్థితి" గూర్చి పౌలు అతి తక్కువగా చెప్పడం వెనుక అతని మనస్సులో రెండు ముఖ్య కారణములు ఉండియుండవచ్చు. మొదటిది, అపొస్తలుడు ప్రభువనుగ్రహించిన ప్రత్యక్షతపై ఆధారపడి యుండెను. ఈ విషయంలో, అతనికి తక్కువగా ప్రత్యక్షపరచబడినదని స్పష్టమవుతున్నది. రెండవది, ప్రభువు యొక్క రెండవ రాకడ త్వరలో జరిగిపోవాలని పౌలు అపేక్షించుచుండెను. తమ సమకాలీనులైన క్రైస్తవుల భౌతిక మరణమునకును యుగాంతమునకును మధ్యలో, ఎంతో ఎక్కువ కాలం గడిచిపోకూడదని అతడు ఎదురుచూచుచుండెను.

పౌలు, కొరింథీయులకు తన మొదటి పత్రికను వ్రాయక మునుపటి సుమారు నాలుగు సంవత్సరముల క్రితమే, థెస్సలొనీకయులకు తన మొదటి పత్రికను వ్రాసియుండుట సంభావ్యమే. పౌలు థెస్సలొనీకయులకు తన పత్రికను వ్రాసినప్పుడు, ప్రభువు తిరిగి వచ్చినప్పుడు సజీవులైయుండువారిలో అతడు కూడ ఉండునని ఆశించియుండవచ్చు. అతడు, ". . . ప్రభువు రాకడ వరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించినవారి కంటె ముందుగా ఆయన సన్నిధి చేరము" అని వ్రాశాడు (1 థెస్స. 4:15). కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికలో, ప్రభువు నుండి మరి ఎక్కువ ప్రత్యక్షతను పొందిన తరువాత, క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు అతడు సజీవుడై యుండకపోవు సాధ్యతను అతడు గుర్తించి యుండవచ్చు. "మనమందరము నిద్రించము గాని . . . మార్పు పొందుదుము" అని వ్రాశాడు (15:51, 52).

క్రొత్త నిబంధన కాలములలోని క్రైస్తవులు క్రీస్తు రెండవ రాకడ కొరకు ప్రత్యాశతో ప్రతీక్షించారు. "ప్రభువు రాక సమీపించుచున్నది గనుక మీరును ఓపిక కలిగియుండుడి; మీ హృదయములను స్థిరపరచుకొనుడని" యాకోబు రచించాడు (యాకోబు 5:8). "అయితే అన్నిటి అంతము సమీపమై యున్నదని" పేతురు తన మొదటి పత్రికలో రచించాడు (1 పేతురు 4:7). అది కేవలము ప్రభువు తిరిగి వచ్చుననే మామూలు విషయం కాదు. విశ్వాసుల విషయంలో, ప్రతి రోజు, ప్రభువు వచ్చునను ఎదురుచూపుతో జీవించాల్సినదై యుంటు న్నది. ఆయన వచ్చుట మాత్రమే కాదు, గాని, సుపరి చితమైన సంగీతంలోని మాటల వలె, "యేసు త్వరగా వచ్చు చున్నాడు."[38] యేసు త్వరగా వచ్చుచున్నాడు, మన మందరమును మార్పు పొందుదుమనేది సంఘ సిద్ధాంతమై యున్నది.

**వచనము 50.** తన త్కరములను క్రోడీకరించడానికి పౌలు సంసిద్ధుడై యుండెను. పునరుత్థానమైన శరీరముంటుందనే విషయాన్ని స్పష్టంచేస్తూ, పునరుత్థానమైన శరీరమును, మానవ ఉనికిని ఇప్పుడు పరిమితం చేసే రక్తమాంసములుగల శరీరముతో సమానంగా ఎంచకూడదని కూడ అతడు చెప్పాడు. ఈ శరీరము క్షయమవుతుంది; పునరుత్థానమైన శరీరము అక్షయమైనదై యుంటుంది. **క్షయమయ్యే** శరీరము

నిత్యత్వమైన లేక **అక్షయమైన,** అనగా **దేవుని రాజ్యమును** స్వతంత్రించుకొననేరదు. భౌతిక శరీరము, సర్వసాధారణంగా గ్రీకు పండితుల పట్ల కలిగి యుండిన వ్యతిరేకార్థకమైన అంతర్భావములను పౌలు పట్ల కలిగియుండలేదు.

"శరీరము" అనే పదము, **మాంసముతో** పోల్చబడినప్పుడు, మనుష్యుడు రెండు విధములుగా ఉనికి కలిగియుంటున్నట్లు సూచిస్తుంది. ఈ లోకం గూర్చి మాత్రమే చర్చింపబడుచుండిన సందర్భాలలో, అపొస్తలుడు కొన్ని పర్యాయాలు ఈ రెండు పదములను భేదం చూపించలేని లేక వేరుచేయబడనేరని విధంగా ఉపయోగించాడు (ఉదా. రోమా. 2:28లో, "మాంసము" "శరీరము"నకు సమానమై యున్నది). ఇతర వాక్యభాగాల్లో, అవి మానవున్ని రెండు దృష్టికోణాల్లో ప్రత్యేకించి చూపుతున్నాయి. పౌలు, మానవున్ని వాని బలహీనత మరియు అస్థిరతతో నివేదించుటకు గాను "మాంసము" అనే పదమును ప్రయోగించాడు. అపొస్తలుడు ఒక శరీరములేని పునరుత్థానము గూర్చి ఆలోచించలేకపోగా, అతడు మాంసము పునరుత్థానమగుట గూర్చి ఎన్నడును ప్రస్తావించలేదు.

దీని గూర్చి James D. G. Dunn ఈ క్రింది విధంగా చెప్పుతున్నాడు:

> మన మాంసలత్వము, మనము కేవలము మానవులమై యున్నామని నిరూపించు మన దౌర్బల్యము మరియు బలహీనతను, మనము మరణమును తప్పించుకొనలేని పరిస్థితిని, ఆకలి మరియు కోరికలు తీరుట గూర్చిన సంతృప్తిపై మనము ఆధారపడుటను, ఈ తృష్ణలు మరియు కోరికలు తమ నైపుణ్యంతో మనలను పడగొట్టుటకు మనము లోనుకాగలమను వాస్తవమును ధ్రువీకరిస్తున్నది.[39]

మానవుని ఉనికిని పరిగణలోనికి తీసుకొన్నప్పుడు ప్రయోగించడానికి, "మాంసము" అనే పదము కంటె "శరీరము" అనే పదం ఎక్కువ నిశ్చయార్థకమైన పదమై యున్నది. శరీరమును కలిగియుండుట, సజీవముగా నున్న ఆత్మయై యుండుట అంటే ఏమిటో అనే దాని స్వత స్సిద్ధమైన కోణమైయున్నదనే అవగాహన విషయంలో, పౌలు మరియు పాత నిబంధన ప్రత్యక్షత ఒక్కరీతిగా ఉండినవి.

1 కొరింథీ. 15వ అధ్యాయంలోని ముగింపు వచనములకు సంబంధించిన పౌలు యొక్క సారాంశము, ప్రభువు తిరిగి వచ్చుట, జీవించియుండు వారికిచ్చు అర్థానికిని, మరణించిన వారికిచ్చు అర్థానికిని మధ్య గల ఒక తారతమ్యమై యున్నదని Joachim Jeremias అవలోకనము చేసుకొన్నాడు.[40] Jeremias ప్రకారం, "రక్తమాంసములు" అనే పదం సజీవులుగా నున్న వారిని సూచించాలనియు, "క్షయమగు" (φθορά, *phthora*) అనే పదం మరణించిన వారి గూర్చిన సమానార్థమిచ్చునదై యుండాలనియు అపొస్తలుడు ఉద్దేశించాడు. 15:53లో, మరొక పర్యాయం, "క్షయమగు" అనే పదం, ప్రభువు తిరిగి రాక మునుపు మరణించు వారిని సూచిస్తున్నది. "మర్త్యమగు" అనే పదం, సజీవులుగా నిలిచియుండువారిని సూచిస్తున్నది. ప్రభువు తిరిగి వచ్చుట, సజీవులైనవారు మరియు మృతిచెందినవారు పునరుత్థానములో పాలుపుచ్చుకొనునట్లు ఎలా అనుమతిస్తుందో పౌలు వివరించాడు. Jeremia ప్రతిపాదన పౌలు తర్కవాదమునకు ఒక సుముఖమైన వివరణయై యున్నది. కాని ప్రభువు రాక

మునుపు మరణించిన వారి గూర్చిన ఆందోళనల వలన కొరింథీయులు కలవరపడిపోయారనే విషయాన్ని ఈ అధ్యాయంలోని ఏదియు సూచించడము లేదు. థెస్సలొనీకయ క్రైస్తవులు ఎదుర్కొనిన ప్రశ్నలను మనము కొరింథు లోనికి దిగుమతి చేసుకొనడం, సంభావ్యము కాదు (1 థెస్స. 4:13 చూడుము).[41]

**వచనములు 51, 52.** పునరుత్థానమైన శరీరము యొక్క స్వభావం, మరియు దేవుని ప్రజలు మర్త్యమగు దానిని అమర్త్యమగు దాని కొరకు మార్పిడి చేసుకొను ప్రక్రియ మర్త్యుడైన మానవుని అవగాహనకు ఆవల ఉన్నది. అదొక **మర్మమై** యున్నది. ఈ మర్మమునకు సంబంధించిన ముసుగును కొంత మేరకు తొలగించిన ప్రత్యక్షతను అపొస్తలుడు ప్రభువు నుండి పొందాడు. ప్రభువు తిరిగి వచ్చినప్పుడు కొందరు విశ్వాసులు సజీవులై యుందురు. అందరు మరణించి యుండరు. కాని ప్రభువు తిరిగి వచ్చినప్పుడు సజీవుల గుంపులో ఉన్నా, లేక మృతులైనవారిలో ఉన్నా, అందరు మార్పు నొందుదురు. రక్తమాంసములు గల క్షయమగు శరీరము పునరుత్థానమైన శరీరముగా మార్పునొందును. భౌతిక పదార్థం స్వతఃస్సిద్ధంగానే క్షయమైనదను సిద్ధాంతం ఆధారంగా శరీర పునరుత్థానమును కొట్టివేసిన గ్రీకు విద్వాంసుల తర్కము తప్పైయుండింది, ఆది నుండి, భౌతిక ప్రపంచం మంచిదని దేవుడు నిర్ణయాత్మకంగా ప్రకటించాడు. **మనమందరమును మార్పు పొందుదుము** అనే పదబంధము క్రైస్తవుల విషయంపై రాబోవు యుగమందలి నిరాకారత్వమును సూచించదు.

అంతము వచ్చినప్పుడు, ఇక సమయముండదు. ముందస్తు సూచనలు మరియు భావికథనములతో కూడిన దీర్ఘకాలికమైన ప్రణాళిక ముగింపులో ప్రభువు మొదటిసారి ప్రత్యక్షమయ్యాడు. రెండవ రాకడ (హెబ్రీ. 9:28), భిన్నమైనదిగా ఉంటుంది. ఆయన, రాత్రివేళ వచ్చు దొంగ వలె, ఆకస్మికంగా వచ్చును (మత్తయి 24:43; లూకా 12:39; 1 థెస్స. 5:2; 2 పేతురు 3:10). నమ్మకము, మారుమనస్సు, మరియు నిరీక్షణ కొరకైన సమయం ముగింపైపోతుంది. **ఒక రెప్ప పాటున** (ἐν ἀτόμῳ, *en atomō*), కనురెప్పపాటు కాలంలో, మార్పునొందించు సంఘటనలు దేవుని శక్తి చొప్పున చోటుచేసుకొంటాయి. ఆంగ్ల భాష మాట్లాడేవారు ఇచ్చట ప్రయోగింపబడిన గ్రీకు పదాన్ని అరువు తెచ్చుకొని, దానిని పదార్థమునకు అన్వయించి, భౌతిక అస్తిత్వమునకు సంబంధించిన నిర్మాణ దుక్కలకు "అణువులు" అనే సరదా పేరును పెట్టారు.

సంఘటనలు యాదృచ్ఛికంగా చోటుచేసుకొనుట గూర్చి అపొస్తలుడు తన పాఠకుల మనుస్సుల్లో ముద్రవేయుటతో ముగించలేదు. అతడు అంతమును సూచించు బూర శబ్దమును గూర్చిన రూపకాలంకారమును ఉపయోగించాడు (మత్తయి 24:31; 1 థెస్స. 4:16 చూడుము). బూర మ్రోగగానే, **మృతులు అక్షయులుగా లేపబడుదురనియు**, జీవించియుండువారు మార్పునొందు దురనియు, మనమందరము **మార్పుపొందుదుమనియు** అతడు చెప్పాడు. పునరుత్థానమైన శరీరం రక్తమాంసములకు సంబంధించిన అసంపూర్ణతలన్నిటిని విడిచిపెట్టును. అది పరలోక సంబంధమైన, అక్షయమైన శరీరంగా పరిణమిస్తుంది.

అబద్ధ బోధలు - ఉదా. ప్రభురాక సమయంలో ఎత్తబడుట, లేక ఈ లోకంలోని క్రీస్తు యొక్క వెయ్యేళ్ల పరిపాలన గూర్చిన అబద్ధ బోధలు - నమ్మతగినవి కావని చెప్పడానికి

పౌలు సంకోచించలేదు. బంగారు వీధులు మరియు నలుచదరమైన పట్టణము గూర్చిన వర్ణనను అతడు యోహానుకు కలిగిన ప్రత్యక్షీకరణ దర్శనముల గూర్చిన కవిత్వానికి వదిలేశాడు (ప్రకటన 21:16-21). విశ్వాస సంబంధమైన ఈ యుగంలో, దేవుని ప్రజలు, "మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటనిటి కంటెను ఊహించువాటన్నిటి కంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవుని యందు" సామాన్యంగా విశ్వాసముంచవలసినవారై యున్నారు (ఎఫెసీ. 3:20, 21). దేవుడు వాగ్దానం చేసిన క్రీస్తునందలి నిత్యజీవంలో శారీరక అస్తిత్వం ఇమిడియున్నదనే విషయాన్ని విశ్వాసుల కోసం వ్యవస్థాపించాలనేది అపొస్తలుని ఆందోళనయై యుండింది. ఈ సందర్భంలో, క్రీస్తునకు వెలుపట ఉన్నవారి గూర్చి పౌలు ఏమియు చెప్పలేదు. ఆయన ఆందోళన అంతా రక్షింపబడినవారిని గూర్చినదై యుండింది.

**వచనము 53.** అపొస్తలుడు, 15:50లో ప్రతికూలార్థంతో వ్యక్తం చేసినదాని గూర్చి అటుతరువాత సానుకూలార్థంతో తెలియజెప్పాడు. శరీరము యొక్క రూపము మారిపోగా, క్రైస్తవులు ప్రభువు రాకడ కొరకు ఎదురు చూచుచుండు తరుణంలో వారేమై యున్నారో, మరియు బూర మ్రోగినప్పుడు వారేమై యుందురో, ఈ రెండు స్థితుల మధ్య కొనసాగింపు ఉంటుందని పౌలు నొక్కివక్కాణించాడు. **క్షయమైన ఈ శరీరము అక్షయతను ధరించుకొనవలసి యున్నది.** పౌలు వివరముల ప్రకారం, ఈ యుగంలోను మరియు రాబోవు యుగంలోను ఉనికి కలిగియుండుటలో, శరీరము మరియు ఆత్మ యొక్క ఐక్యత ఇమిడియున్నవి.

**వచనము 54.** అన్యజనులకు అపొస్తలుడై యుండినవాడు అటూఇటూ ఎగిరిపోవుచుండు ఆత్మలతో కూడిన లేక ఒక "ఆత్మల లోకం" లోనికి విలీనమైపోయిన శరీరములేని అస్తిత్వము గూర్చి ఏమియు చిత్రీకరించలేదు. మర్త్యమైన యీ శరీరము **అమర్త్యతను ధరించుకొనవలసి** యున్నది అనే ప్రకటనలో శారీరక ఉనికిని గూర్చిన ప్రశ్న తలెత్తడం లేదు. క్రీస్తును ధరించుట యొక్క రూప కాలంకారమును ప్రయోగిస్తూ, ఒకడు క్రైస్తవుడగుట గూర్చి అపొస్తలుడు మరొక చోట రచించాడు. అదొక వస్త్రమును ధరించి నట్లుంటుంది. చర్చనీయాంశము పునరుత్థానమై నప్పుడు, "ధరించి యుండుట," నిత్య అస్తిత్వము యొక్క సిద్ధపాటు కొరకైన మార్పును సంకేతిస్తుంది. సజీవులైయున్నవారు ప్రభువు తిరిగి వచ్చినప్పుడు మరొక శరీరము నిమిత్తము, అది పనికిరానిదని ఒక శరీరమును ఎలా విసర్జించుదురో, మరియు మృతులైనవారు ఎలా పునరుత్థానమైన ఒక శరీరమును ధరించుకొందురో అనే విషయం పౌలు యొక్క తక్షణ ఆసక్తికి ఆవల ఎలా ఉండిందో!

బూర మ్రోగగానే "మర్త్యమైనది" "అమర్త్యమైనదిగా" మార్పు నొందినప్పుడు, ఇదంతా అనాది నుండి వచ్చుచున్న దేవుని బయల్పాటు యొక్క నెరవేర్పు ప్రకారమైనదై యుంటుంది. అపొస్తలుడు, యెషయా 25:8ని ఉల్లేఖించుట సంక్షిప్తమైనదై యున్నది కాని విషయానికి తగ్గ ఉల్లేఖనమై యున్నది **విజయమందు మరణము మ్రింగివేయబడెను.** యెషయా పలుకుతున్న మాటలు ప్రభువు యొక్క ఆగమనమునకు (*parousia*), కడబూర మ్రోగు క్షణమునకు, ఒక మినహాయింపైన ఉల్లేఖనమై యున్నట్టుగా తన పాఠకులు అర్థం చేసుకోవాలని పౌలు ఆశించుట

సంభావ్యం కాదు. ప్రవక్త పలికిన సందర్భంలో ఈ మాటలకు వాటి సొంత అర్థం ఉండింది, కాని అతడు వర్ణించుచుండిన సంఘటనలకు అవి సందర్భోచితమైన మాటలై ఉన్నాయని పౌలు కనుగొన్నాడు. (15:27ను గూర్చిన వ్యాఖ్యానములను చూడుము.)

**వచనము 55.** బైబిలు మూల గ్రంథ పాఠాన్ని విశదపరుస్తున్న వ్యాఖ్యానకర్తలు తరుచుగా వారి మనోరథము భంగమైన అనుభూతిని అనుభవిస్తున్నారు లేదా పౌలు మరియు ఇతర క్రొత్త నిబంధన గ్రంథకర్తలు ఈ పాత నిబంధన వాక్యమును ఎంతో సులభంగా ఉల్లేఖించి, దేవుని చిత్తము క్రీస్తు ద్వారా నెరవేరిన విషయానికి దానిని అన్వయించిన విధానము చేత తబ్బిబ్బవుతున్నారు. హోషేయ ప్రవక్త మాటలను అపొస్తలుడు ఉల్లేఖించడం కూడ మినహాయింపైనది కాదు. 1 కొరింథీ. 15:55లోని ఉల్లేఖనము, మాటకు మాట చొప్పున లేక ఆ మాటలు ఉన్నది ఉన్నట్టుగా వ్రాయబడలేదు. హోషేయ 13:14లోని సందర్భశుద్ధిగల మాటలను, NASB “ఓ మరణమా, నీ విజయ మెక్కడ? ఓ మరణమా, నీ ముల్లెక్కడ?” అని భాషాంతరీకరించుచున్నది. హోషేయ గ్రంథంలో, దేవుడు ఎఫ్రాయీముతో కలిగియుండిన సంబంధం చర్చనీయాంశమై యుండింది. కాని ప్రభువైన క్రీస్తు యేసు ద్వారా మరణమును జయించువారి విజయ కేకను వ్యక్తం చేయడానికి ప్రవక్త మాటలను ప్రయోగించడానికి పౌలు చాలినంత ధైర్యశాలియై యుండెను.

అపొస్తలుడు మరణమును మరియు సమాధిని ఎగతాళి చేస్తూ వెక్కిరించునట్లు వాటిని మూర్తీకరించాడు. అతడు మరణముతో, “ఓ మరణమా, దేవుని కుమారుడు మానవాళి నిమిత్తమై దేవుని కృపను తెచ్చాడు కాబట్టి ఇప్పుడు నీవు ఎక్కడున్నావు?” అని అన్నాడు. యుగయుగాలుగా, మరణము, జీవమునకు అనివార్యమైన ముగింపై యుంటున్నది. “ఓ మరణమా, నీకు విజయం లేదు మరియు వాడియైన కొండి లేదు. క్రీస్తునందు, జీవం మాదే” అని పలకడానికి పౌలు, హోషేయ మాటలను అనుకూలించుకొన్నాడు.

మొత్తం మీద, కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికలో పౌలు సమస్యలతో వ్యవహరించుచుండెను. అభిప్రాయ భేదాల వలన ఏర్పడిన అంతరంగిక కలహము, నైతిక అస్థిరత, మరియు సిద్ధాంతపరమైన తికమక చేత వేధింపబడుచుండిన సంఘము పరిష్కార మార్గమును కనుగొనునట్లు దానికి సహాయం చేయాలని అతడు ప్రయత్నించుచుండెను. అత్యధికంగా, తన రచనలని సంకేతించు విలక్షణములు కలిగియుండిన సిద్ధాంతపరమైన గొప్ప సూత్రీకరణములలోనికి కాలుమోపునట్లు సాహసించడానికి దూరంగా ఉన్నాడు. కాని అవి తన రచనల్లో పైపై ఉపరితలమునకు దూరంగా లేవు. ఆచరణాత్మకమైన, నైతిక, క్రమానుసారమైన, మరియు బైబిలు సంబంధమైన దైవజ్ఞాన శాస్త్రమునకు మధ్య గల సున్నితమైన ప్రత్యేకతలను అటుతరువాతి క్రైస్తవులు వారాశించు ఫలితాలను సాధించుటకుగాను సరిదిద్దుకొనునట్లు అపొస్తలుడు వాటిని వారికి విడిచిపెట్టాడు. నైతికత మరియు సిద్ధాంతము, కేంద్రభ్రంశమై విభిన్న దిశల్లోనికి వ్యాపించి ఆ మీదట స్వాధికారంతో అపేక్షించు సందర్భం వచ్చినప్పుడు కలుసుకొను రెండు దారులు కావు. అవి వేరుచేయ బడరానివై యున్నవి.

**వచనము 56.** రోమా. 4-7 అధ్యాయాల్లో, యేసు క్రీస్తునందలి కృపాసహితమైన దేవుని వరము నిమిత్తము, ధర్మశాస్త్రము మరియు "విశ్వాసమునకు విధేయులగుట" గూర్చిన అంతర్భావాలను పౌలు అభివృద్ధి చేశాడు (రోమా. 1:2-7; 16:25-27 చూడుము). బహుశా నాలుగు లేదా ఐదు సంవత్సరముల తరువాత, అతడు కొరింథులో చలికాలం గడుపుచుండినప్పుడు, అతడు రోమాలోని సంఘానికి వ్రాయడం ఎంతో సముచితమైనదై యున్నది (అపో. 20:2, 3 చూడుము). **మరణపు ముల్లు పాపము; పాపమునకున్న బలము ధర్మశాస్త్రము** అని పలుకుతూ, హోషేయ 13:14లోని అను లేఖనమును పౌలు అనుసరించడం ఎంతో విలక్షణమైనదై యుండింది. పౌలు కొరింథీయులతో గడిపిన కాలమంతటిలో అతడు పాపము మరియు ధర్మశాస్త్రము గూర్చి పదేపదే ప్రసంగించుచుండగా కొరింథులోని క్రైస్తవులు వినడమనేది ఎక్కువ సంభావ్యమై యున్నది (అపో. 18:11). యేసు సిలువ మీద చేసిన తన బలియాగము ద్వారా పాపము యొక్క కోరలను లాగివేసి దాని వాడియైన కొండిని విరిచివేశాడు, గనుక ఇప్పుడు దానికి కోరలు లేవు, కొండి కూడా లేదు. దేవుని కృపావరముతో ఆయన ధర్మశాస్త్రమును రద్దుచేశాడు.

**వచనము 57.** పూర్తిగా దేవుని చొరవ చొప్పుననే, పాపము మరియు మరణము మరియు ధర్మశాస్త్రమును ఇప్పుడు, ప్రభువు రాకడకు మునుపు తెలియని విధానములలో అవలోకనము చేయవచ్చు. దేవుడు క్రైస్తవులకు **విజయమును** అనుగ్రహించాడు. ఈ విజయం **మన ప్రభువైన యేసు క్రీస్తు** ద్వారా, విశ్వాసము ద్వారా కలుగుతుంది (1 యోహాను 5:4 చూడుము). అగస్టీను, తన వృద్ధాప్యంలో, విశ్వాసుల చేత ఎదుర్కొనబడుచుండిన శోధనల గూర్చి రచించాడు. ముగింపులో, అతడు కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రికలో నుండి ఈ వాక్యభాగాన్ని ఉల్లేఖిస్తూ, మనము చేసే పాపములలో కొన్ని పర్యాయాలు, "మన సొంత బలంచేత విజయమును సాధించగలమను నిరీక్షణ ఉంటుంది, లేదా మన సొంత బలమునకు బలముగా భద్రపరచబడినప్పుడు, దానిని దేవుని కృపకు ఆపాదింపక, మన సొంత బలంతో సాధించామని మన సొంత బలానికే ఆరోపించవచ్చునని" చెప్పాడు.[42] విశ్వాసియైనవాడు విధేయత సహితమైన విశ్వాసముతో లోబడవలసి యున్నదను తన మానవ బాధ్యతను మర్చిపోనంత వరకు దైవజ్ఞాన పండితుడు చెప్పే విషయం క్రమబద్ధమైనదై యుంటుంది.

క్రైస్తవుని నిరీక్షణ పదిలపరచబడి యున్నది ఎందుకనగా క్రీస్తు మృతులలోనుండి సశరీరుడుగా పునరుత్థానుడయ్యాడు గనుక, తత్ఫలితంగా, సాధారణ పునరుత్థానముంటుంది. యేసు లేని ఖాళీ సమాధి లేకుండా, సిలువపై సాధింపబడిన విజయం విలువలేనిదై యుంటుంది. విశ్వాసులందరు నిరంతరము శరీర పునరుత్థానము యొక్క ప్రథమ ఫలములైన ఆయనతో కూడ జీవించెదరనే కొరింథీయుల విశ్వాసమునకు సంబంధించిన ప్రాథమిక ఒప్పింపును క్రైస్తవులు అలక్ష్యము చేయుట ఆలోచించుటకు వీలులేని విషయమై యుండింది. ఈ లోకం, దాని సమస్త అనిశ్చయత, దుర్వ్యసనములు, మరియు బాధతో సహితం, నిత్య జీవమునకు సంబంధించిన నిరీక్షణనుబట్టి సహించదగినదై యున్నది.

## ఒక ముగింపు (15:58)

**[58]కాగా నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని యెరిగి, స్థిరులును, కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి.**

**వచనము 58.** శరీర పునరుత్థానము సూచించునవి, జీవమునకు అన్వయించు అంతర్భావముల వైపు తిరుగుచు, దాని గూర్చిన ఉపదేశమును పౌలు ముగించాడు. పునరుత్థానమును గూర్చిన హామీ ఉన్నది గనుక, తన పాఠకులు క్రీస్తునందలి వారి విశ్వసనీయతను వినూత్నపర్చుకొనవలెనని వారిని విన్నవించు కొన్నాడు. క్రొత్త నిబంధన కల్పాంత శాస్త్రము, అనగా, ప్రభువు తిరిగి వచ్చుట గూర్చిన యోచన, సంబంధిత నైతిక విషయములలోను మరియు ఒప్పుకోలు గూర్చిన అన్వయముల విషయములోను, విశ్వసనీయమైన క్రైస్తవ జీవితమును ప్రోత్సహించుటకు ప్రయోజన పడుతున్నది. విధేయులైన విశ్వాసులు, విశ్వాసము ద్వారా కృప చేత రక్షింపబడగా, మనము ఈ లోకంలో యాత్రికులమై యున్నామను పరిస్థితి దృష్ట్యా, మనము **ప్రభువు కార్యాభివృద్ధి యందు ఎప్పటికిని ఆసక్తులమునై యుండవలెను**. మన **ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని** మనకు తెలియును గనుక, మనము ఎప్పటికిని ఆసక్తులమునై యుండవలెను. మనలో ప్రతి ఒక్కరము ఆత్మసంబంధమైన ఒక శరీరమును స్వాధికారంతో అపేక్షించి, ఆ మీదట ప్రభువుతో కూడ నిరంతరము ఏలుచుండుటకు లేతుమని తెలిసికొనినవారమై మనము ప్రయాసపడుచుండవలెను.

విశ్వాసులైనవారు ఉన్నతమైన స్థాయిలోగల నైతిక జీవితమును జీవించవలెననియు, క్రీస్తు నందు ఫలప్రదంగా పని చేయవలెననియు పౌలు వారిని విన్నవించుకొన్నాడు. విశ్వాసము ద్వారా కృప చేత కలుగు రక్షణ సత్కార్యములకు లేక పర్యాప్తమైన ప్రయాసములకు ఒక ఆటంక హేతువు కాదు. దేవుడు కృపాసహితమైనవాడై యున్నాడు, గనుక ఇతరులు కూడ కృపాసహితమైన ఆయన బాహువుల క్రిందకు తేబడునట్లు దేవుని రాజ్యములో విశ్వసనీయతతో ప్రయాసపడుట ఇదివరకటి కంటె మరి ఎక్కువ అగత్యమై యున్నది.

## అన్వయము

### ఏ రకమైన శరీరం?

శతాబ్దాల తరబడి, క్రైస్తవులు శరీర పునరుత్థానములో కలిగియున్న విశ్వాసమునుబట్టి సందేహవాదులు వారిని అపహసించారు. అపహాసకులు ఈ దిగువ ఇయ్యబడినటు వంటి దృశ్య వివరణములను ఏర్పాటు చేశారు:

> ఒకడు ఒక యాపిల్ పండు తింటాడు. వాని శరీరం ఆ పండును జీర్ణించుకొంటుంది. గనుక ఆ పండు యొక్క అణువులు, పరమాణువులు వాని శరీర వ్యవస్థల

యందంతటను వ్యాపించి పోతాయి. త్వరలోనే వాడు మరణిస్తాడు, పాతిపెట్ట బడుతాడు. కాలగమనంలో, వాడెక్కడ పాతిపెట్టబడ్డాడో మర్చిపోబడుతుంది. ఇంతలో, క్షయమైపోయిన మృతదేహమున్న చోటనే మరొకడు ఒక యాపిల్ చెట్టును నాటుతాడు. వేళ్లు భూమి లోపలికి పాతుక పోతాయి. సేంద్రియ పదార్థంచేత ఆ చెట్టు సారవంతమవుతుంది. మరణించినవాని శరీరంలో నుండి అణువులు మరియు పరమాణువులు చేకొనబడి క్రొత్త యాపిల్ పండ్లుగా రూపుదిద్దు కొంటాయి. ఈ యాపిల్ పండ్లను ఇతరులు తింటారు. కాబట్టి, కాలము దొర్లిపోయిన మీదట, ఒకే విధమైన మౌలికాంశములు, రెండు వెవ్వేరైన శరీరములలో భాగమై పోయాయి.

ఈ కథకు సంబంధించిన వైవిధ్యాలకు అంతమనేది లేదు. కాని అంతిమ ప్రశ్న ఒకటే పునరుత్థానములో, ఒక శరీరము కంటె ఎక్కువైన వాటిలో భాగమై యుండిన అణువులను మరియు పరమాణువులను ఎవరి శరీరం స్వాధికారంతో అపేక్షిస్తుంది?

గ్రీకులు, పౌలును ప్రశ్నించిన ఇదే విధమైన ఆక్షేపణలను ఆధునిక సంశయాళువులు యింకా లేవదీస్తూనే వున్నారు. “మృతులేలాగు లేతురు? వారెట్టి శరీరముతో వత్తురు?” (15:35). పౌలు ఇచ్చిన సమాధానం, ప్రాచీన మరియు ఆధునిక ప్రపంచానికి చాలినదై యుండింది. ఇటువంటి ప్రశ్నలు పొంతనలేని, సందర్భశుద్ధికానివై యుండినవని పౌలు చెప్పాడు. పునరుత్థాన మందు విషయాలు ఎలా వుంటాయో వివరించాల్సిందని సద్దూ కయ్యులు యేసును సవాలు చేసినప్పుడు, ప్రభువిచ్చిన సమాధానం కూడ ఇదే విధంగా ఉండింది “లేఖనములనుగాని దేవుని శక్తినిగాని ఎరుగక మీరు పొరబడుతున్నారు” (మత్తయి 22:29).

దేవుడు వెవ్వేరు విధములైన శరీరములను సృజించాడనే విషయాన్ని పౌలు స్పష్టం చేశాడు దేవుడు వాటిని వెవ్వేరైన మహిమలతో సృజించాడు (1 కొరింథీ. 15:35-41). పునరుత్థానమైన శరీరము యొక్క స్వభావము గూర్చి అపొస్తలుడు కొన్ని వివరాలు మాత్రమే ఇచ్చాడు, కాని వాటిని స్పష్టంగా తెలియజెప్పాడు “రక్తమాంసములు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొననేరవు” (15:50). విశ్వాసుల శరీరముల ఐక్యత దోషరహితము మరియు సంపూర్ణమైనదై యుండునంతగా అవి రాబోవు యుగంలో జీవమునకు సంబంధించిన నిత్య శక్తులతో విలీనమవుతాయని చెప్పడం సురక్షితమైన విషయమవుతుంది. దేవుడు ఐహిక జీవము యొక్క నిర్మాణమునకు సంబంధించిన అణువులు మరియు పరమాణువులకు పరిమితమైనవాడు కాదు. *దేవుని ప్రజల స్వాస్త్యము, దేవుడు పరలోక సంబంధమైన అస్తిత్వము నిమిత్తము రూపొందించు ఒక రకమైన శరీర జీవమై యుంటుంది.* పరలోక సంబంధమైన జీవము ఈ లోకములోని జీవముతో సచేతనత్వము మరియు బహుశా ఆకారములో సహితం కొనసాగింపును కలిగియుంటుండగా, పరలోక సంబంధమైన శరీరం వర్తమాన యుగమందలి అదే రక్తమాంసములతో చేయబడదనేది సునిశ్చయమై యున్నది.

## మరణానంతర జీవము

పురావస్తు తత్త్వ శాస్త్రజ్ఞులు, ప్రాచీన ప్రజలు వారి మృతులను పాతిపెట్టు

వాడుకలను పరీక్షించడము ద్వారా వారి గూర్చి బహు గొప్ప విషయాలు తెలుసు కొంటారు. కొంత కాలం క్రితం *Archaeology* (September/October 1997) అనే మాసపత్రిక ఒక వ్యాసనమును క్రీ.పూ. 3వ శతాబ్దము వరకు నల్ల సముద్రమునకు (Black Sea) ఉత్తరమున నివసించిన Scythians అనే ప్రాచీన ప్రజలకు అంకితం చేసింది.[43] ఒక ప్రముఖ సేనాపతి యొక్క సమాధి త్రవ్వితీయబడింది. అతడు ఒక గది(అర)లో ఉంచబడ్డాడు. అతనితో కూడ ఆభరణాలు, యుద్ధోపకరణాలు, ఆహారము, మరియు రాబోవు జీవితానికి అవసరమవుతాయేమో అని ఎంచబడిన ఇతర వస్తువులు ఉంచబడినవి. ఈ గొప్పవాని ముఖ్య సలహాదారు గొంతుపిసికి చంపబడి అతనితో కూడ పాతిపెట్టబడ్డాడు. అతడు స్వారీ చేసిన గుఱ్ఱము సహితం చంపబడి అదే శ్మశాన మంటిదిబ్బలో పాతిపెట్టబడింది. అతని సమాధికి సమీపాన ఉండిన మరొక సమాదిలో నుండి ఒక ప్రముఖ స్త్రీ, బహుశా అతని భార్యయై యుంటుంది, దేహము వెలికి తీయబడింది. ఆమెతో కూడ, జీవమునకు అవసరమగు వస్తుసామగ్రి పాతిపెట్టబడి యుండినవి. ఆమె యొక్క బానిస బాలిక, 13-19 సం||ల వయస్కురాలు, గొంతు పిసికి చంపబడి అదే సమాధిలో ఆమెతో కూడ పాతిపెట్టబడింది.

మరణానంతర జీవములో నమ్మకముంచినవారు Scythians ప్రజలు మాత్రమే కాదు. ఐగుప్తు దేశ పిరమిడులు మరియు నైలు నది పశ్చిమ తీరాన ఫరో రాజుల సమాధులు కట్టబడిన ఐగుప్తు దేశంలోని లోయ (Valley of the Kings), మరణానంతర జీవితంలో గల ఆశతో ప్రాచీన ప్రజలు పడిన ప్రయాసములకు సాక్ష్యమై యున్నవి. Scythians ప్రజలు మరియు ఐగుప్తీయుల వలె, క్రైస్తవులు ఇటువంటి మరణానంతర జీవితం కొరకు ఎదురుచూచుచున్నారు. అలాగైతే, క్రైస్తవ నిరీక్షణ ఎలా భిన్నమైనదై యున్నది? అది ఇతర ప్రజలకు గల ఆధారం కంటె యింకా ఎక్కువ ఆధారంగలదై యున్నదా? పునరుత్థానము గూర్చి పౌలు 1 కొరింథీ. 15వ అధ్యాయంలో వ్రాసినంత సవివరంగా ఒక గ్రంథకర్త వ్రాసిన ఇతర చోటు బైబిలులో ఏదియు లేదు.

పౌలు ప్రకారం, మరణానంతర జీవము గూర్చిన ఏ సంభాషణయైనను యేసు సిలువవేయబడుట మరియు పునరుత్థా నుడగుటకు సంబంధించిన సందర్భంలో తప్ప, ఇతరత్రా చర్చ ఏదీ జరగదు. "ఇప్పుడైతే క్రీస్తు మృతులలో నుండి లేపబడి యున్నాడని" అతడు వ్రాశాడు (15:20). అతడు ప్రకటించిన సువార్త సందేశానుసారంగా, లేఖనములు మరియు చరిత్ర ప్రభువు యొక్క మరణము, భూస్థాపనము, మరియు పునరుత్థానము చుట్టూర తిరిగుతున్నాయి (15:3, 4). ఈ మూడు ధ్రువీకరణములు సువార్తకు ప్రాథమికమైనవై యుంటుండగా, కొరింథులో పునరుత్థానము మాత్రమే వివాదాస్పదమైన విషయమై యుండింది. ఈ కారణాన్ని బట్టి, యేసు కొందరికి, పౌలు ఈ విషయాన్ని వ్రాయుచుండినప్పుడు సజీవులై యుండిన కొందరికి, ప్రత్యక్షమైన వివరాలను పౌలు సవివరంగా పొందుపర్చాడు (15:5-8). ఖాళీ సమాధి మరియు యేసు కొందరు ప్రత్యక్ష సాక్షులకు కనబడిన ప్రత్యక్షతల గూర్చిన వాస్తవములు, సంబంధిత అంశము క్రొత్త నిబంధనలో ఎన్నటికిని వెలసిపోకుండునంతగా అత్యంత ప్రధానమైనదై యున్నవి. ఇది ప్రాథమికమైన వాస్తవమై యున్నది గనుక యేసు దేవత్వమునకు సంబంధించిన సకల స్వాధికారాపేక్షలు దీని నుండి తలెత్తుతున్నవి:

ఈ యేసును దేవుడు లేపెను, దీనికి మేమందరము సాక్షులము (అపొ. 2:32).

మీరు జీవాధిపతిని చంపితిరి గాని దేవుడు ఆయనను మృతులలో నుండి లేపెను; అందుకు మేము సాక్షులము (అపొ. 3:15).

అయితే దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెను. ఆయన గలిలయ నుండి యెరూషలేమునకు తనతో కూడ వచ్చిన వారికి అనేక దినములు కనబడెను; వారిప్పుడు ప్రజల యెదుట ఆయనకు సాక్షులై యున్నారు (అపొ. 13:30, 31).

పౌలు రచించిన పత్రికలలో, సంబంధిత ఉద్ఘాటన భిన్నమైనదేమీ కాదు: పౌలు, యేసును మరియు మృతులలో నుండి లేపబడిన ఆయనను ప్రకటించిన మూలగ్రంథ పాఠం 1 కొరింథీ. 15వ అధ్యాయం ఒక్కటే కాదు. రోమా. 1:2-7లో, "యేసు క్రీస్తు మృతులలో నుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింప బడెను" అని అతడు రచించాడు. సువార్తలలో, లూకా మరియు యోహాను సువార్తీకులు పునరుత్థానము గూర్చి అత్యధిక వివరములను అందజేస్తున్నారు. స్త్రీలు ఆదివారమున తెల్లవారు చుండగా యేసు దేహము పాతిపెట్టబడిన సమాధి యొద్దకు వెళ్లారు, అయితే సమాధి ఖాళీగా ఉన్నట్టు కనుగొన్నారని లూకా చెప్పుతున్నాడు. అక్కడ ఇద్దరు దేవదూతలుండిరి. ఒక దూత, "మీరు సజీవుడైనవానిని మృతులలో ఎందుకు వెదకుచున్నారు?" అని వారిని ప్రశ్నించాడు (లూకా 24:1-5). అదే దినాన ఎమ్మాయు గ్రామానికి వెళ్లుచుండిన ఇద్దరు శిష్యుల గూర్చి కూడ లూకా తెలియజెప్పుతున్నాడు. యేసు వారిని కలుసుకొన్నాడు, వారితో సంభాషించాడు, ఆ తరువాత వారికి కనబడకుండా అదృశ్యమైయ్యాడు (లూకా 24:13-31). యేసు తన శిష్యులలో కొందరికి గలిలయ సముద్ర తీరాన ప్రత్యక్షమైన ఒక సంఘటనను యోహాను వర్ణించాడు (యోహాను 21:1-14; NIV).

ఆ యా సంఘటనలు చోటుచేసుకొనిన కాలములలో జీవించి వాటిని తరువాతి తరముల నిమిత్తము వర్ణించిన సాక్షుల నుండి తెలుసుకొనడం, గతంలో చోటుచేసుకొనిన ఏ సంఘటన గూర్చియైనాగాని తెలుసుకోడానికి గల ఒకే ఒక మార్గమై యున్నది. నివేదికల విశ్వసనీయత, సాక్షులు ఎలాంటివారై యుండిరో, వాస్తవాలు వారికి ఎలా తెలిశాయో లేక ఎలా అందుబాటులో ఉండినవో, వారు వినడం ద్వారా లేదా వదంతుల ద్వారా తెలిసికొనిన దానికి తారతమ్యంగా వారు వాస్తవంగా చూచిన దేమిటో, వారు చూచిన విషయాలను ఇతరులకు తెలియజెప్పారంటే దాని వెనుక ఉన్న ప్రోత్సాహకమేమిటో, మున్నగు విషయాలపై ఆధారపడి యుంటుంది. ఏ నిర్ణాయక ప్రమాణముల ప్రకారమైనను, యేసు మృతులలో నుండి లేపబడుట, అత్యధిక భద్రతతో ప్రామాణీకృతము చేయబడిన చరిత్రలోని సంఘటనలలో ఒకటై యున్నది.

సూచనలు

[1]Homer *The Odyssey* 11. దాదాపుగా 11వ పుస్తకమంతా మృతుల లోకంతో కొనసాగిన ఎదుర్కోలును వర్ణిస్తుంది. [2]Ben Witherington III, *Conflict and Community in Corinth: A Socio-Rhetorical Commentary on 1 and 2 Corinthians* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1995), 299. [3]ద్వితీ. 26:5-9, ఇశ్రాయేలీయుల సిద్ధాంతపరమైన ప్రాథమిక ప్రకటనయై యుండినదని తర్కించాడు. అతడు దీనిని ఇశ్రాయేలీయుల "విశ్వాస సూత్రం" అని పిలిచాడు. (Gerhard von Rad, *Old Testament Theology*, vol. 1, *The Theology of Israel's Historical Traditions*, trans. D. M. G. Stalker [Louisville: Westminster John Knox Press, 2001], 121–22, 17). [4]Such an approach is seen in Willi Marxen, "Study Two: The Geographical Outline," in *Mark the Evangelist: Studies on the Redaction History of the Gospel*, trans. James Boyce, Donald Juel, William Poehlmann, and Roy A. Harrisville (Nashville: Abingdon Press, 1969), 66–95. [5]Johannes Schneider, "ἔκτρωμα," in *Theological Dictionary of the New Testament*, ed. Gerhard Kittel, trans. and ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1964), 2:465. [6]F. F. Bruce, *Paul: Apostle of the Heart Set Free* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1977), 463. [7]"The Gospel of Philip (II, *3*)," trans. Wesley W. Isenberg in *The Nag Hammadi Library*, James Robinson, dir. (New York: Harper & Row, 1977), 144. [8]వేదాంత జ్ఞానవాదము క్రీ.శ. మొదటి శతాబ్దములోని తరువాతి సగభాగంలో కొన్ని సంఘాలను కలవరపరచిన ఆదిమ అపధర్మమై యుండింది. యేసు యొక్క యథార్థమైన మానవత్వమును కొందరు వేదాంత జ్ఞానవాదులు ఒప్పుకొనలేదు, మరికొందరు ఆయన దైవత్వమును ఒప్పు కొనలేదు. గనుక ఈ మిశ్రమ నమ్మకములు, వైరాగ్యము (శరీరానికి అవసరమైన పోషణ లేకుండ), దానిని నలగగొట్టుకొనుట (మొదలుకొని సుఖాసక్తవాదము) జీవితంలో సుఖం కోసం ప్రయత్నిడమే జీవిత పరమార్థమని చెప్పెడినవాదం వరకు గల వాదములు తలెత్తుటకు కారణమయ్యాయి. వేదాంత జ్ఞానతత్వవాదుల వర్గాల్లో ఒక ఆలోచన సమష్టి తాత్పర్యమై యుండింది: ప్రాథమికంగా వాగ్దానము చేయబడిన సమస్త రక్షణ గుప్తమైయున్న జ్ఞానము ద్వారా కలుగునని వారు స్వాధికారంతో చెప్పినది, వారికి మాత్రమే బయలుపరచబడింది. [9]J. Gresham Machen, *The Origin of Paul's Religion* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1947), 275–76. [10]William F. Orr and James Arthur Walther, *1 Corinthians*, The Anchor Bible (Garden City, N.Y.: Doubleday & Company, 1976), 325.

[11]George Eldon Ladd, *A Theology of the New Testament* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1974), 316. [12]Brevard S. Childs, *Biblical Theology of the Old and New Testaments: Theological Reflection on the Christian Bible* (Minneapolis: Fortress Press, 1992), 580. [13]Everett Ferguson, *Backgrounds of Early Christianity* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1987), 195. [14]Ronald H. Nash, *Christianity and the Hellenistic World* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1984), 70. [15]Alexander Balmain Bruce, *Apologetics*, International Theological Library (New York: Charles Scribner's Sons, 1892), 246. [16]Ibid. [17]Ladd, 326. [18]Ibid. [19]Augustine *City of God* 13.14. [20]Ibid.

[21]అగస్టీను (క్రీ.శ. 345-430), Tagaste లో జన్మించాడు. ప్రాచీన కార్తేజ్ (నేటి ట్యూనిస్) సమీపాన గలది. [22]David E. Garland, *1 Corinthians*, Baker Exegetical Commentary on the New Testament (Grand Rapids, Mich.: Baker Academic, 2003), 711. [23]Herman

Ridderbos, *Paul: An Outline of His Theology*, trans. John Richard DeWitt (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1975), 25. [24]క్రైస్తవులు మృతులైనవారికి బాప్తిస్మమిచ్చునట్లు వారిని ఉత్తేజితము చేసిన కొరింథులోని మతపరమైన దృష్టికోణాలను Richard DeMaris పరీక్షించాడు. (Richard DeMaris, "Corinthians, Religion and Baptism for the Dead [1 Cor. 15:29]: Insights from Archaeology and Anthropology," *Journal of Biblical Literature* 114 [Winter 1995]: 661–82.) [25]Garland, 719. [26]ఈ ఉపమాలంకార వ్యక్తీకరణము యొక్క ప్రాచీన ఉపయోగం గూర్చిన ఉదాహరణములు Abraham Malherbe, "The Beasts at Ephesus," *Journal of Biblical Literature* 87 (March 1968): 71–80. [27]సుఖాసక్తవాదులు సుఖభోగాల వెంటబడుతూ స్వీయ ఆనందంతో జీవించారు. [28]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature*, 3rd ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 1090. [29]Ibid. [30]Garland, 678.

[31]Wayne Grudem, *Systematic Theology: An Introduction to Biblical Doctrine* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1994), 613. [32]Richard E. Oster, Jr., *1 Corinthians*, The College Press NIV Commentary (Joplin, Mo.: College Press Publishing Co., 1995), 398. [33]Augustine *City of God* 13.17. [34]Garland, 735. [35]Oster, 402. [36]Ridderbos, 76, n. 110. [37]John McRay, *Paul: His Life and Teaching* (Grand Rapids, Mich.: Baker Academic, 2003), 419. [38]R. E. Winsett, "Jesus Is Coming Soon," *Songs of Faith and Praise*, comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994). [39]James D. G. Dunn, *The Theology of Paul the Apostle* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1998), 78. [40]Joachim Jeremias, "Flesh and Blood Cannot Inherit the Kingdom of God," *New Testament Studies* 2 (1955–56): 151–59.

[41]"పౌలు యొక్క ఆలోచనల పరంపరను Jeremias తప్పుగా వ్యాఖ్యానించాడని" గార్లండ్ ధ్రువీకరించాడు. "సమానార్థకమైన సమాంతరమును" ఉపయోగిస్తూ, "మానవుడు భౌతికంగా ఉనికి కలిగియుండు పరిస్థితి" గూర్చిన అభిప్రాయమును పౌలు సామాన్యంగా పునఃరుద్ఘాటించుచుండెనని అతడు చెప్పాడు. (Garland, 741.) [42]Augustine *City of God* 22.23. [43]Jan Chochorowski and Sergei Skoryi, "Prince of the Great Kurgan," *Archaeology* 50 (September/October 1997): 32–39.